
MB PUBLICATIONS
ఫైటింగ్ స్టార్
మధుబాబు

# ఫైటింగ్ ఫోర్

ఉలిక్కిపడి కనులు తెరిచాడు షాడో.

చక్కటి నిద్ర అంత సడెన్‌గా చెడిపోవటానికి కారణాన్ని అన్వేషిస్తూ కనుచివరల నుంచి చుట్టూ చూశాడు.

బ్రహ్మాండంగా వుంది బయట వాతావరణం. ఎటువంటి ఒడిదుడుకులకు లోనుగావటం లేదు అతను ప్రయాణిస్తున్న బోయింగ్ విమానం.

ఎవరి సీట్లలో వారు కూర్చుని హాయిగా కునికిపాట్లు పడుతున్నారు ప్రయాణీకులు అందరూ. షాడో వైపు ఎవరూ చూడటం లేదు.

మరి మెలకువ ఎందుకు వచ్చినట్లు ?

"డూ యూ వాన్ట్ ఎనీ థింగ్ సర్?" షాడో ముఖంలో ప్రతిఫలిస్తున్న భావాలను గమనించి గబగబా దగ్గిరికి వస్తూ అడిగింది ఎయిర్ హోస్టెస్ .

నేర్పుగా తన ఆలోచనలను దాచేసుకున్నాడు షాడో.

"ఏమీ అక్కరలేదు మేడమ్! చక్కటి నిద్రలో దారుణమైన పీడకల వచ్చింది. అందుకే అటూ ఇటూ చూస్తున్నాను."

తడుముకోకుండా సమాధానం యిచ్చేసి, కనులు మూసుకున్నాడు.

రెండు నిమిషాల తరువాత మెల్లిగా అతన్ని చేరుకుంది నిద్రాదేవత. సరిగ్గా మూడో నిముషం నడుస్తుండగా ముఖం మీద చరిచినట్లు మరోసారి వచ్చేసింది మెలకువ.

అతనికి తెలియకుండానే విండో దగ్గిర అరేంజి చేయబడిన యాష్ ట్రే వైపు మరలాయి చూపులు. యాష్ ట్రే ప్రక్కనే వుంది అతని సిగరెట్ పాకెట్. ముందు కాళ్ళతో దాన్ని నొక్కిపట్టి, సూదుల్లా పదును తేరి వున్న ముందు పళ్ళతో లోపల వున్న సిగరెట్లను బయటికి లాగుతోంది ఒక చిట్టెలుక.

తన కనులను తానే నమ్మలేక విచిత్రంగా చూశాడు షాడో.

ఆస్ట్రేలియాలో కొంతమంది మోజుపడి పెంచుకునే పెంపుడు ఎలుక అది. తెల్లటి శరీరంతో, పొడుగాటి తోకతో ముద్దుగా కనిపిస్తుంది. చిలిపి పనులతో, చిన్న చిన్న సర్కస్ ఫీట్స్‌తో అందరినీ మురిపిస్తుంది.

“కమాన్ బేబీ......కమ్ హియర్” కుతూహలాన్ని అణుచుకోలేక చూపుడు వేలిని ముందుకు జాస్తూ పిలిచాడు.

ఉలిక్కిపడి అతని కనుల్లోకి చూసిందా చిట్టెలుక. అంగళం పొడవు వున్న మీసాలను ముందు కాళ్ళతో సవరించుకుంటూ దీర్ఘంగా ఆలోచించింది.

మెల్లిగా చేతిని ముందుకు పోనిచ్చి, చటుక్కున దాని తోకను పట్టుకున్నాడు షాడో. గాలిలోకి ఎత్తి ఏడిపిద్దామని అతని ఉద్దేశ్యం.

జలగలా అతని చేతిలో నుంచి జారిపోయిందది. యాష్ ట్రే మీదికి ఎక్కి రెండు పిల్లిమొగ్గలు వేసింది. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో ముందు సీటు క్రిందికి పోయి మాయం అయింది.

దాని కదలికల్లోని చురుకుదనానికి ఆశ్చర్యపడుతూ సీటు దగ్గిర వున్న బెల్‌ని నొక్కి ఎయిర్ హోస్టెస్‌ని పిలిచాడు షాడో.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్..... నా పేరు శామ్ డస్టర్. నేను జర్మనీ నుంచి సింగపూర్ పోతున్నాను" అంటూ వున్నట్లుండి అతని ముందు ప్రత్యక్షం అయ్యాడు ఒక మధ్య వయస్కుడు.

నొసలు ముడివేస్తూ తల వూపాడు షాడో.

"మీరు అన్యధా భావించకపోతే ఒక చిన్న రిక్వెస్ట్" అంటూ అతని ప్రక్కనే ఖాళీగా వున్న సీట్లో కూర్చున్నాడు శ్యామ్ డస్టర్.

సమాధానం యివ్వలేదు షాడో. సిగరెట్ పాకెట్ తీసి సిగరెట్ వెలిగించుకుంటూ మౌనంగా వుండిపోయాడు.

"ఇందాక మీరు చూసిన చిట్టెలుక నాది. దయచేసి దాని విషయం ఎయిర్ హోస్టెస్‌కి చెప్పకండి. విమానంలోకి అటువంటి జంతువుల్ని తీసుకురావటానికి వాళ్ళు వప్పుకోరు" దీనంగా చూస్తూ బ్రతిమలాడాడు శామ్ డస్టర్.

షాడో పెదవుల మీద వెంటనే ప్రత్యక్షం అయింది ఒక చిరునవ్వు.

"డోన్ట్ వర్రీ మిస్టర్ శామ్ .... మీ బేబీని పట్టివ్వటానికి కాదు నేను ఎయిర్ హోస్టెస్‌ని పిలిచింది. మీరు నిశ్చింతగా వుండండి. బేబీని మాత్రం జాగ్రత్తగా బంధించి వుంచండి. ఇతర ప్రయాణీకులు ఎవరైనా చూస్తే గోల గోల అవుతుంది" అన్నాడు.

ఒక్కసారిగా వికసించింది ఆ వ్యక్తి ముఖం.

"థేంక్యూ వెరీ మచ్ సర్....థేంక్యూ వెరీ మచ్" అంటూ గబగబా తన సీట్లోకి వెళ్ళిపోయాడు.

ఎయిర్ హోస్టెస్ రాగానే స్ట్రాంగ్ కాఫీని తెప్పించుకున్నాడు షాడో. కాఫీ తాగి మరో సిగరెట్ వెలిగించుకుంటూ తన పొజిషన్‌ని అంచనా వేసుకున్నాడు.

మరో రెండు గంటల్లో బర్మా దేశంలోని మెర్గ్వాయ్ సిటీని చేసుకుంటుంది విమానం. మెర్గ్వాయ్ మంచి పాతిక మైళ్ళ దూరంలో వుంటుంది ట్రిపోలి సిటీ........

అప్రయత్నంగా ఒక రోజు వెనక్కి మరలాయి షాడో ఆలోచనలు. ఆ రోజు జరిగిన సంఘటనలు సినిమా రీళ్ళ మాదిరి కనులముందు మెదిలేసరికి తనను తాను మరిచిపోయాడు. తన మనస్సులో ఒక మూలగా మెదులుతున్న ఆందోళనను కూడా విస్మరించాడు.

## 2

న్యూఢిల్లీ త్రీ టవున్ స్కర్ట్స్‌లో విశాలమైన పూతోట మధ్య వుంటుంది అందమైన పెద్ద బంగ్లా ఒకటి.

ఎప్పుడు చూసినా నిర్మానుష్యంగానే కనిపిస్తుందది. పూలతోటలో పనిచేసే గార్డనర్స్ తప్ప మరో నరమానవుడెవరూ అక్కడ నివసిస్తున్న జాడలు అగుపించవు.

“మనం దారి తప్పి వచ్చినట్లున్నాం చంద్రా! మన కోసం ఎవరూ ఎదురు చూడటం లేదిక్కడ!” ఎవరూ కనిపించని పోర్టికోలో కారు దిగి, చుట్టూ చూస్తూ అన్నాడు షాడో.

కనుసైగతో అతన్ని హెచ్చరించటానికి ప్రయత్నించాడు చంద్ర. కనీసం గట్టిగా దగ్గి, నెత్తిమీద కొట్టుకుంటేనైనా అతను గమనిస్తాడేమోనని ఆశపడ్డాడు.

అటువంటిదేమీ జరగలేదు. మాట నోరు దాటిన తరువాత గాని షాడోకి కనిపించలేదు కులకర్ణిగారు.

"రమ్మన్న టైమ్‌కి బయలుదేరి రావటం చేతకాని వీరాధి వీరులకు స్వాగత సన్నాహాలు కావాల్సి వచ్చాయా? మీ కోసం ఎవరో ఒకరు ఎదురు తెన్నులు చూస్తూ చేతులు కట్టుకొని నిలబడలా? కబురు పంపినట్లయితే బొట్టుకాటుకలు రెడీ చేసి బాండ్ మేళాన్ని పిలిపించే వాడిని కదా!" అంటూ పోర్టికోలో ప్రక్కనే వున్న పూలపందిరి చాటునుంచి యివతలకు వచ్చారాయన.

ఒక్క గంతులో కారు ఎక్కి శరవేగంతో అక్కడి నుంచి వెళ్ళిపోవాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అణిచిపెట్టుకొని స్టిఫ్‌గా శాల్యూట్ చేశాడు షాడో.

"నీ లాంటి నిద్ర ముఖాల్ని సి.ఐ.బి.లో చేర్చుకున్నందుకు ఎంతగా సిగ్గుపడుతున్నానో ఆ భగవంతుడికి కూడా తెలియదు. దుస్తులు కూడా ధరించటం చేతకాని వాడివి, బాధ్యతాయుతమైన పనుల్ని ఎలా నిర్వహిస్తావో నాకు అంతుబట్టటం లేదు" ఆరిపోయిన సిగార్‌ని అలాగే చేతిలో పట్టుకొని గుర్రుగా చూస్తూ మరో చురక అంటించాడు కులకర్ణి.

ఉలిక్కిపడి షర్టు వంక చూసుకున్నాడు షాడో. హడావుడిగా బయలుదేరి రావటం వల్ల షర్టు బటన్స్ సరిగ్గా పెట్టుకోలేదు. ఎడమ కాలి బూట్ లేసు కొంచెం వదులై క్రిందికి వ్రేలాడుతోంది.

మొట్ట మొదటిసారిగా వార్నింగ్ అలారమ్స్ మ్రోగటం ప్రారంభించాయి అతని అంతరంగంలో. నిద్రముఖాల్ని గురించి, వూడిపోయిన చొక్కా గుండీలను గురించి కులకర్ణి గారు ఉపన్యాసాలు ప్రారంభించారంటే పెద్ద గోల ఏదో

జరుగుతున్నట్లే లెక్క! సి.ఐ.బి.కి సంబంధించని జనం బంగ్లా లోపల వున్నారు. వారి ముందు తన ఏజెంట్లు తేలిక పడటం ఆయనకు ఇష్టం వుండదు.

షాడో ఆలోచనలు పూర్తికాక ముందే పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అక్కడ ప్రత్యక్షం అయినారు హోమ్ మినిష్టర్ గారు.

“హల్లో రాజూ...... వుయార్ వెయిటింగ్ ఫర్ యూ......కమాన్ బోయ్..... కమాన్” అంటూ అతని చేయి పట్టుకొని పరుగులాంటి నడకతో లోపలికి తీసుకుపోయారు.

విశాలమైన హాలు ఒకటి వుంది బంగ్లా లోపలి భాగంలో. అక్కడ కనిపించిన పెద్ద మనుష్యుల్ని గమనించే సరికి చెప్పరాని ఆశ్చర్యం షాడో మనసులో చోటు చేసుకుంది.

స్పెషల్ బ్రాంచి డైరెక్టర్లు, మిలటరీ ఇంటలిజెన్స్ అధికారులు, చీఫ్ ఆఫ్ అర్మీస్టాఫ్, నావికాదళానికి వైమానిక దళానికి చెందిన ఉన్నతాధికారులు, ప్రభుత్వ విధానాలను పరివేక్షించే ప్రధాన రాజకీయనాయకులు మొదలైన పెద్దలందరూ కుషన్ ఛైర్లలో ఆశీనులై వున్నారు.

అందరికీ దూరంగా, అలసట నిండిన కనులతో, ఏవో ఫైల్స్‌ని చూసి, తమ సెక్రటరీలకు ఆర్డర్స్ పాస్ చేస్తూ కనిపించారు ప్రధానమంత్రి.

అప్రయత్నంగా అటెంక్షన్‌లో నిలబడి అభివాదం చేశాడు షాడో.

చేతిలోని ఫైల్స్‌ని సెక్రటరీలకు అందించి చిరునవ్వులు చిందించారు ప్రధానమంత్రి.

“ఉపోద్ఘాతాలు చెప్పుకునే సమయం మనకు లేదు రాజూ...... అనసవరమైన వివరాలతో కాలక్షేపం చేయకుండా అసలు విషయం ఏమిటో నీకు చెపుతాను. అయితే అందుకు ముందు ఒక చిన్న ప్రశ్న అడగాలని వుంది. మన ఆయిల్ పొజిషన్‌ని గురించి నీకు ఎంత వరకూ తెలుసు?” కూర్చున్న ప్రదేశంలో నుంచి లేచి షాడోకి ఎదురుగా వున్న ఒక టేబిల్ ముందు అశీనులౌతూ ప్రశ్నించారు.

శరవేగంతో ఆలోచించటానికి ప్రయత్నించాడు షాడో.

దేశంలో ఆయిల్ పొజిషన్ తనకు తెలిసినంత వరకూ బాగానే వుంది. ఇటీవలి కాలంలో ఏవైనా గొడవలు జరిగితే తప్ప ప్రధాని నోటి వెంట అటువంటి ప్రశ్న వెలువడదు. ఏమిటా గొడవలు ?

ఆరిపోయిన సిగార్‌ని అవతల పారేయకుండా, యింకా చేతిలోనే పట్టుకొని వున్న కులకర్ణిగారికి వెంటనే అర్థం అయిపోయింది అతని డైలమా.

“బ్లడీ యిడియట్.... ఆయిల్‌ని అన్వేషించటానికి మనం చేస్తున్న ప్రయత్నాలను గురించిన ప్రశ్న అది..... కిరసనాయిలు కోసం క్యూలలో నిలుచోవటాన్ని గురించి కాదు.” లోగొంతుకతో అతనికి మాత్రమే వినిపించేటట్లు హెచ్చరించారాయన. అంతటితో ఆగకుండా బూటుకాలితో అతని చీలమండ మీద బలంగా కొట్టారు.

నరాలు జివ్వుమనే బాధ కలిగించే సరికి ఒక్కసారిగా కదిలింది షాడో ఆలోచనా స్రవంతి. ఎందుకైనా మంచిదని కులకర్ణి గారి బూటు కాలికి అందనంత దూరంగా జరుగుతూ, తనకు తెలిసిన విషయాలన్నిటినీ గడగడా చెప్పేశాడు.

రోజు రోజుకూ పెరుగుతున్న ఆయిల్ ధరలను తట్టుకోలేక, స్వదేశంలో వున్న ఆయిల్ వనరులను పూర్తిగా వినియోగించుకోదలిచింది భారత ప్రభుత్వం. పంచవర్ష ప్రణాళికలలో ఆ విషయానికి ప్రాధాన్యత నిచ్చి, ఆయిల్ వాసన వచ్చిన ప్రదేశానికల్లా ఎక్స్‌పర్ట్స్‌ని పంపించి వెతికిస్తోంది.

ఆ పట్టుదల ఫలితంగానే ఆయిల్ దొరికింది బాంబే హైలో. సముద్రపు అడుగున దాగుకొని వున్న నూనె సంపదను బలవంతంగా బయటికి లాగటంలో భారతీయులు చూపిన ప్రతిభను వేనోళ్ళతో కొనియాడింది ప్రపంచం.

ఆ విజయోత్సాహంలో మైమరిచిపోయి మరిన్ని పరిశోధనలు చేశారు భారత ఇంజనీర్లు. అప్రతిహతంగా పురోగమించాయి వారి ఇన్వెస్టిగేషన్స్. బండరాళ్ళతో నిండి వుండే వింధ్య పర్వతాల మధ్య అపూర్వమైన ఆయిల్ నిలువలు వున్నట్లు తెలియ వచ్చింది.

షాడో యిచ్చిన సమాధానాన్ని విని సంతృప్తిగా తల వూపారు ప్రధానమంత్రి.

"వెరీ గడ్ రాజూ..... యువర్ ఎగ్జాక్టిలీ కరెక్ట్. వింధ్య పర్వత శ్రేణిలో వున్న ఆయిల్‌ని బయటకు తీయటానికి మనం చేస్తున్న ప్రయత్నాలను గురించి ఏమైనా చెప్పగలవా?" అంటూ వేశారు మరో ప్రశ్న.

బిక్కముగంతో కులకర్ణిగారి వైపు చూశాడు షాడో.

అది గమనించి చిన్నగా నవ్వారు హోం మినిస్టర్ గారు.

"డోన్ట్ వర్రీ మై బోయ్.....శక్తివంతమైన డైనమైట్లకు కూడా లొంగని ఆ బండరాళ్ళలో నుంచి ఆయిల్‌ని తీయటం అసాధ్యమని గ్రహించిన మన ఇంజనీర్లు

ఆశల్ని వదులుకున్నారు. అంత వరకే అందరికీ తెలుసు. ఆ తరువాత జరిగిందేమిటో యింత వరకూ మాకు తప్ప మరెవరికీ తెలియదు. నువ్వు అనవసరంగా ఖంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. టేక్ యువర్ సీట్ అండ్ లిజెన్ కేర్‌ఫుల్లీ......" అంటూ ఖాళీగా వున్న కుర్చీవైపు చేయి చూపించారు.

ఆయన మాటలతో ఏకీభవిస్తున్నట్లు తల వూపి చిన్నగా గొంతు సవరించుకున్నారు ప్రధానమంత్రి.

"వింధ్య పర్వతాలలోని బండరాళ్ళలో దాగుకొని వున్న ఆయిల్‌ని బయటికి తీయటానికి అపూర్వమైన పధకాన్ని ఆలోచించారు ట్రాంటే ఆటమిక్ ప్లాంట్‌లో పని చేస్తున్న మన వైజ్ఞానికులు. జపాన్ సాంకేతిక నిపుణుల సహకారంతో, సోవియట్ సైంటిస్టుల పరివేక్షణలో టోక్యో నగరానికి దగ్గిరలో వున్న ఒక సైంటిఫిక్ లేబరేటరీలో అత్యాధునికమైన ఆటమిక్ డిటనేటర్ ఒకటి తయారు చేయబడింది. "

"దాని సహాయంతో వింధ్య పర్వతాల మధ్య బ్రహ్మాండమైన బిలద్వారాన్ని ఏర్పరిచి ఆయిల్ అన్వేషణకు మార్గాన్ని కల్పించటం వారి ధ్యేయం. అయితే అనుకోకుండా ఒక ప్రమాదం జరిగిపోయింది. మన నౌకాదళానికి చెందిన ఒక డిస్ట్రాయర్ నౌకలో అత్యంత శక్తివంతమైన ఆ డిటోనేటర్‌ని తీసుకు వస్తుండగా, బంగళఖాతం సమీపంలో డిస్ట్రాయర్ నౌక అదృశ్యం అయిపోయింది. దానితో పాటు డిటనేటర్ కూడా మాయం అయింది. "

ఝల్లుమంది షాడో శరీరం ఆ మాటల్ని వినగానే.

ఆటమిక్ డిటనేటర్స్ అంటే ఆటంబాంబుల కంటే ప్రమాదకరమైన ఆయుధాలు. పడకూడని చేతుల్లో అవి పడితే సర్వనాశనం జరిగితీరుతుంది. ఉపయోగించకూడని ప్రదేశాల్లో వాటిని ఉపయోగిస్తే దారుణమైన విధ్వంసకాండ ఉత్పన్నమౌతుంది.

షాడో మనసులో మెదులుతున్న ఆలోచనలను గమనించి బరువుగా నవ్వారు ప్రధాన మంత్రి.

"అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే తప్ప వినాశకర కార్యాలకు వినియోగించకూడదని ప్రచారం చేస్తున్న మన దేశాన్ని వెన్నుపోటు పొడవటానికి, కావాలని ఎవరో చేసిన దుర్మార్గ కార్యం యిది. అన్ని రంగాలలోను స్వయం సమృద్ధిని సాధించుకుంటూ ప్రగతి పథంలో పురోగమిస్తున్న మన మీద సాధించటం కోసమే యిలా చేయబడింది. "

"ఐ వాన్ట్ యూ టూ ఫైండ్ అవుట్ రాజూ..... ఈ దారుణానికి ఒడికట్టి మనల్ని అపనిందల పాలు చేయదలచిన ఆ దుర్మార్గుల్ని వెతికి పట్టుకొని తగిన గుణపాఠం నేర్పాలి. అమూల్యమైన మన డిటనేటర్‌ని సురక్షితంగా తీసుకురావాలి." ఆవేశం రగులుకుంటున్న కంఠంతో గంభీరంగా అన్నారు.

సిగరెట్‌ని వెలిగించుకోవాలన్న కోరికను బలవంతంగా అదిమిపట్టుకుంటూ కులకర్ణిగారి వైపు తిరిగాడు.

"బంగాళాఖాతంలో అడుగు పెట్టిన మన డిస్ట్రాయర్ ఏమయిందో తెలుసుకోవటానికి స్పెషల్ బ్రాంచి ఏజెట్లు పరిశోధనలు ప్రారంభించారు రాజూ..... బర్మా దేశంలోని మెర్గుయ్ సిటీలో పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీకి చెందిన

అధికార్లు కొందరు తిరుగుతున్నట్లు మనకు తెలిసింది. డిటనేటర్ వ్యవహారంలో వారి చేయి వున్నట్లు అనుమానంగా ఉందని ఒక ఏజెంట్ మనకి కబురు పంపటం జరిగింది.''

''నువ్వు వెంటనే మెర్గ్గాయ్ సిటీ వెళ్ళి ఆ ఏజెంట్‌ని కలుసుకోవాలి. అన్ని విషయాలు తెలుసుకొని వెంటనే కార్యరంగంలోకి దూమకాలి.'' లావుపాటి ఫైల్ నొకదాన్ని షాడో చేతికి అందిస్తూ అన్నారు హోమ్ మినిష్టర్ గారు.

ఉన్నట్లుండి గొంతు సవరించుకున్నారు అంతవరకూ మౌనంగా వున్న స్పెషల్ బ్రాంచి డైరెక్టర్లు.

''మా ఏజెంట్ పంపిన మెస్సేజి ఆధారంగా ఒక ప్రత్యేకమైన పద్ధతిలో పరిశోధన ప్రారంభించేందుకు నిర్ణయించాము. బర్మా వెళ్ళిన తర్వాత నువ్వు.......'' అంటూ షాడోకి యింకేదో చెప్పబోయిన ఒక డైరెక్టర్ మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నారు కులకర్ణి.

''అప్పగించిన ఎస్సైన్‌మెంట్‌ని జయప్రదంగా ఫినిష్ చేయటానికి పరిశోధనలు ఎక్కడ ఎప్పుడు ఏ విధంగా ప్రారంభించాలో మాకు బాగా తెలుసు జంటిల్మన్. మీ డైరెక్షన్స్ అనవసరం.'' అంటూ కుర్చీలో నుంచి లేచి షాడోకి సైగ చేశారాయన.

ప్రధానమంత్రికి, మిగిలిన వారందరికీ విష్ చేసి బయటికి వచ్చాడు షాడో.

నల్లగా కమిలిపోయిన ముఖాలతో గుర్రుగా చూస్తున్నారు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్లు. కనుచివరల నుంచి వారి బాధను గమనించి తనలో తను నవ్వుకుంటూ, ప్రధాని పర్మిషన్ తీసుకొని షాడోని అనుసరించాడు కులకర్ణి.

“అర్జంటుగా హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళాలి మనం. బర్మాలో పొలిటికల్ సిచ్యుయేషన్ ఏమీ బాగోలేదు. ఆ విషయాలు తెలుసుకోకుండా నువ్వు అక్కడికి బయలుదేరటం నాకు ఇష్టం లేదు.” అని షాడోతో అంటూ, పోర్టికోలో రెడీగా వున్న అంబాసిడర్ డోర్ మీద చేయి వేశారాయన.

అప్రయత్నంగా అక్కడికి వంద గజాల దూరంలో వున్న ఒక మర్రిచెట్టు మీదికి ప్రసరించాయి ఆయన చూపులు.

“మైగాడ్.... గెట్ డౌన్ రాజూ.... గెట్ డౌన్......” అని హెచ్చరిస్తూ , ఉన్న పళాన జంప్ చేసి ఒక పొద చాటున పడ్డారు.

అటువంటి మాటలు రెండోసారి చెప్పించుకునే అలవాటు షాడోకి ఏనాడూ లేదు. హెచ్చరిక వినబడిన మరుక్షణం తల్లక్రిందులుగా పల్టీకొట్టి అంబాసిడర్ ప్రక్కన నేలను కరుచుకున్నాడు .

ధనాధన్ మని వికృత శబ్దాలు చేశాయి రెండు రివాల్వర్లు. పొగలు విడుస్తూ వేగంగా వచ్చి అంబాసిడర్ వెనువైపున వున్న అద్దాన్ని ముక్కలు ముక్కలు చేశాయి వాటి బుల్లెట్లు.

అప్రయత్నంగా తన రివాల్వర్‌ని బయటికి తీసి మర్రిచెట్టు వైపు తిప్పాడు షాడో. ట్రిగ్గర్‌ని నొక్కిన మరుక్షణం వైల్డ్‌గా వూగాయి చెట్టుకొమ్మలు. జర్రున జారి ప్రవారీ గోడ దగ్గిర పడింది ఒక లావుపాటి భారీ ఆకారం.

రెండో ఆలోచన లేకుండా పైకి లేచి అటువైపు పరుగు తీశాడు షాడో. అదే సమయంలో కొమ్మల్లో నుంచి క్రిందికి దూకింది రెండో ఆకారం. ప్రహరీ గోడ దగ్గిరి పడింది ఒక లావుపాటి భారీ ఆకారం.

ప్రహరీ దగ్గిర పడిపోయిన మొదటి ఆకారానికి చేతిని అందించి, పిక్కబలం చూపించింది.

రివాల్వర్‌ని రెడీగా పట్టుకొని వాటిని వెన్నంటాడు షాడో. అంబాసిడర్‌లో వున్న ఐరన్ రాడ్‌ని తీసుకొని అతన్ని అనుసరించాడు చంద్ర. అరగంట సేపు బంగ్లా చుట్టు పట్ల వున్న చెట్లను పుట్టలను అన్నిటినీ గాలించారు వాళ్ళిద్దరూ. ఎంత వెతికినా, ఎన్నిచోట్ల గాలించినా పారిపోయిన ఆకారాలు వారి కంటికి కనిపించలేదు.

"ఒక దుర్మార్గుడి ముఖం నాకు బాగానే కనిపించింది సార్...... వాడి ముఖం మీద పెద్ద పెద్ద మచ్చలున్నాయి. వెయ్యమందిలో నిలబడినా తేలికగా గుర్తుపట్టగలను......" వెతికి వెతికి నీరసంగా వెనక్కి తిరుగుతూ అన్నాడు చంద్ర.

## 3

చంద్ర మాటలు మనసులో మెదిలేసరికి వులిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చేశాడు షాడో. అతనికి తెలయకుండానే అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు సీట్లో నుంచి.

"వాట్ హేపెన్డ్? వాట్ హేపెన్డ్??" ఆశ్చర్యంగా అడుగుతూ అతని భుజం మీద చేయి వేసింది అప్పుడే అటుగా వస్తున్న ఎయిర్ హోస్టెస్.

ఆమె చేతిని విదిలించి కొట్టాడు షాడో. పరుగులాంటి నడకతో విమానం ముందు భాగంలో వున్న సీట్స్ పైపు పోయాడు.

కులకర్ణిగారు చెప్పిన వివరాలతో, ఎస్సైన్‌మెంట్‌ని గురించిన ఆలోచనలతో మొద్దుబారిపోయింది తన మెదడు.... చంద్ర చెప్పినట్లు మచ్చల ముఖం టూరిస్ట్ ఒకతను తనతో పాటు విమానం ఎక్కాడు. ఎవరితోను మాట్లాడకుండా, ఎక్కడికి కదలకుండా సీటులోనే వుండిపోయాడు.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వచ్చిన షాడోకి వెక్కిరిస్తున్నట్లు కనిపించింది ఖాళీ సీటు.......

"మేడమ్...... మీరేమీ అనుకోకపోతే ఈ సీటులో కూర్చున్న వ్యక్తి ఏమయినాడో కొంచెం చెప్పగలరా?" తన ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ, వెన్నంటి వచ్చిన ఎయిర్ హోస్టెస్‌ని అడిగాడు షాడో.

"మీ ప్రవర్తన చాలా విచిత్రంగా వుంది సర్...... ఈ సీట్లో కూర్చున్న మనిషి కలకత్తాలోనే దిగిపోయాడు. అర్జంట్ పని ఏదో గుర్తుకు వచ్చిందని ఆఖరి నిముషంలో జర్నీ కాన్సిల్ చేసుకున్నాడు." ఆందోళన నిండిన కనులతో అతని ముఖం లోకే పట్టి పట్టి చూస్తూ చెప్పిందామె.

"మైగాడ్! కలకత్తాలోనే దిగిపోయాడా? అయితే మరి ఈ బ్రీఫ్‌కేస్ ఎవరిది? సీటుక్రింద కనపడీ కనపడనట్లుగా పెట్టి వున్న చిన్న బ్రీఫ్‌కేస్‌ను చూపిస్తూ వెంటనే అడిగాడు షాడో.

ఉలికిపాటును కప్పిపెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ ముందుకు వంగింది ఎయిర్ హోస్టెస్......

షాడో మనసులో ఎక్కడో ఒక మూలగా దాగుకొని వున్న ఆందోళన ఒక్కసారిగా పెరిగి పెద్దదై పోయింది. ఉన్నట్లుండి జలదరించింది అతని శరీరం.

కంటికి కనిపించని ప్రమాదాలను కూడా ముందుగానే పసికట్టి అతన్ని హెచ్చరించే సిక్స్‌త్ సెన్స్ ప్రమాదం ముంచుకు వస్తున్నదని వార్నింగ్స్ పంపటం మొదలు పెట్టింది.

వెనుకా ముందు ఆలోచించదలుచుకోలేదు షాడో. తన అంచనా తప్పు అయితే, అనవసరమైన చిక్కుల్లో పడవలసి వస్తుందని తెలిసి కూడా వెనుకంజ వేయలేదు.

"సమ్ థింగ్ యీజ్ రాంగ్ విత్ ది బ్రీఫ్‌కేస్! విమానం వెనక్కి పోయి మీ ప్రాణాలు కాపాడుకోండి......." అని అరిచాడు బిగ్గరగా. అరుస్తూనే ఎయిర్ హోస్టెస్ చేయి పట్టుకొని వెనక్కి నెట్టేశాడు బలంగా.

అతని మాటలు పూర్తి అయిన మరుక్షణం ముంచుకు రానే వచ్చింది ప్రమాదం. అంతవరకూ కదలకుండా సీటు క్రింద వున్న బ్రీఫ్‌కేస్ ఎవరో కదిలించినట్లు ప్రక్కకు వరిగింది. టప్ మని వినవచ్చిందొక శబ్దం. తెల్లటి పొగ సుడులు తిరుగుతూ గాలిలోకి లేచింది.

గొల్లున అరిచి సీట్లలో నుంచి లేచారు ప్రయాణీకులు. ఒకరి కాళ్ళకు మరొకరు అడ్డం పడుతూ విమానం వెనుక భాగంలోకి పరుగులు తీయటం మొదలు పెట్టారు.

చెమటలు క్రమ్మిన ముఖంతో, వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో డిస్పరేట్‌గా చుట్టూ చూశాడు షాడో.

ఏ క్షణంలోనైనా బ్రద్ధలైపోతుంది బ్రీఫ్‌కేస్...... తనతో పాటు విమానాన్ని, అందులోని ప్రయాణీకుల్ని బలి పుచ్చుకుంటుంది......

కేవలం తన ఒక్కడి కోసమే అరేంజి చేయడిన ట్రాప్ అది. తన ప్రాణాలు పోయినా ఫరవాలేదు గాని, అన్నెం పున్నెం ఎరుగని అమాయకులైన ప్రయాణీకులు కూడా తనతో పాటు హతమారి పోకూడదు.

"గెట్ డౌన్ ఎవ్రీ బడి...... సీట్ల వెనుక కదలకుండా కూర్చోండి..... ఎట్టి పరిస్థితులలోనూ తలలు ఎత్తి తొంగి చూడకండి......" అని ప్రయాణీకులను హెచ్చరిస్తూ బ్రీఫ్‌కేసు హేండిల్‌ని పట్టుకొని, ప్రక్కనే వున్న ద్వారం వైపు జంప్ చేశాడు.

అటువంటి ఎమర్జెన్సీ కోసమే అక్కడ అరేంజి చేయబడి వుంటుంది ఒక లీవర్. షాడో చేయి పడగానే స్మూత్‌గా కదిలి, దృఢంగా బిగించి వున్న డోర్‌ని రిలీజ్ చేసేసింది అది.

ఊపిరి బిగపట్టి బలంకొద్దీ విసిరాడు షాడో చేతిలో వున్న బ్రీఫ్‌కేస్‌ని. గింగిరాలు తిరుగుతూ బయటికి పోయి ఏటవాలుగా క్రిందికి జారిపోయింది అది. పోతూ వుండగానే వినవచ్చింది భయంకరమైన శబ్దం. కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది. వాతావరణం లోకి ప్రవేశించిన ప్రేలుడు తరంగాల తాకిడికి సుడిగాలిలో చిక్కిన ఎండుటాకులా అల్లల్లాడిపోయింది విమానం. మ్రోతలు చేస్తూ, తెరిచి వున్న డోర్‌లో నుంచి విమానం లోపలి భాగంలోకి ప్రవేశించింది బలమైన గాలి తెర ఒకటి.

బ్రీఫ్‌కేసులోని బాంబ్ బ్రద్ధలు కాగానే అటువంటి పరిస్థితి ఎదురుపడుతుందని షాడోకి తెలుసు. అందుకే డోర్ ప్రక్కగా వున్న సీటును గట్టిగా పట్టుకొని ఒక కాలిని డోర్ లీవర్ కేసి తన్నిపెట్టి రెడీ అవబోయాడు.

కీచుమంటూ వినవచ్చింది ఒక అస్పష్టమైన శబ్దం. అదిరిపడి అటు చూసిన షాడో కనులకు డోర్ లీవర్ దగ్గిర గిలగిల లాడుతున్న చిట్టెలుక కనిపించింది.

"మైగాడ్! జాగ్రత్తగా బంధించి వుంచమని చెపితే వినిపించుకోకుండా మళ్ళీ దీన్ని వదిలేశాడు ఆ దుర్మార్గాడు.... దీనికి రోజులు చెల్లిపోయాయి." ఆందోళనగా అనుకుంటూ లీవర్ మీద కాలును ప్రక్కకు జరిపాడు.

మరోసారి కీచుగా అరిచి అవతలికి పారిపోయిందా చిట్టెలుక. అదే సమయంలో షాడోని చుట్టుముట్టి బలంగా ప్రక్కకు నెట్టింది గాలి తెర. కదిలించిన కాలుకు పట్టు దొరక లేదు. శరీరంలో వున్న శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకొని సీటును అంటి పెట్టుకొని వుండటానికి ప్రయత్నించాడతను.

ఫలించలేదు అతని ప్రయత్నం. మ్రోతలు చేస్తూ వచ్చిన గాలి అతన్ని ఆట బొమ్మను ఎత్తినట్లు ఎత్తి క్రింద పడేసింది. ప్రేలుడు తరంగాల అదటుకు అటు ఇటూ పరుగుతున్న విమానం నిర్ధాక్షిణ్యంగా అతన్ని బయటికి నెట్టి వేసింది.

"అయ్యయ్యో! పట్టుకోండి.... అతన్ని పడిపోకుండా పట్టుకోండి!!" అని అరుస్తూ సీటు వెనుక నుంచి లేచి ముందుకు రాబోయింది ఎయిర్ హోస్టెస్.

అప్పటికే అంతా అయిపోయింది. వైల్డ్‌గా వూగుతున్న విమానం స్టడీ అయ్యేటప్పటికి సరిగ్గా రెండు నిముషాలు పట్టింది. ఎయిర్ హోస్టెస్ డోర్ దగ్గరికి వచ్చేసరికి మరో అర నిముషం గడిచిపోయింది. ఆ సరికి షాడో పడిపోయిన ప్రదేశాన్ని వదలి పది మైళ్ళ దూరం వచ్చేసింది విమానం.

# 4

తల మీద పలుగులతో పెట్టి పొడిచినట్లు బాధపడుతూ కనులు తెరిచాడు షాడో.

వెంటనే అతనికి కనిపించింది నల్లగా వికృతంగా వున్న ఒక ముఖం.

"అమ్మయ్య.......ఇప్పటికి స్పృహ తెలిసిందన్నమాట !" తెల్లటి పళ్ళు కనిపించేలా నవ్వుతూ, అతని భుజాలు పట్టుకొని లేపి కూర్చోబెట్టింది.

ఒకటొకటిగా జరిగిన సంఘటనలన్నీ గుర్తుకు వచ్చేసరికి, విపరీతమైన ఆలోచనలతో ముడతలు పడింది షాడో నుదురు.

విమానంలో నుంచి తల్లక్రిందులుగా పడటంతో తన తలకు బలమైన దెబ్బ తగిలింది బాధను భరించటానికి విపరీతమైన ప్రయత్నం చేశాడు గాని, ప్రయోజనం లేకపోయింది. నీటిలో మునిగిపోతున్న తనను గమనించి వెంటనే రక్షించాడు చేపలు పట్టుకోవటానికి సముద్రం మీదికి వచ్చిన ఆ బర్మా జాలరి.

దూరంలో మసక మసకగా కనిపిస్తోంది సముద్ర తీరం. దాన్ని సమీపించి వడ్డు మీదికి చేరుకోగలిగితే ప్రస్తుతం తనను చుట్టుముట్టిన ప్రమాదాన్నుంచి బయట పడగలిగినట్లే.

ఆ మాట షాడో మనస్సులో మెదులుతూ వుండగానే వున్నట్లుండి దూరంలో ప్రత్యక్షం అయింది ఒక మోటార్ బోటు.

"గమ్మత్తుగా వుందే! ఈ చుట్టుపట్ల మోటార్ బోటులో చేపలు పట్టటానికి బయలుదేరే వాళ్ళు ఎవరూ లేరే!!" ఆశ్చర్యంగా అన్నాడు దాన్ని గమనించిన జాలరి.

కనులు చిట్లించుకొని అటువైపే చూస్తున్న షాడో మెడమీది వెంట్రుకలు ఒక్కసారిగా నిక్కబొడుచుకున్నాయి.

"మైగాడ్! గెట్ డౌన్! గెట్ డౌన్!!" అని హెచ్చరిస్తూ జాలరి భుజాల్ని పట్టుకొని పడవ అడుగు భాగంలోకి నెట్టటానికి ప్రయత్నించాడు.

అప్పటికే ఆలస్యం అయిపోయింది. ఆ మాటలు అతని నోటి వెంట వెలువడుతుండగానే విన వచ్చింది చెవులు చిల్లలు పడే శబ్దం.

పొగలు విడుస్త దూసుకు వచ్చిందొక రైఫిల్ బుల్లెట్. షాడో మాటల్ని విని ఆశ్చర్యంగా చూస్తున్న జాలరి, బాధగా అరిచి వెల్లికిలా పడిపోయాడు.

అంత వరకూ అందంగా నవ్విన అతని నోటి స్థానంలో ఎర్రటి రక్తాన్ని వెలువరిస్తున్న దారుణమైన గాయం ప్రత్యక్షం అయింది.

పట్టరాని ఆవేశంతో పళ్ళు కొరుకుతూ బెల్టు వెనక్కి చేతిని పోనిచ్చాడు షాడో. ఎంత వేగంగా పోయిందో, అంతకు రెట్టింపు వేగంతో వెనక్కి వచ్చేసింది అతని చేయి.

విమానంలో ప్రయాణం చేయటం కోసం ఎయిర్ బేగ్‌లో భద్రపరచబడినాయి ఆయుధాలు. విమానంలోనే వుండి పోయింది తన ఎయిర్ బేగ్......

ఎగసుకు వచ్చిన ఆవేశం క్షణంలో మటుమాయం అయిపోగా పడవ చివరి భాగంలో పడిపోయిన జాలరి శరీరాన్ని యివతలికి లాగి, దగ్గిర్లో కనిపించిన ఒక చేపల వలను అతని మీద కప్పాడు షాడో.

“ఐయామ్ సారీ మై ఫ్రండ్! నా ప్రాణాలు కాపాడిన నీకు అవసర సమయంలో ఏమీ చేయలేక పోయినందుకు నన్ను మన్నించు..... ఐ యామ్ వెరీ వెరీ సారీ” అంటూ లేచి నిలబడ్డాడు.

మరింత దగ్గిర్లోకి వచ్చేసింది మోటార్ బోటు. శక్తివంతమైన రైఫిల్స్‌ని పట్టుకొని జాగ్రత్తగా ఎయిమ్ తీసుకుంటున్నారు దాని పై భాగంలో నిలబడిన యిద్దరు దృఢకాయులు.

ఆ పైన ఆలస్యం చేయదలుచుకోలేదు షాడో. గుండెల నిండా వూపిరి పీల్చుకుని సముద్రంలోకి డైవ్ చేశాడు.

అదే సమయంలో భీకరంగా గర్జించాయి రైఫిల్స్. నీటిలో పడిపోయింది ఒక బుల్లెట్. పడవకు తగిలి గాలిలోకి ఎగిరి పోయింది రెండవది.

వింటి నుంచి వెలువడిన బాణంలా బుల్లెట్ల వెనుకే పడవను సమీపించి బలంగా గుద్దింది మోటార్ బోటు.

కత్తితో నరికినట్లుగా రెండుగా చీలిపోయింది పడవ. బొంగరాల్లా గిర్రున తిరుగుతూ చెల్లా చెదురు అయిపోయాయి దాని అవశేషాలు.

“జాగ్రత్తగా వాచ్ చేయండి.... షాడో యింకా బ్రతికే వున్నాడు.......” బోటులో నుంచి పై భాగంలో వున్న దృఢకాయుల్ని హెచ్చిరించింది ఒక కంఠం.

రైఫిల్స్‌ని రెడీగా పట్టుకుని ఎగిసి పడుతున్న అలల్ని జాగ్రత్తగా గమనించటం మొదలు పెట్టారు దృఢకాయులు.

మోటార్ బోటు గుద్దటంతో తలా ఒక ప్రక్కకు చెదిరి పోయిన పడవ శకలాలు వారి దృష్టిని ఏమార్చటం మొదలు పెట్టాయి. ఆ చెక్క ముక్కలను చాటు

చేసుకొని నిశబ్దంగా బోటు వెనుక భాగంలోకి చేరుకున్న షాడోని గుర్తించటం వారికి చేత కాలేదు.

నీటిలోకి వ్రేలాడుతున్న తాడు నొకదాన్ని పట్టుకొని మెల్లిగా బోటు మీదికి పాకాడు షాడో. శబ్దం కాకుండా అడుగులు వేస్తూ దృఢకాయుల వెనక్కి చేరుకున్నాడు.

అలల మీద తేలుతున్న చెక్క ముక్కల మీదే దృష్టిని కేంద్రీకరించి వున్నారు వాళ్ళు. వెనుక నుంచి వస్తున్న ప్రమాదాన్ని అరక్షణం ఆలస్యంగా గుర్తించారు.

రైఫిల్‌ని ఎయిమ్ చేస్తూ గిర్రున వెను తిరిగాడు ఒక దృఢకాయుడు. ట్రిగ్గర్ నొక్కే అవకాశం అతనికి లభించలేదు.

తొడ చరిచి గాలిలోకి లేచాడు షాడో. గుండెలు జలదరించేటట్లు అరుస్తూ విసిరాడు తన కుడి పాదాన్ని .

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో పోయి దృఢకాయుడి ముఖాన్ని తాకింది అది.

ఎయిమ్ చేయబడిన రైఫిల్ గింగిరాలు తిరుగుతూ పోయి సముద్రంలో పడింది. గావు కేకలు పెడుతూ ముఖాన్ని చేతులతో కప్పుకోవటానికి ప్రయత్నించాడు దృఢకాయుడు.

కప్పుకోవటానికి ఏముందని?

పదిహేను పౌండ్ల హేమర్‌తో బలంగా కొట్టినట్లు తుక్కు తుక్కు అయిపోయాయి అతని దవడలు. ఎర్రటి రక్తం వెల్లువలా ప్రవహిస్తూ వుండగా డెక్ మీద పడి పొర్లిగింతలు పెట్టాడతను.

అటు పొర్లి యిటు పొర్లి సముద్రంలోకి దొర్లాడు.

కుడిపాదం నేలకు ఆనిన మరుక్షణం రెండవ దృఢకాయుని వైపు తిరిగాడు షాడో.

రైఫిల్‌ని లూజ్‌గా పట్టుకొని తన సహచరుడి వంకే చూస్తున్నాడతను. అతను సముద్రంలోకి దొర్లగానే వులిక్కిపడి షాడో వైపు తిరిగాడు.

తన ప్రాణాలు కాపాడినందుకు దారుణమైన శిక్షను అనుభవించిన జాలరి ముఖం కనుల ముందు కదులుతుండగా పిడికిళ్ళు బిగించి బలంగా గుద్దాడు షాడో అతని తల మీద.

అడ్డుకునే వ్యవధి కూడా ఆ దృఢకాయునికి లేక పోయింది. తన సహచరుడికి పట్టిన దుస్థితిని చూసి నిశ్చేష్టుడై నిలబడి వున్నాడతను. ఏం జరుగుతుందో అర్థం అయ్యేలోపు గానే తల మీద పడింది అత్యంత దారుణమైన కిల్లింగ్ పంచ్.

ఫట్ మని శబ్దం చేస్తూ పగిలి పోయింది అతని తల. రైఫిల్‌ని వదిలి వెర్రిగా అరవబోయాడతను. అరుపు నోటి నుంచి వెలువడక ముందే అనంత విశ్వంలో కలిసి పోయాయి అతని ప్రాణాలు.

క్రింద పడిన రైఫిల్‌ని అందుకొని డెక్ లోపలి భాగంలోకి పరుగు తీశాడు షాడో.

దడ దడమని మ్రోతలు చేస్తున్న ఇంజన్ల దగ్గిర నిలబడి శక్తివంతమైన బైనాక్యులర్స్‌తో సముద్రాన్నంతా పరికిస్తున్నాడు మరో దృఢకాయుడు.

“ఏమయింది? షాడో నీటిలో నుంచి పైకి తేలాడా?” తన వెనుక అడుగుల చప్పుడును విని వెను తిరుగుతూ అన్నాడు.

రైఫిల్‌ని అడ్డంగా తిప్పి విసురుగా కొట్టాడు షాడో.

ముక్కలు ముక్కలైపోయింది ఆ వ్యక్తి చేతిలోని బైనాక్యులర్. దాన్ని పట్టుకున్న అతని ఎడమ చేయి వికృత శబ్దం చేస్తూ విరిగి పోయింది.

“ఏమీ తెలియని అమాయకులను చంపటం మాత్రమే తెలిసిన మీకు ఈ షాడోని పట్టుకోవటం ఎలా సాధ్యపడుతుంది? దెబ్బకు దెబ్బ తీయటానికి వచ్చాను...... దమ్ము వుంటే నీ ప్రాణాలు కాపాడుకో.” అంటూ రైఫిల్స్‌ని వదిలి అతని చొక్కాను పట్టుకున్నాడు షాడో.

ఆందోళన నిండిన కనులతో, అటూ ఇటూ చూస్తూ చటుక్కున పాంటు జేబులో చేయి పెట్టాడు దృఢకాయుడు.

మోకాలిని ఎత్తి అతని పొట్టలో పొడిచాడు షాడో. పాంటు జేబులోకి పోయిన చేతిని పట్టుకొని బలంగా వెనక్కి వంచాడు.

ఎండు మామిడి కొమ్మ విరిగినట్లు వికృత శబ్దం చేస్తూ విరిగింది అది. బాధతో బిగ్గరిగా అరిచి వెనక్కి వాలిపోయాడు దృఢకాయుడు.

“ఆల్‌రైట్ బ్రదర్... ఇప్పటికి సగం తీరింది నా కక్ష. ఇది మిగతా సగం కూడా తీరాలంటే నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఎవరు మీరు? నన్నెందుకు చంపటానికి ప్రయత్నిస్తున్నారు?” అక్కడ కనిపించిన ఒక ఇనుప బెంచీమీద కూర్చుంటూ అడిగాడు షాడో.

భరించరాని బాధతో క్రిందపడి మెలికలు తిరుగుతున్న దృఢకాయుడి ముఖం రక్తం లేనట్లు పాలిపోయింది ఆ ప్రశ్నల్ని వినగానే.

"మర్యాదగా జవాబు చెప్పు బ్రదర్! చెప్పకపోతే చేతులతో పాటు కాళ్ళను కూడా పోగొట్టుకుంటావ్." బూటు కాలిని అతని ఎడమ తొడ మీద వేస్తూ మరోసారి రెట్టించాడు షాడో.

మరింత తెల్లబడిపోయింది ఆ వ్యక్తి ముఖం. పళ్ళు బిగించి బాధను భరిస్తూ చేతులు ఎత్తటానికి ప్రయత్నించాడు. ఉన్న చోటి నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేదు విరిగిపోయిన అతని చేతులు.

ఉన్నట్టుండి తల ప్రక్కకు తిప్పాడతను. లూజ్‌గా వ్రేలాడుతున్న షర్టు కాలర్‌ని నోటితో పట్టుకొని కరకరా నమిలాడు.

అదిరిపడి బెంచి మీది నుంచి దిగాడు షాడో.

"బ్లడీ బాస్టర్డ్...... నిన్ను అంత తేలికగా వదిలి పెడతానని అనుకుంటున్నావా? నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా నిన్ను చావనిస్తానని భ్రమ పడుతున్నావా?" అంటూ అతని దవడల్ని బలంగా నొక్కి పట్టుకున్నాడు. దగ్గర్లో కనిపించిన ఒక ఇనుప రెంచిని అందుకొని బిగుసుకు పోయిన అతని పళ్ళన బలవంతంగా విచ్చదీశాడు.

అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. తడి తగిలిన మరుక్షణం కరిగి అతని నోటిలోకి వెళ్ళిపోయింది కాలర్‌లో దాచి వున్న సైనేడ్ కాప్స్యూల్. షాడో చూస్తూ వుండగానే నీలంరంగుకు తిరిగింది అతని శరీరం. గిలగిలా కొట్టుకుంటూ రెండు క్షణాల తరువాత ప్రాణాలు వదిలేశాడతను.

గాఢంగా నిట్టూర్చి లేచి నిలబడ్డాడు షాడో. ముఖం మీది నుంచి కళ్ళలోకి జారుతున్న చెమట బిందువుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ మోటార్ బోటు స్టీరింగ్‌ని తీసుకొని, బోటును తీరం వైపు తిప్పాడు.

అరగంట తరువాత ఎదురు వచ్చింది రాళ్ళు రప్పలతో నిండి వున్న సముద్ర తీరం. నీటిలోకి పొడుచుకు వచ్చిన ఒక కొండరాయి ప్రక్కన బోటును ఆపి క్రిందికి దూకాడు. సముద్రపు నీటిలో చాలాసేపు తడవటం వల్ల పనిచేయకుండా నిలిచిపోయిన రిస్ట్ వాచి వంక చూసుకుంటూ పది అడుగులు ముందుకు వేశాడు.

పదకొండో అడుగు వేయబోతుండగా జలదరించింది అతని శరీరం. ప్రమాదం ఏదో ముంచుకు వస్తోందని డేంజర్ సిగ్నల్ పంపసాగింది అతని అంతరంగం.

రెండో ఆలోచన లేకుండా ఎగిరి వెనక్కి దూకాడు షాడో. చేతిలో వున్న రిస్ట్ వాచిని అవతలకు విసిరేసి వేగంగా మోటార్ బోటు వైపు కదిలాడు.

“అడుగు ముందుకు వేశావంటే హతమారిపోతావ్ మిస్టర్...... చేతులు గాలిలోకి ఎత్తి లొంగిపోకపోతే చాలా విచారించవలసి వస్తుంది” ఖంగుమంటున్న కంఠంతో కమాండ్ చేస్తూ ఒక రాతి బండ చాటు నుంచి లేచి ఇవతలకు వచ్చాడు మెర్గ్గాయ్ సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఒకతను.

బోటును చేరుకునే ఆలోచనను విరమించుకొని గిర్రున ప్రక్కకు తిరిగాడు షాడో.

తిరిగిన మరుక్షణం అతనికి కనిపించారు పాతికమంది పోలీసులు. బరువైన రైఫిల్స్ పట్టుకొని శిలా విగ్రహాల్లా బండల చాటునుంచి లేచి నిలబడ్డారు.

అంతమందిని ఏమార్చి అవతలకు పారిపోవటం అసంభవమని గ్రహించి మెల్లిగా చేతుల్ని గాలిలోకి ఎత్తాడు షాడో.

“మెర్గ్వాయ్ సిటీ చుట్టుపట్ల స్మగ్లింగ్ ఆపరేషన్స్ చాలా వుధృతంగా వున్నాయి. స్మగ్లర్లను పట్టుకోవటానికి బర్మా పోలీసులు చాలా తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. చేయకూడదని పనులు చేసి, కనిపించకూడని ప్రదేశాల్లో వారికి కనిపించావంటే కొంపలు అంటుకుంటాయి బీ కేర్‌ఫుల్ రాజూ..... చాలా జాగ్రత్తగా సంచరించాలి.” ఢిల్లీలో విమానం ఎక్కేముందు కూడా ఒకటికి రెండుసార్లు చెప్పి పంపించారు కులకర్ణిగారు.

ఇప్పుడు తను చేసిందేమిటి? గుర్తు తెలియని మోటార్ బోటులో కళ్ళు మూసుకొని మెర్గ్వాయ్ పోలీసుల మధ్యకు వచ్చిపడ్డాడు. బోటులోనే వుండిపోయిన శరీరాలను వాళ్ళు గమనించారంటే –

షాడో ఆలోచనలు పూర్తికాకముందే చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరిచారు మోటార్ బోటు మీదికి పోయిన ఇద్దరు కానిస్టేబిల్స్.

ఊపిరి బిగపట్టి పళ్ళు బిగించాడు షాడో. కళ్ళు గట్టిగా మూసుకొని తలను రెండు చేతులతో కప్పుకున్నాడు.

అతను వూహించినట్లే పడింది తల మీద బలమైన దెబ్బ.

“దొంగ రాస్కెల్! వట్టి స్మగ్లర్‌వే అనుకున్నాను. పచ్చి హంతకుడివి అని ఇప్పుడే తెలిసింది. నీ లాంటి వాళ్ళను నిలువునా నరికి ఉప్పుపాతర వేయాలి” అని

కర్కశంగా అంటూ చేతిలోని రివాల్వర్‌ని వెనక్కి తిప్పి మెడ మీద బలంగా గుద్దాడు పోలీస్ ఇన్స్‌పెక్టర్.

అప్పుడప్పుడే తగ్గు ముఖం పడుతున్నది షాడో తల పోటు. తల మీద పడిన దెబ్బ దాన్ని రెచ్చగొట్టింది. మెడ మీది దెబ్బ మరింత ఎగత్రోసింది. భరించరాని బాధను పళ్ళ బిగువున అణుచుకుంటూ స్పృహ తప్పి పడిపోయాడతను.

బూటు కాళ్ళతో నిర్ధాక్షిణ్యంగా అవతలికి నెట్టి, చేతులకు బేడీలు వేశాడు పోలీస్ ఇన్స్‌పెక్టర్. కానిస్టేబిల్స్‌కి సైగ చేసి బండరాళ్ళ అవతల దట్టంగా పెరిగి వున్న చెట్ల తోపు కేసి బయలు దేరాడు.

చెట్లతోపు మధ్యలో ఆగి వుందొక పోలీస్ వాన్. చాప చుట్టను మోసుకొొచ్చినట్లు తీసుకు వచ్చి షాడోని అందులోకి నెట్టారు పోలీసులు. రైఫిల్స్ రెడీగా పట్టుకొని అతని చుట్టూ కూర్చున్నారు

“పోనీ...... మెర్గాయ్ సిటీ చేరుకునేదాకా ఎక్కడా ఆపవద్దు.....” లావుపాటి సిగార్‌ని వెలిగించుకుంటూ డ్రయివర్‌ని హెచ్చరించాడు ఇన్స్‌పెక్టర్.

వెంటనే కదిలింది వాన్. చెట్ల తోపును దాటి, వంకర టింకర్లుగా వున్న ఒక కొండ దారి మీదుగా సిటీ వైపు బయలు దేరింది

పది నిముషాల దాకా రోడ్డు మీది నుంచి దృష్టిని ప్రక్కకు తిప్పకుండా వాన్‌ని నడిపాడు డ్రయివర్. ఒక చిన్న మలుపు తిరగగానే సడన్‌గా బ్రేకులు వేసి వేన్‌ని ఆపేశాడు.

“ఏమయింది ఎందుకు ఆపావ్?” కోపంగా చూస్తూ ప్రశ్నించాడు పోలీస్ యిన్స్‌పెక్టర్.

సమాధానం నోటితో కాక కనులతో చూపించాడు డ్రయివర్.

ఎత్తయిన కొండ గుట్టలు రెండు కాపలా కాస్తున్న సిపాయిల్లా రోడ్డుకు అటూ ఇటూ నిలబడి వున్నాయి. వాటి మీద నుంచి దొర్లిన బండరాళ్ళు కొన్ని రెండు అడుగుల ఎత్తున రోడ్డుకు అడ్డంగా పేరుకొని వున్నాయి. వాటిని తొలగించందే వాన్ ముందుకు పోవటం అసంభవం.

"నాన్సెన్స్..... నిన్నా మొన్నా కురిసిన వర్షాలకు ఇలా జరిగి వుంటుంది. మన వాళ్ళను పిలిచి వాటిని తొలగించమని చెప్పు........" అనబోతూ చటుక్కున ఆ మాటల్ని మ్రింగేశాడు ఇన్స్‌పెక్టర్.

రెండు రోజుల ముందు కురిసిన వర్షాలకు ఆ బండ రాళ్ళు క్రిందికి దొర్లలేదు. అంతకు ముందు తాము అటుగా వచ్చినప్పుడు రోడ్డు క్లియర్‌గానే వుంది...... తాము సముద్రపు వడ్డుకు వెళ్ళిన తర్వాతే జరిగిన పని అది.......

మంచి నీళ్ళు తాగినట్లు మనుష్యుల్ని చంపే నరహంతకుడిని బందించానన్న అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, తల ఎత్తి గుట్టల మీదికి చూశాడతను.

ఎడమ చేతి వైపున వున్న గుట్టమీద వుండనా, వూడనా అన్నట్లు వూగుతోంది బ్రహ్మాండమైన కొండరాయి ఒకటి. దాన్ని చూసేసరికి తడి ఆరిపోయింది అతని గొంతు.

"మైగాడ్! తిప్పండి..... వాన్‌ని వెనక్కు తిప్పండి!!" అని అరుస్తూ చటుక్కున డోర్ తెరుచుకొని క్రిందికి దూకేశాడు.

అదే సమయంలో ఉరుములు ఉరిమినట్లు శబ్దం చేస్తూ కదిలింది బ్రహ్మాండమైన ఆ కొండరాయి. జగన్నాథ రథంలా దొర్లుకుంటూ వచ్చి గుండెలు అవిసే శబ్దంతో రోడ్డుమీద పడింది.

పోలీస్ వాన్‌ని వెనక్కి తిప్పే ప్రయత్నాన్ని విరమించుకొని వేగంగా క్రిందికి దూకేశాడు డ్రయివర్. వెనక్కి కూడా చూడకుండా పిక్కబలం చూపించాడు.

ఆ దృశ్యాన్ని చూడగానే దిగజారిపోయింది మిగిలిన వారి ధైర్యం. ఆయుధాల్ని కూడా అందుకోకుండా క్రిందికి దూకి అతని వెనుకే పరుగులు తీశారు.

వాళ్ళు అటు పోయిన మరుక్షణం రెండో వైపున వున్న గుట్టమీది నుంచి పరిగెత్తుకు వచ్చాడు సి.ఐ.బి. సెక్యూరిటీ కాప్టన్ వాసు.

స్పృహ లేకుండా వాన్‌లో పడి వున్న షాడోని భుజాల మీద వేసుకొని మళ్ళీ గుట్ట మీదికి పారిపోయాడు.

బండరాయి పడిన గుట్టమీది నుంచి దిగాడు జూనియర్ ఏజెంట్ శ్రీకర్. పదునైన పేష్కప్‌తో పోలీస్ వాన్ టైర్లను ఛిన్నాభిన్నం చేసేసి వాసును అనుసరించాడు.

పారిపోయిన పోలీసులు తిరిగి వస్తారేమోనని, రోడ్డు మీది రాళ్ళ చాటున రెడీగా వున్నాడు ముఖేష్. రెండు నిముషాలు గడిచిపోయినా వాళ్ళు తిరిగి రాకపోయే సరికి చేతిలోని రివాల్వర్‌ని పాంటు బెల్టులో దాచుకుంటూ తన స్నేహితుల్ని అనుసరించాడు.

అరగంట తరువాత తిరిగి వచ్చారు పోలీసులు. ఎందుకూ పనికిరాకుండా పోయిన వాన్ టైర్లను చూడగానే పళ్ళు కొరుకుతూ ఎగిరి గంతులు వేశాడు ఇన్స్పెక్టర్.

"ఇది హంతకుడు చేయించిన పనే..... అతని అనుచరులు దారి కాచి మనల్ని బెదరకొట్టటానికి పన్నిన పన్నాగమే...... వెతకండి..... గుట్టలన్నీ వెతకండి......." అంటూ ఆజ్ఞలు జారీ చేశాడు.

వాన్‌లో వున్న రైఫిల్స్‌ని అందుకొని తలా ఒక ప్రక్కకు బయలు దేరారు పోలీసులు. రెండు గంటల పాటు ఆ చుట్టుపట్ల వున్న పరిసరాలనన్నిటినీ గాలించి వదిలారు.

చీకట్లు ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టబోతున్న తరుణంలో పెద్ద పల్లపు ప్రదేశం దగ్గిరికి పోయి బిగ్గిరిగా అరిచి కేకలు పెట్టాడు ఒక కానిస్టేబుల్.

రివాల్వర్‌ని రెడీగా పట్టుకుని అందరికంటే ముందుగా అతన్ని సమీపించాడు ఇన్స్పెక్టర్.

"ఇవిగివిగో జాడలు....... ఒక ఫోర్టు కారు ఇక్కడ ఆగిన సూచనలు కనిపిస్తున్నాయి" పల్లపు ప్రదేశంలో వున్న కారు టైరు గుర్తుల్నీ, వాటి ప్రక్కన అగుపిస్తున్న అడుగు జాడల్ని చూపిస్తూ గబగబా అన్నాడు ఆ కానిస్టేబిల్.

మెర్గ్గాయ్ సిటీ వైపు పోతున్న ఆ జాడల్ని చూసి సాలోచనగా తల వూపుతూ పరుగులాంటి నడకతో తమ వాన్ దగ్గిరికి వచ్చాడు ఇన్స్పెక్టర్. వాన్ ముందు భాగంలో వున్న వైర్‌లెస్ ట్రాన్స్‌మీటర్‌ని యాక్టివేట్ చేసి మెర్గ్గాయ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌ని కంటాక్ట్ చేశాడు.

# 5

“హెచ్చరిక ...... మెర్గ్గాయ్ పౌరులకు ఒక హెచ్చరిక! ఇండియా నుంచి వచ్చిన వాడిలా కనిపించే ఒక హంతకుడు పోలీసులను ఏమార్చి మన నగరంలో అడుగు పెట్టినట్లు అనుమానించ బడుతోంది. పౌరులందరూ అప్రమత్తంగా వుండి, ఆ హంతకుడిని బంధించటంలో పోలీసులకు సాయపడవలసిందిగా కోరుతున్నాం” అని ఎనౌన్స్ చేస్తూ మెర్గ్గాయ్ సిటీ త్రీ టవున్ లోకి ఎంటర్ అయింది ఒక పోలీస్ వ్యాన్.

అంతటితో ఆగకుండా షాడో పోలికల్ని సవివరంగా వర్ణించి ఒక పావుగంట తరువాత అవతలికి వెళ్ళిపోయింది.

వెంటనే కుర్చీలో నుంచి లేచాడు సికియాసింగ్ రెస్టారెంట్‌లో కూర్చుని వున్న జోమా వస్తాదు.

“నన్ను మించిన వస్తాదు ఈ మెర్గ్గాయ్ సిటీ మొత్తం మీద ఎవడూ లేడు. పోలీసుల్ని తికమక పెట్టి పారిపోయిన ఆ హంతకుడు నా ఎదుటికి వస్తే వట్టి చేతులతోనే ప్రాణాలు తీసేస్తాను.” ఎర్రబడిన కనులతో క్రూరంగా చూస్తూ అన్నాడు.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది. అంతవరకూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్న కస్టమర్స్ అందరూ తలలు వంచుకొని చూపులు మరలించుకున్నారు.

“ఆడవాళ్ళల్లా తలలు వంచుకుంటారేమిటి? నా మాటల మీద మీ కెవరికీ నమ్మకం లేదా?” చేతిలోని సారాగ్లాసును ఎత్తి నేలకేసి కొడుతూ మరింత బిగ్గిరిగా అన్నాడు జోమా వస్తాదు.

“నీ మాటల మీద నమ్మకం లేకపోవటం ఏమిటి జోమా! నీ గురించి, నీ బలం గురించి తెలియని వాళ్ళు ఇక్కడ ఎవరూ లేరు...... లోపలి గదిలో నీ కోసం బ్రహ్మాండమైన విందు భోజనం ఏర్పాటు చేయించాను..... పద....” అంటూ అతని చేయి పట్టుకొని లోపలికి తీసుకుపోవటానికి ప్రయత్నించాడు రెస్టారెంట్ మేనేజర్.

అతని చేతిని విదిలించికొట్టి రెస్టారెంట్ నంతా కలియ చూశాడు జోమా వస్తాడు. ఒక మూలగా యిద్దరు కస్టమర్స్‌ని గమనించగానే క్రూరమైన దరహాసం ఒకటి అతని పెదవుల మీద ప్రత్యక్షం అయింది.

“భారతదేశం నుంచి వచ్చిన వాళ్ళకు నా సంగతి తెలియక పోవచ్చు..... తెలిసేటట్లు చెప్పడం నా విధి, కర్తవ్యం” అంటూ నేల అదిరేలా అడుగులు వేస్తూ అటువైపు బయలు దేరాడు.

“అయ్యబాబోయ్! ఇటువైపే వస్తున్నాడు గురూ ఆ పందికొక్కు..... ఇప్పుడు ఏం చేద్దాం?” ఆందోళనగా అంటూ షాడో వైపు చూశాడు శ్రీకర్.

చేతిలో వున్న సిగరెట్‌ని క్రింద పడవేసి మరో సిగరెట్ వెలిగించుకుంటూ, యిబ్బందిగా తల విదిలించాడు షాడో.

ఖచ్చితంగా ఎనిమిది గంటలకు అక్కడికి వస్తుంది స్పెషల్ బ్రాంచి ఏజెంట్..... ఆమె వచ్చే సమయానికి తాము రెడీగా వుండకపోతే అంతవరకూ పడిన శ్రమ అంతా వృధా అయిపోతుంది.

షాడో మనసులోని ఆలోచన ఒక కొలిక్కిరాక ముందే వారి టేబిల్‌ని సమీపించి ఠీవిగా నిలబడ్డాడు జోమా వస్తాదు.

పిడికిళ్ళు బిగించి కుర్చీలో నుంచి లేవబోతున్న శ్రీకర్‌ని కనులతో వారించి కదలకుండా ఆపేశాడు షాడో.

"తొందర పడటం వల్ల ప్రయోజనం లేదు శ్రీ..... బాధల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది" లోగొంతుకతో హెచ్చరించాడు.

అతని మాటలు పూర్తికాక ముందే పిడికిలితో టేబిల్ మీద బలంగా గుద్దాడు జోమా వస్తాదు.

ఎగిరి అల్లంత దూరంలో పడింది శ్రీకర్ ముందున్న వాటర్ గ్లాసు. అందులోని నీరంతా అతని ముఖం మీదా, దుస్తుల మీదా విరజిమ్మబడింది.

తల తిప్పితే తన కన్నుల్లోని క్రోధం అతనికి కనిపిస్తుందేమో అన్న అనుమానంతో ఎదుట వున్న గోడమీద దృష్టిని కేంద్రీకరించి స్టిఫ్‌గా కూర్చుండిపోయాడు శ్రీకర్.

"అభిమానం, రోషం అనే పదాలకు అర్థం తెలియని జాతి భారత జాతి. ఏమంటారు బ్రదర్స్? నా మాటలకు వప్పుకుంటారా??" మొరటుగా వున్న చూపుడు వ్రేలితో శ్రీకర్ బుగ్గల్ని తాకుతూ అడిగాడు జోమా వస్తాదు.

పళ్ళు బిగపట్టి కళ్ళు మూసుకున్నాడు శ్రీకర్. విల్‌పవర్ నంతా వుపయోగించి పిడికిళ్ళను టేబిల్ క్రింద "నేను ఇన్ని మాటలు మాట్లాడినా మీరు సమాధానం యివ్వకపోవటం చాలా వింతగా వుంది..... ఇందాక పోలీసులు

చెప్పిన ఇండియన్ హంతకుడు మీలో లేడు కదా!" ఆశ్చర్యాన్ని నటిస్తూ ముందుకు వంగి షాడో ముఖంలోకి చూశాడు జోమా వస్తాదు.

ఉన్నట్లుండి మాయమైపోయింది అతని పెదవుల మీది చిరునవ్వు.

"నువ్వే! పోలీసుల చెపుతున్న హంతకుడివి నువ్వే!" అంటూ మెరుపులా చేతులు జాచి షాడో భుజాల్ని పట్టుకున్నాడు.

విమానంలో బాంబు పెట్టి తను సముద్రంలో పడటానికి కారుకుడైన మచ్చల ముఖాన్నీ, సముద్రంలో వుండగా వెంటపడి అనవసరంగా పోలీసుల దృష్టిలోకి నెట్టిన మోటార్ బోటు వ్యక్తుల్నీ కసి తీరా నిందిస్తూ, కొట్టాడు షాడో.

జోమా వస్తాదు ముఖం మీద లావుపాటి కొండరాయి పడినట్లు అయింది. రెస్టారెంట్ దద్దరిల్లిపోయేలా అరిచి వెల్లికిలా పడిపోయాడు.

"లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్..... శ్రీ..... ఇక యిక్కడ వుండటం మన అరోగ్యానికి ఎంత మాత్రమూ మంచిది కాదు." అంటూ కుర్చీలో నుంచి లేచాడు షాడో.

నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా లేచి నిలబడ్డాడు క్రింద పడిన జోమా వస్తాదు.

"హంతకుడు ...... పోలీసులు చెప్పిన హంతకుడు పారిపోతున్నాడు..... పట్టుకోండి.... పట్టుకోండి" అని అరుస్తూ రెండు అంగల్లో షాడో దారికి అడ్డు నిలబడ్డాడు.

ఆ పైన తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు శ్రీకర్.

అడ్డం వచ్చిన ఒక టేబిల్ మీదుగా జంప్ చేసి, ఎగిరి తన్నాడు అతని గుండెల మీద.

బాధగా మూలిగి తల్లక్రిందులుగా పల్టీకొట్టాడు జోమా వస్తాదు. రెండు టేబిల్స్‌ని తల్లక్రిందులు చేసి రెస్టారెంట్ ద్వారం దగ్గిర నేలను కౌగలించుకున్నాడు.

అంతటితో అదిరిపోయి దూరంగా పారిపోయింది అక్కడ వున్న ప్రశాంత వాతావరణం. కీసర బాసరగా అరుస్తూ తలా ఒక ప్రశ్నకు పరుగులు తీశారు కస్టమర్స్.

"పోలీసుల్ని పిలవండి.... పోలీసుల్ని పిలవండి..... అని కేకలు పెడుతూ క్యాష్ కౌంటర్ మీద వున్న టెలీఫోన్‌ని అందుకున్నాడు మేనేజర్.

చేతికి అందిన కుర్చీనొకదాన్ని ఎత్తి అటుకేసి విసిరాడు షాడో.

కెవ్వున అరిచి నేలమీద చతికిల పడిపోయాడు మేనేజర్. క్యాష్ కౌంటర్‌కి తగిలి ముక్కలు ముక్కలైపోయింది కుర్చీ.

అడ్డు వచ్చిన వారిని పిడికిటి పోట్లతో అదరగొడుతూ వేగంగా పోయి కౌంటర్ మీదే వున్న ఫోన్‌ని పట్టుకున్నాడు శ్రీకర్.

"అయ్యా క్షమించండి..... జోమా గాడు అరిచిన అరుపులకు వళ్ళు వేడెక్కి ఫోన్ పట్టుకున్నాను. దాన్ని పగల గొట్టి లేనిపోని ఖర్చు నా నెత్తిన రుద్దకండి..... మీ కాళ్ళు పట్టుకుంటాను." అంటూ నిజంగానే అతని కాళ్ళు పట్టుకున్నాడు మేనేజర్.

నిర్దాక్షిణ్యంగా నేలకేసి బాది ఫోన్‌ని సర్వనాశనం చేశాడు శ్రీకర్.

‘‘ఇప్పుడు చెయ్యి బే ఫోను..... ఎంతమంది పోలీసుల్ని పిలిపించుకుంటావో పిలిపించుకో.’’ అంటూ అతని తొడల మీద లాగి పెట్టి తన్ని బయటికి పరుగు తీశాడు.

రోడ్డు మీదికి పారిపోయిన కస్టమర్స్ దిక్కులు దద్దరిల్లి పోయేటట్లు అరుస్తున్నారు. దారినపోయే పౌరులందరూ ఆ అరుపులకు రెస్టారెంట్ ముందు గుమికూడుతున్నారు.

వారందరూ తమ కదలికల్ని గమనించే లోపుగా అక్కడి నుంచి తప్పించుకోవాలనే వుద్దేశ్యంతో శ్రీకర్ చేయి పట్టుకొని చీకటిగా వున్న ఒక సందువైపు పరుగు తీశాడు షాడో.

అతను భయపడినంతా వెంటనే జరిగింది.

‘‘అదుగో హంతకుడు.... అటుగా పారిపోతున్నాడు.......’’ అంటూ అరిచి అందర్నీ హెచ్చరించాడు ఒక పౌరుడు.

గొల్లున అరిచి అటు తిరిగాడు జనం. కేకలు పెడుతూ వెంటబడటం ప్రారంభించారు.

చీకటి సందును దాటి ఒక వీధిలోకి మరలాడు షాడో. అక్కడి నుంచి యింకో సందులో అడుగు పెట్టి ఒక్క క్షణం ఆగాడు.

వదిలిపెట్టే ఆలోచన లేనట్లు పట్టుదలగా పరిగెత్తుకు వస్తున్నారు జనం. వారి వెనుకగా కొట్టవచ్చినట్లు వినిపిస్తోంది పోలీసులు కూడా రంగంలోకి దిగుతున్న అలికిడి.

“ఏం చేద్దాం గురూ? చినికి చినికి గాలీ వానా అయ్యేటట్లుంది మన పరిస్థితి!” షాడో ముఖంలోకి చూస్తూ ఆందోళనగా అన్నాడు శ్రీకర్.

చీకటితో నిండి వున్న ఆ సందు చివరి భాగాన్ని ఒకసారి పరీక్షగా చూసి, ముందుకు కదలబోయిన షాడో వులిక్కిపడి వెనక్కి దూకాడు. అప్రయత్నంగా బిగుసుకున్నాయి అతని పిడికిళ్ళు.

“శత్రువుని కాదు మిస్టర్ షాడో..... నీకు స్నేహితురాలినే...... తొందరపడి చేయి విసిరితే చాలా విచారించాల్సి వస్తుంది.” అంటూ నాలుగు అడుగుల దూరంలో వున్న ఒక లాంప్ పోస్ట్ చాటు నుంచి యివతలికి వచ్చింది ఒక యువతి.

బిగించిన పిడికిళ్ళను క్రిందికి దించుతూ అనుమానంగా ఆమెను పరికించాడు షాడో.

“రాత్రి వేళల్లో నక్షత్రాలు ఎంత నిత్యమో, మన వృత్తిలో బాధలు కూడా అంతే సత్యం. మన పెద్దలు చెప్పిన చక్కటి మాటయిది.” చిరునవ్వుతో అన్నది ఆ యువతి.

తేలికగా నిట్టూర్చి మరింత రిలాక్స్ అయ్యాడు షాడో.

స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌ని కంటాక్ట్ చేయటానికి ఏర్పాటు చేయబడిన కోడ్ వర్డ్ అది...... ఎలాగైతేనేం తను మెర్గ్వాయ్ సిటీ వచ్చిన పని ఒక విధంగా సక్సెస్ అయింది.

“ముచ్చట్లు చెప్పుకుంటూ ముంచుకు వస్తున్న ప్రమాదాన్ని మర్చిపోతున్నాం గురూ..... వెంటనే పిక్కబలం చూపించక పోతే కొంపలు

నిలువునా మునుగుతాయి.'' సందు మొదట్లోకి వచ్చేస్తున్న జన సందోహాన్ని గమనించి మరింత ఆందోళనగా హెచ్చరించాడు శ్రీకర్.

అదిరి పడి ముందుకు అడుగు వేయబోయిన షాడో చేయి పట్టుకొని ఓరగా తెరిచి వున్న ఒక ద్వారంలోకి లాగిందా యువతి.

“యూ డోన్ట్ వర్రీ మిస్టర్ షాడో..... ఇటువంటి ఎమర్జెన్సీ వస్తుందనే అనుమానంతో ముందుగానే కొన్ని ఏర్పాట్లు చేసి వుంచాను..... కమ్ విత్ మీ.'' అంటూ తలుపులు మూసి, ఆ యింటి వెనుక భాగంలోకి తీసుకుపోయింది.

అడుగులో అడుగులు వేస్తూ ఆమెను అనుసరించింది షాడో. శ్రీకర్లకు రెండు నిముషాల తరువాత కనిపించింది వెనుక భాగంలో రెడీగా నిలబడి వున్న ఖరీదయిన ఫాల్కన్ కారు.

“బైదిబై మిస్టర్ షాడో.... నీతో పాటు బర్మా వచ్చిన స్నేహితులు అందరూ ఏరి? ఎక్కడ వున్నారు?'' వారిద్దరినీ వెనుక సీటులో కూర్చోబెట్టి, తను స్టీరింగ్ ముందు కూర్చుంటూ అడిగింది ఆ యువతి.

పాంటు జేబులో వున్న సిగరెట్ పాకెట్ని బయటికి తీయబోతున్న షాడో, వులికిపాటును నేర్పుగా తమాయించుకొని మౌనంగా వుండిపోయాడు.

మెల్లిగా కదిలి, ఒక వీధిలో అడుగు పెట్టింది ఫాల్కన్ కారు. రెండు నిముషాల తరువాత వేగాన్ని పుంజుకొని మెర్గూయ్ సిటీ దక్షిణ భాగం వైపు పరుగు ప్రారంభించింది.

సిగరెట్ వెలిగించుకోవాలన్న కోరికను మరిచిపోయి, శిలా విగ్రహంలా కూర్చుండిపోయాడు షాడో. జరుగకూడనిదేదో జరుగబోతున్నట్లు విపరీతమైన ఆందోళనతో సతమతమై పోసాగింది అతని మనసు.

## 6

అరగంట సేపు వేగంగా ప్రయాణం చేసి ఒక పెద్ద బంగ్లా ముందు ఆగింది ఫాల్కన్ కారు.

"కమాన్ మిస్టర్ షాడో..... లోపలికి పోయి తీరికగా మాట్లాడుకుందాం." అంటూ క్రిందికి దిగి బంగ్లాలోకి దారి తీసింది ఆ యువతి.

సిగరెట్ పాకెట్‌ని చేతిలోనే పట్టుకొని ఆమె వెనుకే అడుగులు వేశాడు అతడు. బంగ్లా ముందు భాగంలో వున్న పెద్ద హాలు వంటి గదిలోకి ఎంటర్ అవుతుండగా, పొరపాటున జారి క్రింద పడిపోయింది సిగరెట్ పాకెట్.

"రాను రాను విపరీతమైన నీరసం ఆవరించుకుంటోంది నన్ను. నీరసం తగ్గి వుత్సాహం పెంపొందించు కోవటానికి సరయిన మెడిసిన్ ఏది?" క్రింద పడిన పాకెట్‌ని అందుకుంటూ కాజువల్‌గా ప్రశ్నించాడతను.

కిలకిలా నవ్వి మరో గదిలోకి దారి తీసిందామె.

మనసులో మెదులుతున్న భావాలు ముఖంలో కనిపించకుండా జాగ్రత్తపడుతూ అనుసరించాడు షాడో.

“అందంగా వుంది ఈ గది. అసలు అందమనే పదానికి నిర్వచనం ఏమిటో నాకు తెలియదు” అన్నాడు ఆ గది గోడల మీద వున్న పెయింటింగ్స్ చూస్తూ.

ఆ మాటలకు అందంగానే నవ్వి, అక్కడ వున్న సోఫాల వైపు చేయి వూపింది ఆ యువతి.

“ఒక్క నిమిషంలో వచ్చేస్తాను మిస్టర్ షాడో...... నువ్వు నీ స్నేహితుడు తాపీగా కూర్చొని విశ్రాంతి తీసుకుంటూ వుండండి .......” అంటూ ఆ గది రెండో వైపున వున్న ద్వారంలోకి పరుగు తీసింది.

“నా కేమిటో యిబ్బందిగా వుంది గురూ.... ఇక్కడ కూర్చోవాలని అనిపించటం లేదు.” అంటూ మెల్లిగా ఒక సోఫా దగ్గిరికి పోబోయాడు శ్రీకర్.

చటుక్కన అతని భుజం మీద చేయి వేసి ఆపేశాడు షాడో.

“పాపం ఆ అమ్మాయి అంత ఆదరంగా ఆహ్వానించి కూర్చోమని చెపితే వద్దంటూ అడ్డం పడతావేంటి గురూ? ఏమయింది ఈ సోఫాలకి?” ఆశ్చర్యంగా అంటూ వాటి వంక పరీక్షగా చూశాడతను.

తన మనస్సులోని అనుమానాలను దాచుకోవటం అసాధ్యమనిపించి శ్రీకర్ కూర్చోబోయిన సోఫాను బూటు కాలితో బలంగా అదిమాడు షాడో.

కిర్రుమని వినవచ్చింది ఒక వికృత శబ్దం. అంత వరకూ అతి చక్కగా నిలబడి వున్న ఆ సోఫా ఒక్కసారిగా క్రిందికి క్రుంగి, అదృశ్యమైపోయింది. అది వున్న స్థానంలో పెద్ద సొరంగం ప్రత్యక్షం అయింది.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు షాడో.

“కమాన్ శ్రీ.... కమాన్” అంటూ వెను తిరిగి ముందు గదిలోకి పరుగు తీశాడు. పది అడుగులు కూడా వేయక ముందే బ్రేకులు పడినట్లు ఆగిపోయాయి అతని పాదాలు.

“మర్యాదగా చేతులు గాలిలోకి ఎత్తు మిస్టర్ షాడో – తప్పించుకోవవటానికి ప్రయత్నం చేస్తే ప్రాణాలు తప్పని సరిగా పోగొట్టుకుంటావ్.......” బరువైన షాట్ గన్ పట్టుకొని ముఖ ద్వారం దగ్గిర నిలబడి వున్న ఒక దృఢకాయుడు నవ్వుతూ హెచ్చరించాడు అతన్ని.

చేతుల్ని గాలిలోకి ఎత్తుతూ వెనక్కి నడిచి, సోఫాల గదిలోకి వచ్చేశాడు షాడో.

“హేట్సాఫ్ టూ యూ మిస్టర్ షాడో.....ఇంత తేలికగా మా నాటకాన్ని నువ్వు కనిపెడతావని అనుకోలేదు. రియల్లీ యూవర్ వండ్రఫుల్.....” నల్లటి రివాల్వర్ పట్టుకొని అతని ముందుకు వస్త మెచ్చుకుంది స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్‌గా నటించిన యువతి.

చూస్తూ చూస్తూ వచ్చి ఆ వలలో ఇరుక్కున్నందుకు తనను తానే నిందించుకుంటూ తల తిప్పి చుట్టూ చూశాడు షాడో.

ఒకరి తర్వాత ఒకరుగా ఆ గదిలో ప్రత్యక్షం అవుతున్నారు అనేక మంది దృఢకాయులు. అందరి ముఖాల లోను పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీ పోలికలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

"ఆల్ రైట్ మై ఫ్రండ్స్...... మీ తెలివి తేటల ముందు నేను ఓడిపోయాను. నన్ను కాంటాక్ట్ చేయాల్సిన స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ఏమయింది? ప్రాణాలతోనే వుందా? " వారందరి వంకా చూస్తూ కాజువల్‌గా ప్రశ్నించాడు.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని గుంభనంగా నవ్వుకున్నారు అందరూ.

"ఇప్పుడు ప్రశ్నలు వేయాల్సింది మేము మిస్టర్ షాడో..... సమాధానాలు చెప్పవలసింది నువ్వు..... నీతో పాటు యింకెంత మంది ఏజెంట్లు వచ్చారు? మిగిలిన వారందరూ ఎక్కడ వున్నారు?" రివాల్వర్‌ని విలాసంగా తిప్పుతూ ప్రశ్నించింది ఆ యువతి.

కన్ను కదిపినా సరే నిప్పులు కక్కేటట్లున్నాయి అక్కడ వున్న ఆయుధాలన్నీ. ఏ మాత్రం అనుమానం కలిగినా నిర్మొహమాటంగా కాల్పులు జరిపేటట్లున్నారు ఆ యువతి అనుచరులు.

"అనవసరమైన ఆలోచనలతో టైం వేస్ట్ చేయటం మంచిది కాదు మిస్టర్ షాడో.... మాతో సహకరించి మా ప్రశ్నలకు సమాధానాలు యివ్వటం చాలా మంచిది......." రివాల్వర్‌ని శ్రీకర్ చెవికి ఆనిస్తూ షాడోని హెచ్చరించింది ఆ యువతి.

"చెప్పేయ్ గురూ...... తొందరగా చెప్పేయ్...... మనతో వచ్చిన పాతికమంది ఏజెంట్లూ మెర్గాయ్ సిటీలోనే వున్నారని నిజం చెప్పేయ్." భయంతో కంపించిపోతూ షాడోని బ్రతిమాలాడు శ్రీకర్.

"మరీ అంత అబద్ధం చెప్పటం బాగోదు శ్రీ..... మనం నలభై మందిమి వచ్చామని చెపితే యిప్పుడు వచ్చే నష్టం ఏముంది?" వెంటనే అడిగేశాడు షాడో.

"ఆల్‌రైట్..... మా కందరికీ నాయకుడివి నువ్వు. నీ యిష్ట ప్రకారమే చెప్పు. ట్రిపోలీ సిటీలో వున్న వాళ్ళని గురించి మాత్రం పొరపాటున కూడా బయట పెట్టద్దు."

అతని ముఖంలోకి, షాడో ముఖంలోకి మార్చి మార్చి చూసిందా యువతి. వాళ్ళు తనను వేళాకోళం చేస్తున్నారని గ్రహించగానే కోపంతో ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది.

"మర్యాదగా అడిగితే మీరు మాట వినరు. మీ చేత ఎలా మాట్లాడించాలో నాకు బాగా తెలుసు" అంటూ వెనక్కి జరిగి చేయి వూపింది.

వెంటనే ముందుకు వచ్చారు ఇద్దరు దృఢకాయులు. తమ చేతుల్లో వున్న రివాల్వర్లను తమ సహచరులకు అందించి, దుస్తుల్లో దాచి వున్న పొడుగాటి కత్తుల్ని బయటికి తీశారు.

"అయ్యబాబోయ్ నాకు భయం వేస్తోంది...... కత్తుల్ని చూస్తే నాకు కళ్ళు తిరుగుతాయి..... కాళ్ళు వణికి క్రింద పడిపోతాను ......" అంటూ కీచుగా అరిచి నిజంగానే క్రింద పడిపోయాడు శ్రీకర్.

ఎదురు చూడని ఆ మూవ్‌మెంట్‌కి బిత్తరపోయి, పక్కకు జంప్ చేశారు ఆ దృఢకాయులు.

అదే సమయంలో ముందుకు డైవ్ చేశాడు షాడో. కుడిచేత్తో ఆ యువతి పాదాలను పట్టుకొని వేగంగా ప్రక్కకు దొర్లాడు.

కెవ్వున అరిచి నేల మీద చతికిల పడిందామె. ఆ అదటుకు గుండెలు జలదరించేలా గర్జించింది ఆమె చేతిలోని రివాల్వర్. నిప్పులు వెదజల్లుతూ పోయి ఒక దృఢకాయుడి గుండెల్లో దిగబడింది దాని బుల్లెట్.

బాధగా అరిచి క్రిందికి దొర్లాడు అతను. తనతో పాటు మరో వ్యక్తిని కూడా క్రింద పడేశాడు.

"చంపండి.....వా ళ్ళని చంపండి." కీచుగా అరుస్తూ రివాల్వర్‌ని షాడో తలకేసి గురిపెట్టటానికి ప్రయత్నించింది ఆ యువతి.

అదే సమయంలో గుప్పున ఆరిపోయాయి అంతవరకూ దేదీప్యమానంగా అక్కడ వెలుగుతున్న లైట్లు . కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది.

"టార్చిలైట్లు ఎక్కడున్నాయో చూడండి..... త్వరగా...... త్వరగా....." ఆందోళన నిండిన కంఠంతో అందరినీ హెచ్చరిస్తూ గబగబా వెనక్కి జరగటానికి ప్రయత్నించింది ఆ యువతి.

సడెన్‌గా ఆమె నోటి మీద పడి బలంగా అదిమింది ఒక చేయి. చేతిలోని రివాల్వర్ క్రింద పడిపోయేటట్లు దెబ్బకొట్టి అమాంతం ఎత్తి భుజం మీద వేసుకున్నాయి మరో రెండు చేతులు.

ఏదో ఒక విధంగా అరిచి తన వారిని హెచ్చరించటానికి ఆమె చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయిపోయాయి. చీకటి మాటున శత్రువులకు కనిపించకుండా బంగ్లా బయటికి పరుగు తీశాడు షాడో. మెయిన్ గేటును దాటి

పది గజాల దూరం కూడా పోక ముందే మ్రోతలు చేస్తూ వచ్చి వారి ముందు ఆగింది ఒక పాత ఫోర్టు కారు .

"వాసు ఏడి?" భుజం మీది యువతిని వెనుక సీటులో దొర్లిస్తూ, స్టీరింగ్ ముందున్న ముఖేష్‌ని ప్రశ్నించాడు షాడో.

చిరునవ్వుతో ఒక కరెంట్ పోల్ వైపు చూపించాడు ముఖేష్.

బంగ్లాకి కరెంట్ సప్లయ్ చేసే పోల్ అది. దాని మీద వున్న ఫ్యూజ్‌ని తొలగించి అప్పుడే తాపీగా క్రిందికి దిగి వస్తున్నాడు వాసు.

"వెల్‌డన్ వాసు...... సరయిన సమయానికి చక్కని పని చేశావు...... నువ్వు ఫ్యూజు లాగేయటంలో ఏ మాత్రం ఆలస్యం చేసి వున్నా, మా ఫ్యూజులు తీసేసి వుండేవాళ్ళు వీళ్ళు......" అంటూ పరుగెత్తుకొచ్చి కారు ఎక్కాడు శ్రీకర్.

వెంటనే కదిలింది ఫోర్టు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోయింది.

## 7

"నేను మెర్గ్యాయ్ సిటీలోకి వచ్చి స్పెషల్ బ్రాంచి ఏజంట్‌ని కలుసుకొని అన్ని విషయాలు తెలుసుకునేదాకా ట్రిపోలి సిటీలోనే వుండమని నా స్నేహితులకు ఆర్డర్లు యివ్వబడ్డాయి. విమాన ప్రమాదంలో నేను సముద్రం పాలయ్యానని తెలుసుకొని ఆర్డర్స్‌కి ఎగైనెస్ట్‌గా సముద్ర తీరానికి వచ్చారు వాళ్ళు. నేను పోలీసుల చేతికి చిక్కటాన్ని గమనించి నేర్పుగా నన్ను విడిపించారు. ఆ విషయం నాకు వాళ్ళకు తప్ప రెండో కంటి వాడికి తెలియదు. వాళ్ళు నాతో కలిసి బర్మా వచ్చినట్లు

నీకు తెలిసిందంటే నువ్వు స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్‌వి కానట్లే లెక్క" సిగరెట్ పొగను రింగులు రింగులుగా వదులుతూ అన్నాడు షాడో.

అతడికి ఎదురుగా ఒక కుర్చీలో బంధింపబడి వుంది స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్‌గా నటించిన యువతి. వివర్ణమైన ముఖంతో అతని మాటలు వింటోంది.

ఉన్నట్లుండి సిగరెట్‌ని అవతలికి విసిరేసి లేచి నిలబడ్డాడు షాడో.

"అనవసరమైన సంభాషణతో కాలక్షేపం చేయటం నాకు యిష్టం లేదు. మా అటమిక్ డిటనేటర్ ఏమయిందో ఎక్కడుందో గబగబా చెప్పేస్తే మా దారిన మేము వెళ్ళిపోతాం....." అంటూ ఒక ప్రక్కకు వెళ్ళి నిలబడ్డాడు.

రెండు క్షణాల పాటు అతని వంకే చూసి తలదించుకుంది ఆ యువతి. పెదవి విప్పి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

"నాకో ఛాన్సు యివ్వు గురూ.... నేను కూడా ఒకసారి అడిగి చూస్తాను." అంతవరకూ కామ్‌గా కూర్చుని వున్న శ్రీకర్ వెంటనే లేచి నిలబడుతూ అడిగాడు.

అతన్ని ఆగమని వాసుకు సైగ చేశాడు షాడో.

శ్రీకర్ కూర్చున్న ప్రదేశానికి దగ్గర్లోనే కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడతను. షాడో సైగను చూడగానే ఛెంగున లేచి ఆ యువతి ముందుకు వచ్చాడు. ఏం జరగుతున్నదో ఆమెకు అర్థం అయ్యేలోగా, ఆమెను బంధించి వుంచిన కుర్చీని అమాంతం గాలిలోకి ఎత్తి ధబేలున నేలకు వదిలాడు.

అదిరిపోయి వెర్రిగా అరిచిందా యువతి. భయంతో కంపించిపోతూ షాడో వైపు చూసింది.

“జాలి చూపించటం, దయ కనిపింప చేయటం మీ పాకిస్తాన్ సీక్రెట్ సొసైటీకి చేతకాదు. మీకు చేతకాని విషయాలను గురించి మమ్మల్ని అడగటంలో అర్థం లేదు. మర్యాదగా నా ప్రశ్నకు సమాధానం యివ్వటం చాలా మంచిది” నిర్మొహమాటంగా చెప్పాడు షాడో.

“ఆ ...... ఆటమిక్ డిటనేటర్ ఏమయిందో మాకు తెలియదు. దాని ఆచూకీ కోసమే మేము మిమ్మల్ని ఫాలో అయ్యాయి......” కంఠంలోని వణుకును కప్పి పెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ అన్నదామె.

“అబద్ధం చెబుతోంది గురూ.... అన్నీ వట్టి మాటలు” వెంటనే అందుకున్నాడు శ్రీకర్.

అతన్ని మాట్లాడవద్దని సైగ చేసి ఆ యువతి ముఖంలోకి సీరియస్‌గా చూశాడు షాడో.

“ఆల్‌రైట్ బేబీ..... నీ మాటల్ని మా వాళ్ళు నమ్మకపోయినా నేను నమ్ముతున్నాను. ఆటమిక్ డిటనేటర్ ఎక్కడ వుందో మీకు తెలియదని అన్నంత వరకూ బాగానే వుంది. మరి మా స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ఏమయింది? ఆమెను ఎక్కడ బంధించి వుంచారు?”

సమాధానం యివ్వలేదామె. పెదవులు బిగించి నేల చూపులు చూస్తూ శిలా విగ్రహంలా వుండిపోయింది.

“అలా మౌనవ్రతం పాటించినందువల్ల ప్రయోజనం లేదు అక్కాయ్! తొందరగా ఏదో ఒక సమాధానం చెప్పకపోతే చాలా బాధలు పడాల్సి వస్తుంది.....” నోరు వూరుకోక మరోసారి ఆమెను హెచ్చరించాడు శ్రీకర్.

అప్పటికీ పెదవి విప్పలేదామె. కనీసం తల ఎత్తయినా చూడలేదు వారి వైపు.

ఉన్నట్లుండి కదిలాడు వాసు. కుర్చీతో సహా ఆమెను ఇంకోసారి పైకి ఎత్తి దభేలున క్రింద పడేశాడు. అంతటితో ఆగకుండా ఎడమకాలిని జాచి ఫుట్‌బాల్‌ని తన్నినట్లు ఒక గోడకేసి బలంగా తన్నాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి గోడకు గుద్దుకుందా కుర్చీ. బాధగా అరిచి తల విదిలించిందా యువతి. బలమైన దెబ్బ తగలటం వల్ల నల్లగా కమిలిపోయింది ఆమె సుందర వదనం.

"సమాధానం చెప్పు సిస్టర్..... సమాధానం చెప్పు......" అంటూ రాక్షసుడిలా పోయి ఆమెను కుర్చీతో సహా గది మధ్యకు లాగాడు వాసు. ఈ సారి రెండో గోడకేసి కొట్టి వున్న పళాన తల్లక్రిందులు చేశాడు.

తల నేలకు పొడుచుకోవటంతో కీచుగా అరిచిందామె. భయంతో వణికిపోతూ కుర్చీని గట్టిగా పట్టుకొని వ్రేలాడ బడింది.

అలా గట్టిగా పట్టకోవటం వల్ల, వాసు విసిరిని విసుర్లు ధాటికి తన కరచరణాలను కుర్చీ కేసి బిగించి వున్న నైలాన్ తాళ్ళు లూజ్ అయిపోయినట్లు ఆమెకు తెలియలేదు.

కను చివరల నుంచి గదినంతా కలియచూశాడు షాడో.

ఒక మూలగా రెడీగా నిలబడి వున్నాడు శ్రీకర్. కుర్చీని మరోసారి తల్లక్రిందులు చేసే ప్రయత్నంలో వున్నట్లు కనిపించినా, చూపులన్నిటినీ ఎదుట వున్న కిటికీ మీదే కేంద్రీకరించి సర్వ సన్నద్ధంగా వున్నాడు వాసు.

ముఖేష్ లేడు ఆ గదిలో...... ఇంటరాగేషన్ వేగాన్ని పుంజుకుంటున్న సమయంలో నిశ్శబ్దంగా బయటికి జారుకున్నాడు.

"నీకు రెండు నిముషాలు వ్యవధి యిస్తున్నాను. రెండు నిముషాల్లోపల మనసు మర్చుకొని మాతో కో-ఆపరేట్ చేయక పోతే నీ అందమైన ముఖాన్ని అసహ్యకరంగా మార్చేసి మా దారిన మేము పోతాము. బాగా ఆలోచించుకొని సమాధానం చెప్పు ......" అంటూ మూసి వున్న గది తలుపుల వైపు తిరిగాడు షాడో.

అదే సమయంలో కర్ణ కఠోరంగా వినవచ్చింది పోలీస్ విజిల్. పది మంది పోలీసులు వేగంగా పరిగెత్తుకొస్తున్నట్లు బూట్ల శబ్దం వినిపించసాగింది.

ఉన్నట్లుండి ఆగిపోయిందా శబ్దం. మూసి వున్న తలుపులు ఒక్కసారిగా తెరుచుకున్నాయి.

"మైగాడ్ వచ్చేశారు! పోలీసులు వచ్చేశారు. కమాన్ ఎవ్రీబడీ.... ఇక్కడి నుంచి పారిపోకపోతే మన ప్రాణాలు మనకి దక్కవు." అంటూ సుడిగాలిలా గదిలోకి ప్రవేశించాడు ముఖేష్.

అతన్ని చూసిన మరుక్షణం కంటికి కనిపించనంత వేగంతో రియాక్ట్ అయ్యారు అందరూ. తెరిచి వున్న ఫ్రెంచి విండోలో నుంచి బయటికి దూకేసి, చీకట్లలో కలిసిపోయారు.

బుల్ డోజర్ క్రింద పడినట్లు మెలికలు తిరిగిపోయిన అవయవాల్ని అతి ప్రయత్నం మీద స్వాధీనంలోకి తెచ్చుకుంటూ, మొట్ట మొదటిసారిగా తన కరచరణాలు బంధాల నుంచి బయట పడినట్లు గ్రహించింది ఆ యువతి.

పట్టరాని సంతోషంతో పరవశించిపోతూ ఛెంగున కుర్చీలో నుంచి లేచి తను కూడా ఫ్రెంచి విండోలో నుంచి బయటికి దూకేసింది.

ఇంటి ముందు నుంచి మరోసారి వినవచ్చింది పోలీస్ విజిల్.

“చుట్టు ముట్టండి. ఆ యింటిని చుట్టుముట్టి సోదా చేయండి......” ఖంగుమంటున్న కంఠంతో కమాండ్ చేస్తున్నాడు ఒక పోలీసు.

భరించరాని బాధ అవయవాల్ని పట్టి పీడిస్తున్నా లెక్క చేయకుండా, దగ్గిర్లో వున్న ఒక సందులోకి పరిగెత్తి క్రూరంగా నవ్వుకుంది ఆ యువతి.

“పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీని బెదిరించి ఇన్ఫర్మేషన్ రాబట్టటం నీ తరం కాదు మిస్టర్ షాడో..... మా శక్తి ఎటువంటిదో పోను పోను నీకు యింకా బాగా తెలిసి వస్తుంది. నీ కంటే ముందుగా ఆటమిక్ డిటనేటర్‌ని వశపరుచుకొని నీ ఆటలు కట్టించకపోతే అప్పుడు అడుగు.” అనుకుంటూ ఒక ఇంటి చాటున నిలబడి ముందుకు తొంగి చూసింది.

సివిల్ డ్రస్‌లో వున్న పది మంది పోలీసులు ఆమెను బంధించిన ఇంటిని చుట్టుముడుతున్నారు. రెండు టార్చిలైట్లను పట్టుకొని ఫ్రెంచి విండో దగ్గిర తచ్చట్లాడుతున్నారు వారిలో యిద్దరు.

ఆ పైన అక్కడ నిలబడడం మంచిది కాదని గ్రహించి సందు చివరకి పరుగు తీసిందా యువతి. అక్కడ కనిపించిన ఒక టాక్సీని ఎక్కి ముందుకు పోనీయమని సైగ చేసింది.

ఆ టాక్సీ వంద గజాల దూరం పోయిన తర్వాత మెల్లిగా ఒక ఇంటి చాటునుంచి యివతలికి వచ్చాడు షాడో. మరో నిమిషం తర్వాత అతని ప్రక్కన

ప్రత్యక్షం అయ్యాడు ముఖేష్. అతన్ని అనుసరించి అక్కడికి వచ్చేశారు ఫ్రెంచి విండో ఇంటిని చుట్టుముట్టిన సివిల్ డ్రస్ పోలీసులు.

"ఎలా వుంది సార్ మా యాక్షన్? మీకు తృప్తిని కలిగించిందా?" నవ్వుతూ కుడిచేతిని ముందుకు జాచాడు వారిలో ఒకతను.

మారు మాట్లాడకుండా వాలెట్‌ని తీసి నాలుగు కరెన్సీ నోట్లను అతని చేతిలో పెట్టాడు ముఖేష్.

"అవసరం అయితే కబురు చేయండి సార్.... రాత్రి పగలు అనే భేదం లేకుండా ఎప్పుడు రమ్మంటే అప్పుడు వచ్చి పడతాం." అంటూ ఆ నోట్లను జేబులో పెట్టుకున్నాడతను. తన వారందరితోను వచ్చిన దారినే వెనక్కి వెళ్ళిపోయాడు .

అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న ఒక రెస్టారెంట్ దగ్గిరికి పోయి, రోడ్డును ఫేస్ చేసి వుండే టేబిల్ నొకదాన్ని ఆక్రమించుకున్నారు షాడో, ముఖేష్ రోడ్డుమీద తిరుగుతున్న వారిని, రెస్టారెంట్ లోకి వచ్చిపోతున్న వారిని ఓరకంటితో జాగ్రత్తగా వాచ్ చేస్తూ, వెయిటర్ తెచ్చిన టీని సిప్ చేయ సాగాడు షాడో.

నిద్ర ముంచుకు వస్తున్నట్లు కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్నాడు ముఖేష్. అతని చూపులు మాత్రం కాషియర్ దగ్గిర వున్న టెలిఫోన్ మీదే కేంద్రీకరించి వున్నాయి.

## 8

"స్టాప్.... స్టాప్ ది టాక్సీ!" ఉన్నట్లుండి కీచుగా అరిచాడు శ్రీకర్.

అదిరిపడి బ్రేకుల మీద కాలు వేశాడు టాక్సీ డ్రయివర్.

"ఏమయింది సార్? చెప్పేదేదో నెమ్మదిగా చెప్పక అలా చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరుస్తారు దేనికి?" విసుగ్గా అంటూ అతని వైపు చూశాడు.

పాంటు జేబులో నుంచి రెండు కరెన్సీ నోట్లను తీసి అతని మీదికి విసిరేశాడు శ్రీకర్. అతని మాటలు వినబడనట్లే నటిస్తూ వాసు చేయి పట్టుకొని క్రిందికి దూకేశాడు.

"రెండు గంటల పాటు ఎక్కడా ఆపకుండా తిరగాలని చెప్పి, అరమైలు దూరం కూడా రాకముందే నన్ను వదిలించుకుంటున్నారా? పచ్చి అన్యాయం యిది. మీ డబ్బు నాకు అక్కరలేదు నేనేమీ ముష్టివాడిని కాదు." కోపంగా అంటూ తను కూడా క్రిందికి దిగి వారి దారికి అడ్డం పడబోయాడు టాక్సీ డ్రయివర్.

"వీడితో మాట్లాడుతూ కూర్చుంటే వున్న పుణ్యకాలం కాస్తా యిక్కడే గడిచిపోతుంది. తొందరగా వదిలించుకుని వెంటనే వచ్చేయ్ వాసూ!" అని వాసును హెచ్చరిస్తూ సూటిగా ముందుకు పరుగు దీశాడు శ్రీకర్.

"ఆగండి సార్..... నా మాటకు బదులు చెప్పి మరీ కదలండి." అంటూ అతని చేతిని పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్న టాక్సీ డ్రైవర్‌ని అమాంతం గాలిలోకి ఎత్తాడు వాసు. అటు ఇటు రెండుసార్లు వూపి ప్రక్కనే వున్న మురికి గుంటలోకి విసిరి కొట్టాడు.

"చచ్చాను బాబాయ్...... నేను చచ్చిపోయాను.... రౌడీ నాయాళ్ళు నన్ను కొట్టి పారిపోతున్నారు దేవుడోయ్......" మురికి గుంటలో నుంచి లేవకుండా

అలాగే బాసిపట్టు వేసుకుని కూర్చుని రాగాలాపన ప్రారంభించాడు టాక్సీ డ్రయివర్.

ఆ అరుపుల్ని విని చుట్టుపట్ల వున్న జనం అటుకేసి రావటం గమనించాడు వాసు. అనవసరమైన గొడవ చేస్తున్న ఆ డ్రయివర్‌ని మరోసారి గాలిలోకి ఎత్తుదామన్న కోరికను బలవంతంగా అణుచుకుంటూ శ్రీకర్ పోయిన దిశగా పరుగులు తీశాడు.

పది నిముషాల తరువాత ఒక చీకటి వీధి ముందు అతనికి కనిపించాడు శ్రీకర్. నిర్మానుష్యంగా అగుపిస్తున్న ఒక బంగ్లాను జాగ్రత్తగా వాచ్ చేస్తూ, శబ్దం చేయొద్దని వాసును హెచ్చరించాడు.

బంగ్లా ముందే ఆగి వుంది ఒక టాక్సీ. పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీ ఏజెంట్ పారిపోయిన వచ్చింది అందులోనే.

“యూ జస్ట్ వెయిట్ హియర్ వాసూ.... నేను లోపలికి పోయి వస్తాను.” అంటూ రెండు అంగల్లో బంగ్లా చుట్టూ వున్న ప్రహరీ గోడను సమీపించాడు శ్రీకర్. తనను ఎవరూ గమనించటం లేదని నిశ్చయం కాగానే ఛెంగున ఎగిరి అవతలి ప్రక్కన పడ్డాడు.

రకరకాల పూ పొదలతో, అందమైన క్రోటన్ మొక్కలతో నిండి వుంది ప్రహరీ లోపలి భాగం. వాటిని చాటుగా చేసుకొని, పాములా ముందుకు పాక్కుంటూ పోయాడతను. రెండు నిముషాల తరువాత ఓరగా తెరిచి వున్న ఒక విండోని సమీపించి చెవులు రిక్కించాడు .

అతని వూహ యదార్థం అయింది.

చేతులు వెనక్కి విరిచి కట్టుకొని, ఆ కిటికీ వున్న గదిలోనే పచార్లు చేస్తోంది పారిపోయి వచ్చిన యువతి. పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని శిలా విగ్రహాల్లా నిలబడి వున్నారు పది మంది దృఢకాయులు. ఆమె చెపుతున్న మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారు.

“ ......మనం వెంటనే మూవ్ కాకపోతే ఇంత వరకూ పడిన శ్రమ అంతా వృధా అయిపోతుంది. బై హుక్ ఆర్ క్రూక్ స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ఎక్కడ వుందో కనిపెట్టి తీరతాడు ఆ షాడో. అతనికంటే ముందుగా మనం ఆ ఏజెంట్‌ని చేజిక్కుంచుకోవాలి.” ఉన్నట్లుండి పచార్లు చేయటం ఆపి సీరియస్‌గా అన్నదామె.

“అనవసరమైన ఆవేశాలకు పోయి తాపీగా చేయవలసిన పనుల్ని రషప్ చేయటం మంచిది కాదు మేడమ్..... ఇండియన్ స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ఝురియా కిల్లర్స్ చేతుల్లో బంధింపబడి వున్నదని మరిచిపోవద్దు!” వెంటనే తన అభిప్రాయాన్ని వెల్లడించాడు ఒక దృఢకాయుడు.

కిటికీ తలుపులకు చెవి ఆనించి వింటున్న శ్రీకర్ శరీరం ఒక్కసారిగా జలదరించింది చలిగాలి వీచినట్లు. అక్కడి నుంచి అవతలికి పరిగెత్తి ఆ మాటలు షాడోకి చేరవేయాలన్న పిచ్చి కోరిక ఒక్కక్షణం పాటు అతని మనస్సుని మెలిపెట్టి వదిలింది.

గదిలో నుంచి యువతి మాటలు వినరావటంతో విల్‌పవర్‌నంతా కూడ గట్టుకొని కాలు నిలదొక్కుకున్నాడతను.

“ఝూరియా వాళ్ళ సంగతి నాకు బాగా తెలుసు కాబట్టే, యింతకాలం వాళ్ళ జోలికి పోకుండా ఆగాను. వారితో కలబడి ఇండియన్ స్పెషల్ బ్రాంచి

ఏజెంట్‌ని వశపరుచుకోవటానికి ముందుగా షాడోని, అతని స్నేహితుల్ని అడ్డు తొలగించుకోవటం మంచిదనే వుద్దేశ్యంతో ఈ రోజు పథకాన్ని అమలుపరచటం జరిగింది.... మన దురదృష్టవశాత్తూ తెలివిగా తప్పుకున్నాడు ఆ షాడో. ఇక అతన్ని ఆపటానికి ప్రయత్నించే కంటే, ఝరియా బృందంతో తలపడి అటో యిటో తేల్చుకోవటం చాలా మంచిది. మన వారందర్నీ రెడీ చెయ్యండి. తెల్లవారేలోగా మన పని పూర్తికావాలి." దృఢస్వరంతో తన ప్లానును వివరించటం మొదలు పెట్టిందా యువతి.

ఆ పైన అక్కడ ఆగదలుచుకోలేదు శ్రీకర్. గిరుక్కున వెనుతిరిగి ప్రహరీ గోడ దగ్గిరికి పరుగుతీశాడు. గుండెల నిండా గాలి పీల్చుకుని ఒక్కసారిగా గాల్లోకి జంప్ చేసి ప్రహరీని దాటాడు. అతని పాదాలు నేలను తాకటం, అప్పుడే మెయిన్ గేటులో నుంచి ఒక సెంట్రీ బయటికి వచ్చి అతన్ని చూడటం ఒకేసారి జరిగింది.

"హేయ్! ఎవరు నువ్వు? ఏం చేస్తున్నావక్కడ??" బరువైన రైఫిల్ నొకదాన్ని రెడీగా పట్టుకొని పరుగు పరుగున అతన్ని సమీపించాడు సెంట్రీ.

దగ్గిరికి రానిచ్చి పళ్ళన్నీ కనబడేటట్లు నవ్వాడు శ్రీకర్.

"చూడు బ్రదర్..... ఇక్కడ ఏదైనా టెలీఫోన్ దొరుకుతుందా? అర్జంట్‌గా మా వాళ్ళకి ఫోన్ చేయాలి..... వెరీ అర్జంట్....." లోగొంతుకతో అంటూ అతని వైపు రెండు అడుగులు వేశాడు.

రైఫిల్‌ని చటుక్కున అతని గండెలకు ఆనించి అయోమయంగా చూశాడు ఆ సెంట్రీ.

గుండెల్ని తాకుతున్న రైఫిల్ బారెల్ని గమనించనట్లే నటిస్తూ మరింత ముందుకు వంది వీధి చివర వున్న లాంప్ పోస్ట్ వైపు చూపించాడు శ్రీకర్.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని అసహనంగా వెయిట్ చేస్తున్నాడు అక్కడ వాసు. అపర భీముని మాదిరి అగుపించే అతని పర్సనాలిటీని గమనించి నోరు తెరిచాడు ఆ సెంట్రీ.

"మా వీధిలో ఒక చక్కటి మర్యాదస్తుల అమ్మాయిని బలవంతంగా ఎత్తుకు వచ్చాడు ఆ దుర్మార్గుడు. అతని కోసం నేనూ నా స్నేహితులు సిటీ అంతా గాలిస్తున్నాం. దయచేసి ఇక్కడ ఏదైనా టెలీఫోన్ వుందేమో చెపితే మా వాళ్ళకు ఫోన్ చేస్తాను. ఒక చక్కని చుక్క భవిష్యత్తును బాగు చేసిన ఘనత నీకు దక్కుతుంది." క్షణం కూడా తడబడకుండా, కొంచెం కూడా శృతి బేధం లేకుండా నోటికి వచ్చిన కట్టుకథను నీట్‌గా అతనికి వినిపించాడు శ్రీకర్.

అసహనంగా అటూ ఇటూ కదులుతున్న వాసు పర్సనాలిటీ సెంట్రీకి విపరీతమైన అనుమానాన్ని కలిగించింది.

"ఆల్‌రైట్ బ్రదర్.... అటువంటి దుర్మార్గుల్ని వూరికే వదిలిపెట్టకూడదు. కమ్ విత్ మీ." అంటూ రైఫిల్‌ని క్రిందికి దించి వెనుతిరిగాడు .

అతన్ని నాలుగు అడుగులు వేయనిచ్చి గిర్రున వెనుతిరిగాడు శ్రీకర్. వాసుకు సైగ చేస్తూ సుడిగాలిలా వీధి చివరికి పారిపోయాడు.

పది అడుగులు వేసి ఎందుకో అనుమానం వచ్చి వెను తిరిగి చూశాడు సెంట్రీ. కనబడటానికి అక్కడ ఎవరున్నారని ?

"దొంగ రాస్కేల్స్ ...... నన్నే మోసం చేస్తారా? మీ అంతు చూస్తాను." అంటూ వీధి చివరికి పరిగెత్తుకు వచ్చాడతను.

అప్పటికే ఆ ప్రదేశాన్ని ఖాళీ చేసి మరో వీధిలోకి మాయం అయిపోయారు వాసు, శ్రీకర్.

## 9

"హల్లో! ఎవరు మాట్లాడుతోంది? జాకబ్ మియానా? చంచల్ బస్తీ నుంచి ఫోనా? హల్లో!!" బిగ్గరిగా అరుస్తూ రెస్టారెంట్ నంతా కలియ చూశాడు కాషియర్.

కుర్చీ వెనక్కి వాలి నిద్ర నటిస్తున్న ముఖేష్ ఛెంగున లేచి రెండు అంగల్లో అతన్ని సమీపించాడు.

"మా వాడే సార్ ఫోన్ చేస్తోంది. నా కోసమే పిలుస్తున్నాడు." అంటూ రిసీవర్‌ని అతని చేతుల్లో నుంచి బలవంతంగా లాక్కుని చెవికి ఆనించుకున్నాడు.

అవతలి వైపు నుంచి వినవచ్చిన మాటల్ని ఆలకించగానే సన్నటి చిరునవ్వు ఒకటి ప్రత్యక్షం అయింది అతని పెదవుల మీద.

"బ్రహ్మాండంగా సక్సెస్ అయింది మన ప్లాను. మన వాడు చెప్పిన పనిని చెప్పినట్లే పూర్తి చేసి మన కోసం ఎదురు చూస్తున్నాడు" రిసీవర్‌ని పెట్టేసి షాడో వైపు తిరుగుతూ అన్నాడు.

అంతవరకూ తాము తాగిన టీలకు బిల్లును పే చేసి రోడ్డుమీదికి దారి తీశాడు షాడో.

రెస్టారెంట్ ముందు వున్న టాక్సీ నొకదాన్ని పిలిచి ముందు సీట్లో కూర్చున్నాడు ముఖేష్. షాడో వెనుక భాగంలో కూర్చోగానే డ్రయివర్‌కి సైగ చేసి ఒక అడ్రస్ చెప్పాడు.

అరగంట తరువాత మెర్గాయ్ సిటీకి ఈశాన్య దిశలో వున్న పెద్ద సరుకు తోపును సమీపించి ఆగింది టాక్సీ.

సిగరెట్ వెలిగించుకుంటూ క్రిందికి దిగి చుట్టూ చూశాడు షాడో. సరుకు తోపు మధ్యలో అగుపిస్తోంది విశాలమైన భవంతి ఒకటి. సరుకు తోపుకు ఎడమ ప్రక్కన ఎర్రని నియోన్ లైట్లతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది ఒక సినిమా థియేటర్.

"సినిమా యాక్టర్ నిలబడినట్లు అలా రోడ్డు మీదే నిలబడితే కొంపలు నిలువునా అంటుకుంటాయి. ఇవతలికి వచ్చేయ్ గురో...... యివతలికి వచ్చేయ్ " ఉన్నట్లుండి వినవచ్చింది శ్రీకర్ కంఠం.

ఉలిక్కిపడి అటు చూశాడు షాడో. అప్రయత్నంగా అతని పెదవుల మీద ప్రత్యక్షం అయింది చిన్న చిరునవ్వు.

ఎక్కడ పట్టాడో గాని, పెద్ద రిక్షా నొకదాన్ని పట్టి, రిక్షావాలా మాదిరిగా సీటు మీద కూర్చొని వున్నాడు శ్రీకర్. తప్పతాగి మైకంలో మునిగిపోయిన కస్టమర్‌లా కునికిపాట్లు పడుతున్నాడు వెనుక కూర్చుని వున్న వాసు.

శ్రీకర్ మాటలు అర్థంకాక అయోమయంగా చూస్తున్న టాక్సీ డ్రయివర్ చేతిలో ఒక కరెన్సీ నోటు పెట్టి వెళ్ళి పొమ్మని సైగ చేశాడు ముఖేష్. అతను వెళ్ళిపోగానే షాడోతో కలిసి రిక్షా దగ్గిరికి అడుగులు వేశాడు.

“మన ఫ్రండ్స్ సినిమా హాల్లోకి పోయారు...... ఇంకో పది, పదిహేను నిముషాల్లో బయటికి రావచ్చు.....” సినిమా హాలు వైపు చూపిస్తూ, అంతకు ముందు తను విన్న విషయాల్ని వివరంగా చెప్పాడు శ్రీకర్.

సగం కాలిన సిగరెట్‌ని అవతలికి విసిరి, సాలోచనగా మరో సిగరెట్ వెలిగించుకున్నాడు షాడో. ఝురియా ఏజెంట్లు కూడా రంగంలో వున్నారనే మాట అతన్ని విపరీతమైన ఆందోళనకు గురి చేయసాగింది.

కులకర్ణిగారు చెప్పిన జాగ్రత్తలను పాటించకుండా, బర్మా పోలీసులను రెచ్చగొట్టాడు తను. వాళ్ళు చాలదన్నట్లు పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీ తోకను తొక్కటం జరిగింది. ఇప్పుడు ఎడిషనల్‌గా ఝురియా రాక్షసులు ప్రత్యక్షం అయ్యారు. అంతమంది అడ్డుపడుతూ వుంటే, ఎంత వరకూ సక్సెస్ అవుతుంది తమ ఎస్సైన్‌మెంట్ ??

షాడో ఆలోచనలు ఒక కొలిక్కి రాకముందే సడన్‌గా లేచి కూర్చున్నాడు కునికిపాట్లు పడుతున్న వాసు.

“గెట్ రెడీ ఎవ్రీబడీ..... వచ్చేస్తున్నారు మన వాళ్ళు” అంటూ రిక్షా మీది నుంచి దిగి, చీకట్లలోకి జరిగాడు.

వెంటనే అతని చోటును ఆక్రమించుకున్నారు ముఖేష్, షాడో. ముఖాలు కనపడకుండా జాగ్రత్తపడుతూ రిక్షావాలాతో బేరాలు ప్రారంభించారు.

సరిగ్గా అర నిముషం తరువాత వారి ప్రక్కన ప్రత్యక్షం అయ్యారు పాతిక మంది దృఢకాయులు. వారి మధ్యలో అడుగులు వేస్తూ, రోడ్డు ప్రక్కన ఆగి వున్న రిక్షాకేసి అనుమానంగా చూసింది పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీకి చెందిన మేడమ్.

"అర్ధరాత్రి దాకా అన్ని వీధులూ తిప్పించి, ఇప్పుడు అడ్రసు దొరకలేదని డబ్బులు తక్కువ యిస్తారా? నా సంగతి మీకు బాగా తెలియదు. తిక్కరేగిందంటే ఎమ్మటపడి మరీ బాదుతాను. మర్యాదగా నా సొమ్ములు నాకు యివ్వండి!" ముఖం కండగడ్డ చేసుకొని గయ్‌మని ఇంతెత్తున ఎగిరాడు శ్రీకర్.

ఆ అరుపుల్ని వినేసరికి మాయమైపోయింది మేడమ్ ముఖంలోని అనుమానం. బర్మాలోని రిక్షావాళ్ళ గొంతులు ఎలా వుంటాయో ఆమెకు బాగా తెలుసు.

"అతనితో గొడవ పెట్టుకోకండి. అడిగినంత యివ్వటం చాలా మంచిది" ఒక వుచిత సలహాను షాడో వైపు విసిరేసి, తనలో తను నవ్వుకుంటూ ముందుకు సాగింది.

దృఢకాయులు సరుకు తోపులోకి పోయే దాకా ఆగి షాడో ముఖంలోకి చూశాడు శ్రీకర్.

"మనం కూడా వెళదాం గురూ! ఆలస్యం అయితే కథ మళ్ళీ మొదటికి వస్తుంది" అంటూ.

సమాధానం యివ్వలేదు షాడో. సిగిరెట్ పొగను గుండెల నిండా పీల్చుకుంటూ, సినిమా థియేటర్ ముందున్న ఒక టీ బంక్ వైపు కనులతో చూపించాడు.

ఒకరి తరువాత ఒకరుగా అందులో నుంచి బయటికి వస్తున్నారు అనేక మంది ఆజానుబాహులు. అటూ యిటూ చూసి, సరుకుతోపువైపే బయలుదేరారు వారందరూ.

"అయ్యబాబోయ్! వీళ్ళెవరూ గురూ? ఇంకో కొత్త పార్టీ ఏదైనా రంగంలోకి వచ్చేసిందా?" ఆశ్చర్యంగా అనబోయి, ఆ మాటల్ని తనలోనే అదుముకున్నాడు శ్రీకర్.

రిక్షాను పది అడుగుల దూరంలోకి రాగానే పాంటు జేబుల్లోనుంచి చేతుల్ని బయటికి తీసి పెద్ద పెద్ద అడుగులు వేయసాగారు వాళ్ళు. బయటికి వచ్చిన వారి చేతుల్లో నల్లగా నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి సైలన్సర్స్ అమర్చిన రివాల్వర్లు.

అప్రయత్నంగా తల వూపి వారి తెలివికి మెచ్చుకున్నాడు షాడో.

బంధించిన స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌కి విచిత్రమైన పద్ధతిలో కాపలా కాస్తున్నారు ఝరియా బృందం. అందరిలా కాకుండా, ఏజెంట్ వున్న ప్రదేశానికి దూరంగా వుండి, అన్ని దిక్కుల్నీ జాగ్రత్తగా వాచ్ చేస్తున్నారు. అటువంటి సెక్యూరిటీ అరేంజ్‌మెంట్ ముందు పాకిస్థాన్ బృందం దెబ్బతిని పారి పోవటం తప్పనిసరి.

ఆ మాట అతని మనస్సులో మెదులుతూ వుండగానే అస్పష్టంగా వారి చెవికి చేరాయి సైలన్సర్స్ అమర్చిన రివాల్వర్ మ్రోతలు. వాటికి జతగా చెవులు చిల్లులు పడే రైఫిల్ గర్జనలు రెండుసార్లు వినిపించి వెంటనే ఆగిపోయాయి .

అర నిముషం కూడా గడవక ముందే పరుగు పందేలలో పాల్గొంటున్నట్లు శరవేగంతో అటువైపు పరిగెత్తుకు వచ్చేసారు పాకిస్థాన్ బృందం.

అందరి కంటె ఆఖర్న వచ్చింది మేడమ్. ఎర్రటి నెత్తురు మరకలతో నిండిన ఎడమ భుజాన్ని కుడిచేత్తో అదుముకుంటూ, ప్రక్కలకు కూడా చూడకుండా పరుగులు తీసి చీకట్లలో కలిసిపోయింది.

రెండు నిముషాల తరువాత తాపీగా వచ్చి టీ బంక్ లోకి వెళ్ళిపోతున్న అజానుబాహుల్ని గమనిస్తూ గాఢంగా నిట్టూర్చాడు షాడో.

"నిట్టూర్పులు విడుస్తూ అలా కూర్చుండిపోతే ఎలా గురూ? వచ్చిన పని సక్సెస్ అయ్యే మార్గం చూడటం బాగుంటుంది కదా?" అసహనంగా అంటూ రిక్షా సీటు నుంచి దిగాడు శ్రీకర్.

అతన్ని అక్కడే వుండమని సైగ చేసి మెల్లిగా ముందుకు కదిలాడు షాడో. సరుకుతోపును చుట్టి, థియేటర్ మీదుగా ఒక పెద్ద రౌండ్ వేసి అరగంట తరువాత తిరిగి వచ్చాడు.

సరుకు తోపుకు నాలుగు ప్రక్కలా రెడీ అయి వున్నారు ఝురియా ఏజెంట్లు. అనుమానాస్పదమైన ఆకారాలు తోపులోకి అడుగు పెట్టిన మరుక్షణం మీద పడి ప్రాణాలు తీస్తారు. వాళ్ళకి అనుమానం కలగకుండా తోపులోకి పోగలిగితే !!

" ఓస్! ఇంతేనా? ఇందుకేనా యిందాకటినుంచీ అలా సీరియస్‌గా ఆలోచించటం.... సెకండ్ షో వదిలిపెట్టిన మరుక్షణం మనం తోపులోకి పరిగెత్తుదాం. రెడీగా వుండండి" షాడో ఆలోచనలను విన్న మరుక్షణం డిక్లేర్ చేసి, హుషారుగా విజిల్ వేస్తూ, ఝురియా బృందం డేరా వేసిన టీ బంక్ లోకి పోయాడు శ్రీకర్.

"ఈ దుర్మార్గుడు ఏదో గోల చేయటానికి సిద్ధం అవుతున్నాడు....... ఇవాళ మన పీకల మీదికి ఏదో ముంచుకు రాబోతుంది నాకు తెలుసు." అనుమానంగా చూస్తూ తన బాధను షాడోతో వెళ్ళబోసుకున్నాడు ముఖేష్.

అప్పుడప్పుడే శ్రీకర్ మనసులోని ఆలోచన షాడోకి అర్థం అవుతోంది. అర్థం అవుతున్నకొద్దీ పెద్దది కాసాగింది అతని పెదవుల మీది చిరునవ్వు.

ముఖేష్ మాటలకు అతను సమాధానం యివ్వకముందే గప్పున వెలిగాయి థియేటర్ చుట్టూ వున్న లైట్లు. సినిమా వదలబోతున్నట్లు బెల్ వినవచ్చింది. రెండు క్షణాల తరువాత గుంపులు గుంపులుగా బయటికి రాసాగారు జనం.

టీ బంక్‌లో నుంచి యివతలికి వచ్చి, నోట్లో వున్న సిగరెట్‌ని నేల మీదికి విసిరి కొట్టాడు శ్రీకర్. అటూ ఇటూ చూసి, రోడ్డును క్రాస్ చేయబోతున్న ఒక పడుచుపిల్ల చేయి పట్టుకొని బలంగా ముందుకు గుంజాడు.

అదిరిపడి వెనక్కి దూకిందా పిల్ల. ఇంత లావున నోరు తెరిచి ఆ ప్రదేశం దద్దరిల్లిపోయేలా అరిచింది.

“అరెరే..... చూస్తారేమిటి? పట్టుకోండి ఆ రాస్కెల్‌ని. కాళ్ళు చేతులు విరిచేయండి......” అని అరిచి ఛెంగున ముందుకు దూకాడు షాడో.

పడుచు పిల్ల అరుపులకు ఎక్కడి వాళ్ళక్కడ ఆగిపోయారు జనం. షాడో చేసిన హెచ్చరికతో ఒక్కసారిగా ముంచుకు వచ్చింది వారిలో రోషం.

“పట్టుకోండి దొంగ రాస్కెల్‌ని...... మళ్ళీ యిటువంటి పనులు చేయకుండా మక్కెలు విరగతీయండి” అంటూ గుంపు కట్టి కదిలారు.

భయంతో కంపించి పోతున్నట్లు ముఖం పెట్టి, బాణంలా రోడ్డుకు అడ్డం పడ్డాడు శ్రీకర్. వెనుకా ముందు చూడకుండా సరుకు తోపు వైపు పరుగు తీశాడు.

“పట్టుకోండి...... పొరపాటున కూడా వదలకండి.” అని అరుస్తూ గుంపును హుషార్ చేశాడు ముఖేష్.

ఒక వేళ పట్టుదల సడలి వాళ్ళందరూ వెనక్కి తిరుగుతారేమో అన్న అనుమానంతో వారితో పాటు పరుగు ప్రారంభించారు.

క్షణ క్షణానికి రైజ్ అయిపోయింది ఆ గుంపులోని వారి కోపం. పారిపోతున్న రౌడీని పట్టుకొని అంతు చూసి తీరాలన్న కచ్చతో రెండో ఆలోచన లేకుండా సరుకు తోపులోకి అడుగు పెట్టారు.

పది నిముషాల పాటు చెట్ల మధ్య గిరికీలు కొట్టాడు శ్రీకర్. పట్టుబడటం అంటూ జరిగితే బ్రహ్మదేవుడు కూడా తనను రక్షించలేడని అతనికి తెలుసు. అందుకే ఆయాసం ముంచుకు వస్తున్న చిహ్నాలు కనిపించిన మరుక్షణం , లావుగా గుబురుగా పెరిగి వున్న ఒక సరుకు చెట్టును ఎంచుకొని వుడతలా పైకి పాకేశాడు.

"అడుగో.... అడుగడుగో..... ఆ బంగ్లాలోకి పోయాడు. ఆ బంగ్లా లోపలికి పోయాడు." అని అరుస్తూ అందరి కంటె ముందుగా బంగ్లా దగ్గిరికి వెళ్ళిపోయాడు షాడో.

అతను వూహించినట్లే బంగ్లా దగ్గిర అతి తక్కువ మంది కాపలా వున్నారు. నల్లని రివాల్వర్లను పట్టుకొని గుడ్లు అప్పగించి చూస్తున్నారు వాళ్ళందరూ. ఉరుకులు పరుగులు మీద వస్తున్న జన సమూహాన్ని గమనించి ఏం చేయాలో అర్థంకాక అయోమయంగా నిలబడి వున్నారు.

"తప్పుకోండి.... మాకు అడ్డం తప్పుకోండి..... ఆడపిల్లల్ని అవమానించే రౌడీలకు ఎలా బుద్ధి చెపుతామో చూద్దురు గాని అడ్డు తొలగండి." అని అరుస్తూ వాళ్ళ మధ్యలో నుంచి లోపలికి దూసుకుపోయాడు షాడో.

అతన్ని, అతని వెనుకే వస్తున్న ముఖేష్, వాసుల్ని ఆపటానికి ఝురియా బృందం చేసిన ప్రయత్నాలు విఫల మయ్యాయి. చూస్తుండగానే పొలికేకలు పెడుతూ బంగ్లాలోకి ప్రవేశించారు ప్రజలు. అడ్డువచ్చిన ఝురియా వాళ్ళను అవతలికి నెట్టి పడేశారు.

ముందు గదిని దాటగానే కనిపించిన మెట్లను ఎక్కి బంగ్లా పై భాగంలో వున్న ఒక విశాలమైన హాలులోకి వెళ్ళాడు షాడో.

ఒకే ఒక గది కనిపిస్తోంది అక్కడ. మూసి వున్న ఆ గది తలుపుల ముందు ఉక్కుస్తంభాల మాదిరి నిలబడి వున్నారు ఇద్దరు ఝురియా ఏజెంట్లు.

"ఆగు...... అడుగు ముందుకు వేశావంటే హతమారిపోతావ్!!" బరువైన రివాల్వర్లను అతని కేసి గురిపెడుతూ కరుకుగా హెచ్చరించారు వాళ్ళు షాడోని చూడగానే.

## 10

ఆలోచించే వ్యవధి లేదు. ఆలస్యం చేసేందుకు వీలు లేదు. సరుకుతోపు చుట్టూ కాపలా వున్న మూకలు గనుక బంగ్లా దగ్గిరికి వస్తే తమ బండారం బయట పడిపోతుంది.

శరవేగంతో ఆలోచిస్తూ చేతుల్ని గాలిలోకి ఎత్తి మరో నాలుగు అడుగులు ముందుకు వేశాడు షాడో.

“ఆగమని చెపుతుంటే నీకు వినబడటం లేదా? ఇంకొక్క అడుగు వేశావంటే నీ పని ఆఖరే!!” మరింత కటువుగా అంటూ రివాల్వర్‌ని అతని తలకేసి గురి పెట్టాడు వారిలో ఒకతను.

ఎత్తిన పాదాన్ని ఎత్తినట్లే క్రిందికి దించి, నేలను బలంగా అదిమాడు షాడో. చేతుల్ని గాలిలోనే వుంచి చిన్నగా నవ్వాడు.

“క్రింద ఏదో గోల జరగుతోంది. ఇతని వాలకం నాకేదో అనుమానాన్ని కలిగిస్తోంది.....” అంటూ రివాల్వర్‌ని అలాగే పట్టుకొని ఒక అడుగు ముందుకు వేశాడు ఒక ఏజెంటు.

పాంటు బెల్టు వెనుక వున్న రివాల్వర్‌ని బయటకి తీయాలని తహతహలాడి పోతుంది షాడో అంతరంగం. ఆ పని చేయొద్దని వెన్నుతట్టి హెచ్చరిస్తోంది అతని వివేకం.

బర్మాలో పర్చేజ్ చేసిన నాసిరకపు నాటు రివాల్వర్ అది, ఫిరంగి మ్రోగినట్లు మెర్గ్వాయ్ సిటీ అంతా వినిపించే మ్రోత చేస్తుంది. రివాల్వర్ మ్రోతలకు తమ వెంట వచ్చిన జనం బెదిరి దూరంగా పారిపోతే తమకు తోడు ఏది??

“ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్ యిక్కడికి?” వున్నట్లుండి ప్రశ్నించాడు ముందుకు వచ్చిన ఝరియా ఏజెంట్.

“నా పేరు చేతన్ లాల్...... ఇక్కడ చర్మంతో తయారు కాబడిన వస్తువులు దొరుకుతాయని ఎవరో చెపితే వచ్చాను” అంటూ బలంగా విసిరాడు కాలును.

అతని మాటలు అర్థంకాక అయోమయంగా చూస్తున్న ఏజెంట్ తల మీది నుంచి పోయింది షాడో పాదం నుంచి విడివడిన లెదర్ బూటు. గింగిరాలు

తిరుగుతూ వెళ్ళి వెనుకగా నిలబడిన రెండవ ఏజెంట్ ముఖం మీద పడింది దబ్ మనే శబ్దంతో.

"మైగాడ్! చచ్చాను!!" అంటూ రివాల్వర్ వదిలి, చేతులతో ముఖాన్ని కప్పుకుంటూ నేల మీద కూలిపోయాడతను.

అదిరిపడి వెనక్కి చూశాడు మొదటి ఏజెంట్.

తొడ చరిచి, నేలను తంతూ గాలిలోకి లేచాడు షాడో. రెండు అంగల్లో అతన్ని సమీపించి బలంగా తన్నాడు మెడమీద.

శరీరంలో వున్న శక్తినంతా పాదంలోకి కేంద్రీకరించుకొని కొట్టిన సైడ్ కిక్ అది. కాంక్రీట్ దిమ్మ ఏదో మెడ మీద పడినట్లు బాధతో గిలగిలలాడుతూ నేల మీదికి వాలిపోయాడు ఆ ఏజెంట్.

పాదం నేలను తాకిన మరుక్షణం, రెండవ ఏజెంట్ దగ్గిరికి పోయి పిడికిలతో తల మీద గుద్దాడు షాడో.

లేచి నిలబడటానికి ప్రయత్నించాడతను. క్రిందపడిన రివాల్వర్‌ని అందుకోవాలని శక్తివంచన లేకుండా ట్రై చేశాడు. ఆ రెండు ప్రయత్నాలు ఫలించకముందే స్పృహ తప్పి బోర్లా పడిపోయాడు.

అతని రివాల్వర్‌ని, మొదటి ఏజెంటు రివాల్వర్‌ని హాలు చివర పడేటట్లు తన్ని గది తలుపులు దగ్గిరికి గెంతాడు షాడో. కాలర్ క్రింద వున్న సూదివంటి సాధనంతో తలుపులకు బిగించి వున్న తాళాన్ని టింకరింగ్ మొదలు పెట్టాడు.

పది క్షణల్లో క్లిక్ మని శబ్దం చేస్తూ వూడిపోయింది తాళం. తలుపులు తెరిచి లోపలికి తొంగి చూసిన షాడోకి ఒక సోఫాలో కాళ్ళు చేతులు బంధించబడి అడ్డదిడ్డంగా పడి వున్న స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్ కనిపించింది.

ఆందోళన నిండిన కనులతో ద్వారం వైపే చూస్తున్నదామె. అక్కడ ప్రత్యక్షం అయిన షాడోని గుర్తించే సరికి అదో రకమైన కాంతితో ప్రకాశించాయి ఆమె కనులు.

"నాకు తెలుసు మిస్టర్ షాడో...... నన్ను వెతుక్కుంటూ నువ్వు వస్తావని నాకు తెలుసు. అందుకే ఎంత హింసించినా, ఎన్ని విధాలుగా బెదిరించినా వీళ్ళ ప్రశ్నలకు సమాధానం యివ్వకుండా ఓపికతో వెయిట్ చేస్తున్నాను!" ఆనందం నిండిన కంఠంతో అన్నాదామె.

బూటు ప్రక్కన దాచిన బర్మీస్ డాగర్‌ని బయటికి లాగి రెండే రెండు వేట్లతో ఆమె బంధనాల్ని తొలిగించేశాడు షాడో.

"కుశల ప్రశ్నలు తరువాత వేసుకుందాం బేబీ..... ముందు యిక్కడి నుంచి బయట పడకపోతే నీతోపాటు నేను కూడా ఇక్కడే వుండిపోవాల్సి వస్తుంది" అంటూ ఆమె చేయి పట్టుకొని బయటికి పరుగు తీశాడు.

బంధింపబడిన అవయవాలకు రక్తప్రసరణ సరిగ్గా లేక పోవటంతో లేచి నిలబడగానే కత్తులు పెట్టి పొడిచినంత బాధ ఆమెను ఆవరించుకుంది. పళ్ళ బిగువున ఆ బాధను భరిస్తూ షాడోని అనుసరించటానికి ప్రయత్నించింది కాని, మెట్ల దగ్గిరికి వచ్చేసరికి బాలెన్స్ నిలుపుకోలేక బోర్లా పడిపోయింది.

ఆమె చేయి పట్టుకునున్న షాడో కూడా అప్రయత్నంగా తూలి ముందుకు పడిపోయాడు.

అలా పడటమే వారిద్దరి ప్రాణాలను కాపాడింది. సరిగ్గా అప్పుడే మెట్ల మీదికి వస్తున్నారు యిద్దరు ఝరియా ఏజెంట్లు. మెట్ల పై భాగంలో ప్రత్యక్షం అయిన ఆకారాలను చూడగానే రివాల్వర్లను తీసి ట్రిగ్గర్లు నొక్కారు.

టప్ టప్ మని శబ్దం చేస్తూ వచ్చి షాడో తల మీదుగా ఒక గోడలో దిగబడ్డాయి రెండు బుల్లెట్లు.

అదిరిపడి తన రివాల్వర్‌ని బయటికి లాగాడు షాడో. బంగ్లా దద్దరిల్లిపోయేటట్లు శబ్దం చేస్తూ నిప్పుల్ని వెదజల్లింది అది.

సైలన్సర్ అమర్చిన రివాల్వర్‌తో మరోసారి గురి చూడ బోతున్న ఏజెంట్ ఒకతను బాధగా మూలిగి మెట్లమీద చతికిల పడ్డాడు.

"మోసం.... మోసం...... రౌడీ పేరుతో మన స్థావరంలోకి ప్రవేశించటానికి శత్రువులు వేసిన పథకం యిది..... చంపండి. అందరినీ చంపండి......" అని అరుస్తూ వెను తిరిగి ముందు గదిలోకి పరుగు తీశాడు రెండో ఏజెంట్.

అతని మాటలు ముగిసిన మరుక్షణం షోడాబుడ్లు ఓపెన్ అయినట్లు టప్ టప్ మని శబ్దం చేయసాగాయి సైలన్సర్స్ అమర్చివున్న అనేక రివాల్వర్లు.

అంతవరకూ రౌడీ కోసం బంగ్లాలోని గదులన్నిటినీ గాలిస్తున్న జనం గోల గోలగా అరుస్తూ తలా ఒక మూలకు పరుగులు తీయసాగారు. రివాల్వర్ బుల్లెట్లు తగిలిన పౌరులు కొందరు గావు కేకలు పెడుతూ క్రింద పడి దొర్లసాగారు.

క్రిందికి పోతే తనకు కూడా అదే గతి పడుతుందని గ్రహించి వేగంగా వెనక్కి తిరిగాడు షాడో. అవయవాలు యింకా స్వాధీనంలోకి రాక, కుంటుతున్న స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌ని అమాంతం ఎత్తి భుజం మీద వేసుకుంటూ, పై భాగంలో వెనుక వైపున వున్న పిట్టగోడ దగ్గిరికి పోయాడు.

చేయి వేస్తే జారిపోయేటంత నున్నగా వుంది గోడ..... పట్టుకోవటానికి మిట్టపల్లాలు గాని, డ్రయినే పైపులు గాని కనీసం వూచల్లేని కిటికీలు గాని ఏవీ కనిపించటం లేదు.......

"వెతకండి....... దుర్మార్గుడిని వెతికి మట్టుబెట్టండి." ఉన్నట్లుండి వినవచ్చిందొక గంభీరమైన కంఠం.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగిన షాడో కనులకు స్పష్టంగా కనిపించాడు లాజరస్.

ఝరియా సీక్రెట్ బ్రాంచిలో అసిస్టెంట్ డైరెక్టర్ అతను. షాడోకి పోటీగా కిల్లింగ్ మాస్టర్ బయోదీని తయారు చేసింది అతనే. ఎత్తులు వేయటంలోను, ఒక పద్ధతి ప్రకారం పథకాలను అమలు జరపటంలోను అతన్ని మించిన వాళ్లు ఇండియన్ సి.ఐ.బి. శత్రువుల్లో మరెవ్వరూ లేరు.

"వెతకండి..... హాలు వెనుక వున్న పిట్టగోడ దగ్గిరికి పోయి గాలించండి." మెట్ల దగ్గిరే నిలబడి ఖంగుమంటున్న కంఠంతో మరోసారి తన అనుచరుల్ని హెచ్చరించాడు లాజరస్.

ఆ పైన అక్కడ వెయిట్ చేయటం తన ఆరోగ్యానికి ఎంత మాత్రమూ సరిపడదని గ్రహించి, ఛెంగున పిట్టగోడ మీదికి ఎక్కాడు షాడో. ఎనిమిది

అడుగుల దూరంలో వుంది ఏపుగా ఎదిగిన సరుకు చెట్టు ఒకటి. చేతికి అందితే ప్రాణాలు నిలుస్తాయి. పట్టుజారి పడిపోవటం అంటూ జరిగితే, సున్నం లోకి కూడా మిగలవు ఎముకలు.

లాజరస్ చేతికి చిక్కటం కంటే అక్కడి నుంచి క్రిందికి దూకి మరణించటమే మేలని అనుకుంటూ గుండెలనిండా గాలి పీల్చుకొని క్రిందికి దూకేశాడు షాడో.

కెవ్వున అరవబోయి, అతి ప్రయత్నం మీద తనను తను కంట్రోల్ చేసుకుంది అతని భుజాల మీద వున్న ఏజెంట్. అతని మెడను గట్టిగా కౌగలించుకొని కనులు మూసుకుంది.

వికృత శబ్దం చేస్తూ విరిగి పడిపోయింది షాడో చేతులకు అందిన మొదటి కొమ్మ. వేగంగా క్రిందికి జారి పోతున్న అతని చేతులకు అందినట్లే అంది స్లిప్ అయిపోయింది మరో కొమ్మ.

“అడుగడుగో..... చెట్టు మీదికి దూకి పారిపోతున్నాడు.......” సరుకు తోపు దద్దరిల్లిపోయేటట్లు అరిచింది ఒక కంఠం.

శక్తివంతమైన టార్చిలైటు సడన్‌గా ఫోకస్ చేయబడింది అతని మీదికి. ధన్ మని గర్జించింది సైలన్సర్ లేని రివాల్వర్ ఒకటి.

ఎడమ చెవికి పావు అంగుళం దూరంలో నుంచి అవతలికి పోయిన బుల్లెట్ ని గమనించగానే కొమ్మల్ని పట్టుకునే ఆలోచనను విరమించుకున్నాడు షాడో. కండరాలను లూజ్‌గా వదిలేసి కనులు మూసుకున్నాడు.

"అయ్యబాబోయ్! మన కొంపముంచాడు.... అంత ఎత్తునుంచి క్రింద పడితే ఇంకేమైనా వుందా?" ఆందోళనతో కంపించిపోతూ అటు కేసి పరిగెత్తుకు రాబోయాడు ఆ దృశ్యాన్ని చూసిన ముఖేష్.

ధనాధన్ ధనాధన్ మని ఎడతెరిపి లేకుండా గర్జిస్తోంది మేడపైన వున్న రివాల్వర్. ముందుకు రాబోయిన ముఖేష్ చుట్టూ పడి దుమ్ము తెరలు రేపాయి రెండు బుల్లెట్లు. అప్రయత్నంగా ప్రక్కకు దూకి ఒక చెట్టు చాటుకు దొర్లాడు అతను. అలా దొర్లటమే అతని ప్రాణాలను రక్షించింది. అతను నిలబడిన ప్రదేశంలో పడి యింతెత్తున గాలిలోకి ఎగిరింది మరో బుల్లెట్.

దూసుకు వస్తున్న బుల్లెట్లను లెక్క చేయకుండా బాణంలా సరుకు చెట్టు క్రిందికి పరిగెత్తాడు వాసు. చిన్న సైజు మర్రి మొదళ్ళలా వున్న తన చేతుల్ని జాచి ఊపిరి బిగపట్టాడు.

సిమెంట్ బస్తా మాదిరిగా సూటిగా వచ్చి ఆ చేతుల్లో పడ్డాడు షాడో. పడిన మరుక్షణం కండరాలను స్టిఫ్‌గా బిగించేసి క్రిందికి దొర్లాడు. అతనితో పాటు నేల మీదికి దొర్లిన ఏజెంట్‌కి చేయి అందించి హెల్ప్ చేయబోయిన వాసు ఎడమ భుజాన్ని ముద్దు పెట్టుకుంది ఒక బుల్లెట్. కుడి కాలి మీద అరంగుళం లోతు గాటు పెట్టింది మరొకటి.

కత్తితో పొడిచినట్లు బాధపడుతూ ఎగిరి ముందుకు దూకాడు అతను. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా సరుకు చెట్ల మధ్యకు పరుగుతీశాడు.

ఏటవాలుగా గురి చూడటం చేతకాని తన అనుచరుల్ని వినకూడని పదాలతో దారుణంగా నిందిస్తూ మేడ పై భాగంలో ప్రత్యక్షం అయ్యాడు లాజరస్.

స్పెషల్ బ్రాంచి ఏజెంట్ కి చేతిని అందించి, వాసు వెనుకగా చెట్లమధ్యకు పరుగులు తీస్తున్న ఆకారాన్ని గుర్తించగానే రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయింది అతని ముఖం.

“మైగాడ్! మన మధ్యలోకి వచ్చిన షాడోని ప్రాణాలతో వదిలి పెట్టారా? ఎవరి కోసం నేను ఇంత పకడ్బందీగా సెక్యూరిటీ ఏర్పాట్లు చేశానో, ఆ సీక్రెట్ ఏజెంట్ షాడోనే గుర్తించలేక వెర్రి ముఖాలు వేస్తున్నారా? పరిగెత్తండి..... అతన్ని హతమార్చి గాని వెను తిరగకండి ......” అని గర్జిస్తూ, తన బెల్టు వెనుక వున్న రివాల్వర్‌ని బయటకి లాగి ఎయిమ్ తీసుకున్నాడు.

మెడ మీద చీమలు పాకినట్లు ఫీల్ అవుతూ భుజం మీది నుంచి వెనక్కి చూశాడు షాడో. మోకాళ్ళను స్టిఫ్‌గా వుంచి అరమూసిన కనులతో రివాల్వర్‌ని ఎయిమ్ చేస్తున్న లాజరస్ ని గమనించగానే ఎండుకు పోయింది అతని గొంతు.

“రివాల్వర్ ప్రేల్చటంతో ఆ దుర్మార్గుడిని మించిన వాళ్ళు ప్రపంచంలో మరెవ్వరూ లేరు. గెట్ డౌన్ బేబీ. గెట్ డౌన్” అని స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌ని హెచ్చరిస్తూ తల్లక్రిందులుగా పల్టీకొట్టి ఒక చెట్టు మొదట్లో పడ్డాడు షాడో.

ధన్ మని వికృత శబ్దం చేస్తూ గర్జించింది లాజరస్ రివాల్వర్. అంతవరకూ షాడో నిలబడిన ప్రదేశంలో పడి నేలలో దూరిపోయింది బుల్లెట్.

ఆఖరి క్షణంలో షాడో అవతలికి దొర్లటాన్ని గమనించి కూడా ఎక్సైట్ కాలేదు లాజరస్. కూల్‌గా రివాల్వర్ ని తిప్పి మరోసారి గురి చూశాడు.

ఎంత స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్ అయినా, సి.ఐ.బి. ఏజెంట్స్ మాదిరి ఇంటెన్సివ్ ట్రయినింగ్ పొంది వుండలేదు షాడో ప్రక్కనే వున్న యువతి. అతని

హెచ్చరికను వినగానే వేగంగా రియాక్ట్ కాలేక పోయిందామె. షాడో మాదిరిగా వున్న పళాన ప్రక్కకు దూకకుండా, ఒక చెట్టు చాటుకు పరుగు తీసింది.

ఆ కాస్త ఆలస్యాన్ని అతి చక్కగా వినియోగించుకున్నాడు మేడ మీది లాజరస్. ఊపిరి బిగపట్టి ట్రిగ్గర్‌ని నొక్కాడు.

చెవులు చిల్లులు పడేటంతటి శబ్దం మరోసారి ఆ ప్రదేశాన్ని ఆవరించుకుంది. దగ్గర్లో వున్న సరుకు చెట్టు చాటుకు పరిగెత్తుతున్న స్పెషల్ బ్రాంచి ఏజెంట్ అదిరిపడి అలాగే నిలబడిపోయింది. ఎర్రటి నిప్పుకణం తన భుజంలో నుంచి ఊపిరి తిత్తులలోక ప్రవేశిస్తున్నట్లు విపరీతమైన బాధపడుతూ , నిలుచున్న పాళాన విరుచుకు పడిపోయింది.

“వెళ్ళండి..... ఆ ఏజెంట్‌ని పట్టుకోండి..... సింహం నోట్లో తలకాయ పెట్టి వెక్కిరించాలని అనుకున్న షాడోకి బుద్ధి చెప్పండి ...... వెళ్ళండి.” ఖంగుమంటున్న కంఠంతో తన అనుచరులకు ఆజ్ఞలు యిస్తూ రివాల్వర్ ని క్రిందికి దించి, పిట్టగోడ మీదుగా షాడో దూకినట్లు సరుకు చెట్టుమీదికి దూకాడు లాజరస్. అందినట్లే అంది జారిపోతున్న కొమ్మల్ని దృఢంగా బిగించి పట్టుకొని కన్నుమూసి కన్ను తెరిచేటంతలో నేలమీద కాలు పెట్టాడు.

మాట అనగానే రియాక్ట్ కావటం చేతకాని స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌ని నిందించాలో, ఆఖరి క్షణంలో అతి నేర్పుగా తమను దెబ్బతీసిన లాజరస్ తెలివికి ఆశ్చర్యపడాలో అర్థంకాక, పడిన చోటి నుంచి లేచి, ఒక్క అంగలో స్పెషల్ బ్రాంచి ఏజెంట్‌ని సమీపించాడు షాడో.

నడుములు విరిగిన రబ్బరు బొమ్మలా వరిగిపోయి వుందామె. లాజరస్ ప్రయోగించిన బుల్లెట్ భుజపు కండరాలలో నుంచి ఊపిరితిత్తులలోకి పోయి దారుణమైన గాయాన్ని సృష్టించింది. నాసికా రంధ్రాలలో నుంచి ఎర్రటి రక్తం బొట్లు బొట్లుగా జారి ఆమె ముఖాన్ని మలిన పరుస్తోంది.

మూసుకు పోతున్న కనులను తెరిచి వుంచటానికి విశ్వ ప్రయత్నం చేస్తూ బలహీనంగా నవ్విందామె.

"ఐయామ్ వెరీ సారీ మై ఫ్రండ్! నీతో కలిసి పని చేసే అదృష్టం నాకు లేదు..... నీ హెచ్చరికను వినిపించుకోనందుకు పెనాల్టీ పే చేయటమే కాకుండా నీ ప్రాణాలకు కూడా ప్రమాదాన్ని తెచ్చిపెట్టాను.... నేను..... నేను......" అంటూ వుండగానే విపరీతమైన దగ్గు తెర ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసేసింది.

విపరీతమైన ఆందోళన మనస్సును మెలిపెడుతుండగా తల ఎత్తి ముందుకు చూశాడు షాడో. ఆలస్యం చేయటానికి వీలు లేదు. బంగ్లాలో వున్న తన అనుచరుల నందర్నీ వెంట బెట్టుకొని వచ్చేస్తున్నాడు లాజరస్.... త్వరపడకపోతే తర్వాత విచారించటానికి కూడా వ్యవధి వుండదు .

రెండో ఆలోచన లేకుండా క్రిందికి వంగి, దగ్గుతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఏజెంట్ని భుజం మీదికి ఎత్తుకున్నాడు షాడో.

"కవర్ మీ ముఖేష్...... కవర్ మీ...." అని తన వారిని హెచ్చరిస్తూ వింటి నుంచి వెలువడిన బాణంలా చెట్లతోపు చివరి భాగంలోకి పరుగు తీశాడు.

వంద అడుగుల దూరంలో వున్న చెట్ల చాటున నిలబడి అతని కోసమే ఎదురు చూస్తున్న ముఖేష్, వాసులు వెంటనే దిగారు యాక్షన్ లోకి. లాజరస్

అనుచరులకు దొరకకుండా పారిపోవాలన్న ఆలోచన మటుమాయం అయిపోయింది వారి హృదయాల్లో నుంచి.

పాంటు బెల్టు వెనుక వున్న రివాల్వర్ని తీసి పరిగెత్తుకు వస్తున్న ఝురియా బృందం మీద కాల్పులు ప్రారంభించాడు ముఖేష్. కాలి బూట్లను వూడతీసి, వాటి మడమల్లో భద్రపరిచిన మెటల్ బాల్స్ ని అందుకున్నాడు వాసు.

సి.ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్స్ డిపార్ట్మెంట్ లో తయారు గాబడిన మినీ గ్రనేడ్స్ అవి. వాటి మీద వున్న బుడిపెలను నొక్కి గాలిలోకి వదిలితే మామూలు గ్రనేడ్స్ మాదిరిగానే దారుణమైన డిస్ట్రక్షన్ని సృష్టిస్తాయి .

పారిపోతున్న షాడోని పట్టుకొని లాజరస్ మెప్పుపొందాలన్న పట్టుదలతో పరిగెత్తుకు వస్తున్న పది మంది ఏజెంట్ల మధ్య పడ్డాయి రెండు మెటల్ గోలీలు.

పడిన మరుక్షణం గుండెలు జలదరించే శబ్దంతో ప్రేలి పోయాయి. కెవ్వున అరిచారు ఏజెంట్లు ఎగిరి అవతలకు దూకటానికి ప్రయత్నించారు. వారి ప్రయత్నాలు ఫలించక ముందే ముక్కలు ముక్కలైపోయాయి వారి శరీరాలు. మెటల్ గోలీలు పడిన ప్రదేశంలో మూడు అడుగుల లోతున ప్రత్యక్షం అయ్యాయి రెండు గోతులు.

“మైగాడ్! వెనక్కి వచ్చేయండి.... చెట్లను చాటు చేసుకొని చుట్టూ కమ్ముకోండి......” ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్స్ పాస్ చేస్తూ, నడుము ఎత్తున వున్న ఒక బండరాయి చాటుకు డైవ్ చేశాడు ఆ దృశ్యాన్ని చూసిన లాజరస్.

రివాల్వర్‌ని పైకి ఎత్తి బండ దగ్గిరే నిలబడిన యింకో ఏజెంట్ ముఖానికేసి గురి పెట్టాడు ముఖేష్.

అదే సమయంలో అస్పష్టంగా అతని చెవులకు సోకింది ఒక శబ్దం. ట్రిగ్గర్ రాడ్ మీద బిగుసుకుబోతున్న అతని చూపుడు వ్రేలు ఎక్కడిదక్కడే ఆగిపోయింది.

పోలీస్ సైరన్ !

బంగ్లా దగ్గిర జరుగుతున్న గోలను గమనించి ఉరుకుల పరుగుల మీద వచ్చి పడుతున్నారు పోలీసులు..... లాజరస్ గనుక కాస్త తెలివి తేటలతో వ్యవహరిస్తే తమ పని అవుట్ అయిపోతుంది.

ఆ మాట అతని మనస్సులో మెదులుతుండగానే, బండరాయి చాటునుంచి లేచి బంగ్లా వైపు పరుగులు తీశాడు లాజరస్.

"ఆయుధాల్ని దాచేయండి...... పోలీసులతో మాట్లాడి వాళ్ళని షాడో మీదికి ఉసిగొల్పే దాకా ఎవరూ తొందర పడకండి......" అని తన అనుచరులను హెచ్చరిస్తూ బంగ్లా ముందు భాగంలోకి వెళ్ళిపోయాడు.

ఆ పైన అక్కడ ఆగలేదు ముఖేష్. వాసుకు సైగ చేసి షాడో పోయిన దిశలో పరుగులు తీశాడు.

## 11

"శహభాష్ లాజరస్! ఇంత వరకూ ఎవరూ చేయలేని పనిని చేసి నా పాదాలకు బ్రేకులు వేశావ్ కదా! హేట్సాఫ్ టూ యువర్ ఇంటలిజెన్స్" అనుకుంటూ మనసులోనే లాజరస్‌కి శాల్యూట్ చేశాడు షాడో.

పోటెత్తిన సముద్రంలా వీధుల వెంట తిరుగుతోంది జన సమూహం. లాటీ కర్రల్నీ పట్టుకొని వారి వెంట నడుస్తున్నారు పోలీసులు. ఆయుధాల్ని అతి రహస్యంగా దుస్తుల్లో దాచుకొని వారందరి వెనుకా అడుగులు వేస్తున్నారు లాజరస్ అనుచరులు.

“ఇండియా నుండి వచ్చిన హంతకుడి పనే యిది..... అనుచరులతో నా బంగ్లా మీద పడి దారుణమైన హింసాకాండను సృష్టించాడు. అతన్ని వదిలిపెడితే బర్మాదేశంలో అశాంతి చెలరేగుతుంది......... ఆరు నూరైనా సరే అతన్ని పట్టుకొని హతమార్చాల్సిందే......” అంటూ ఎదురు పడిన ప్రతి పౌరుడినీ రెచ్చగొడుతున్నాడు లాజరస్.

ఆ మాటలకు రక్తం సలసల మరుగుతుండగా కత్తులు, కటార్లు పట్టుకొని వీధుల్లో పడుతున్నారు అందరూ.

“ఏం చేద్దా గురూ? కాలి నడకను యిలా ఎంత దూరం పరుగులు తీయగలం?” ఆయాసాన్ని అణుచుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ షాడోని అడిగాడు ముఖేష్.

మరో రెండు ఫర్లాంగుల దూరం పరిగెత్తి వున్నట్లుండి ఆగిపోయాడు షాడో. పది అడుగుల దూరంలో స్పష్టంగా కనిపిస్తోంది మెర్గ్వాయ్ సిటీ లిమిట్స్ సూచించే మైలు రాయి ఒకటి. దాని అవతల రోడ్డుకు దూరంగా అగుపిస్తోంది పెద్ద చెక్కల యిల్లు. ఎత్తుగా పేర్చిన ఎండుగడ్డి కట్టలతోను, అటూ యిటూ తిరుగుతున్న పాడి పశువులతోను నిండి వుంది ఆ యింటి ముందున్న ఖాళీ స్థలం.

వెనుకనించి వినవస్తున్న అరుపులు షాడోని తొందర చేశాయి. పట్టుబడటానికి అవకాశాలు చాలా అధికంగా వుంటాయని తెలిసి కూడా పరుగులాంటి నడకతో ఆ ఇంటి ముందుకు వెళ్ళాడతను.

గంయ్ మని చెవులు దిబ్బెళ్ళు పడేలా అరుస్తూ అతని ముందు ప్రత్యక్షం అయింది పశువులకు కాపలాగా వుపయోగింపబడే జర్మన్ షిప్పర్డ్ జాతికి చెందిన కుక్క ఒకటి. కత్తుల వంటి కోరలు కనబడేలా నోరు తెరిచి అతని తొడ పట్టుకోబోయింది.

ఛెంగున ప్రక్కకు దూకి రివాల్వర్‌ని బయటికి లాగబోయాడు ముఖేష్. పది హేను పౌండ్ల ఇనుప సమ్మెటల మాదిరి కనిపించే పిడికిళ్ళను బిగించి దాని మీదికి జంప్ చేయబోయాడు వాసు.

వారిద్దరి కంటే వేగంగా కదిలింది షాడో పాదం. తొడను పట్టుకోబోతున్న జర్మన్ షెఫ్పర్డ్ కీచుగా అరిచి గాలిలోకి ఎగిరింది. గింగిరాలు తిరుగుతూ ఫుట్‌బాల్ మాదిరిగా పోయి ఇంటి ముందున్న నీళ్ళ తొట్టెలో పడింది.

ఆ సందడికి ఒక్కసారిగా తెరుచుకున్నాయి మూసి వున్న ఇంటి తలుపులు. లావుపాటి నాటు తుపాకీ నొకదాన్ని పట్టుకుని బయటికి పరిగెత్తుకు వచ్చాడు అరవై సంవత్సరాల వృద్ధుడు ఒకతను. అతన్ని అనుసరించి వచ్చింది ఇరవై సంవత్సరాల అందమైన యువతి ఒకామె.

కుక్కను తన్నటంతో ఆగలేదు షాడో. దానితో పాటు వేగంగా ముందుకు కదులుతున్నాడు. వృద్ధుడిని చూడగానే ఛెంగున ప్రక్కకు దూకి ఎగిరి తన్నాడు అతని భుజాల మీద.

బాధగా అరిచాడు వృద్ధుడు.....చేతిలోని నాటు తుపాకీని క్రిందికి వదిలేసి, నేలమీద చతికిలబడిపోయాడు.

"అర్ధరాత్రి సమయంలో వచ్చి యిలా హడావుడి చేయటానికి నేను చాలా బాధపడుతున్నాను గ్రాండ్ ఫాదర్! పరిస్థితులు మమ్మల్ని యిలా తయారు చేశాయి. మమ్మల్ని తరుముకు వస్తున్న జన సమూహం నుంచి రక్షణ కావాలి." నేల మీద పడిన వృద్ధుడి ముందు నిలబడుతూ అసలు విషయాన్ని సూటిగా చెప్పేశాడు షాడో.

దెబ్బతిన్న భుజాల్ని అరిచేత్తో రుద్దుకుంటూ అతని వంకా, ముఖేష్ వంక మార్చి మార్చి చూడసాగాడు ఆ వృద్ధుడు.

అందరి దృష్టి అతనిమీదే కేంద్రీకరింపబడి వుండటం గమనించి, నిశ్శబ్దంగా జరిగింది అతని వెనుక నిలబడిన యువతి. చటుక్కున ముందుకు వంగి క్రింద పడిన తుపాకీమీద చేతులు వేసింది.

నీటి తొట్లో పడిన జర్మన్ షెప్పర్డ్ మెడ పట్టుకొని బాతుపిల్లలా ఎత్తుకు వస్తున్న వాసు ఆమె కంటే స్పీడ్‌గా కదిలాడు. కుక్క తోకతో పాటు ఆమెను కూడా పట్టుకుని గాలిలోకి ఎత్తేశాడు.

"వదలండి.... మీరు చెప్పినట్లు చేస్తాను. నా బిడ్డని వదిలేయండి....." భయంతో వణికిపోతూ కంగారుగా అరిచాడు వృద్ధుడు. కాళ్ళ దగ్గిరే వున్న తుపాకీని విస్మరించి రెండు చేతులూ జోడించాడు.

"అలా దారికి వస్తే మేము కాదని ఎందుకు అంటాం గ్రాండ్ ఫాదర్ ! కొత్త కొత్త ఆలోచనలు నీ మనస్సులో ప్రవేశించకుండా, కొద్దిసేపు నీ కూతురు మా

దగ్గిరే వుంటుంది. పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే నీ బిడ్డ నీకు దక్కటం అసంభవం" అంటూ ఇంటి ప్రక్కనే వున్న ఒక పెద్ద గడ్డివామి మీదికి ఎగ ప్రాకాడు ముఖేష్.

ఎడమ చేతిలో వున్న కుక్కను వృద్ధుడి మీదికి విసిరి, కుడి చేతిలోని పిల్లను అమాంతం గాలిలోకి ఎత్తి గడ్డిమేటు మీదికి విసిరేశాడు వాసు. ప్రక్కకు జారి పారిపోవచ్చనే ఆలోచన ఆమెకు కలగకముందే తను కూడా గడ్డిమేటు మీదికి ఎక్కి రెండు కట్టల్ని ముఖేష్ మీదా, ఆమె మీదా కప్పాడు.

ఎడమ భుజం మీద ఏజెంట్‌ని కుడిభుజం మీదికి మార్చుకుంటూ గడ్డిమేటుకు ఆపోజిట్‌గా వున్న చిన్న స్టోరేజ్ షెల్టర్‌లో దూరాడు షాడో. గోనె సంచులతో, వ్యవసాయపు పనిముట్లతో కిక్కిరిసి వున్నదది. భుజం మీది ఏజెంట్‌ని ఒక మూల పడుకో బెట్టి రెండు గోనె సంచుల్ని మీద కప్పాడు. రివాల్వర్‌ని ఎడమ చేతితో పట్టుకొని ఒక ఇనుప డ్రమ్ము చాటున వదిగి కూర్చున్నాడు.

సరిగ్గా పది నిముషాల తరువాత అటుగా వచ్చేసింది జన సమూహం. అరుపులతో, కేకలతో, ఆ నిశబ్దం నిశీధిని అల్లకల్లోలం చేస్తూ, వృద్ధుడి ఇంటి చుట్టూ రౌండ్స్ కొట్టారు ప్రజలు. ఇంట్లోకి పోయి గదులన్నిటినీ గాలించారు.

"జాగ్రత్తగా వుండాలి గ్రాండ్ ఫాదర్.... ఏ మాత్రం ఆచూకీ తెలిసినా మాకు కబురు పంపించాలి" అంటూ వృద్ధుడిని హెచ్చరించి వెనక్కి మరలారు.

పొడుగాటి కర్రల్ని పట్టుకొని పశువుల మధ్యలో చక్కర్లు కొడుతున్నారు పది మంది లాజరస్ అనుచరులు. అటు తిరిగి ఇటు తిరిగి షాడో దాగుకొని వున్న స్టోరేజి షెల్టర్ లోకి తొంగి చూశాడు ఒకతను.

"అందులో ఏమీ లేదు సార్.... అన్నీ వ్యవసాయ పనిముట్లు...... మనిషి దాగుకునే చోటు అందులో లేదు....." ఇంటి ముందు నిలబడిన వృద్ధుడు ఖంగారును కప్పిపెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ వెంటనే అన్నాడు.

చటుక్కున తల తిప్పి అతని వంక చూశాడు ఒక అనుచరుడు. పాంటు జేబులో వున్న రివాల్వర్ ని బయటికి లాగి , వార్నింగ్ కూడా లేకుండా షెల్టర్ లోకి ప్రేల్చాడు నాలుగుసార్లు.

సైలెన్సర్ అమర్చబడి వుండటం వల్ల నిశబ్దంగానే దూసుకు వచ్చాయి బుల్లెట్లు. షెల్టర్ లోని గోడలకు తగిలి కందిరీగల్లా ఝుంకారం చేస్తూ అటూ యిటూ రిఫ్లక్ట్ అయ్యాయి.

తలను రెండు చేతులతోనూ కప్పుకుని, ఆకాశంలో వున్న దేవతలనందర్నీ వరసగా అల్ఫబెటికల్ ఆర్డర్‌లో తలుచుకున్నాడు షాడో. అప్పటికి అతని షర్టు కాలర్ మీద సన్నటి రంధ్రం ఏర్పరిచింది ఒక బుల్లెట్. స్పెషల్ బ్రాంచి ఏజెంట్ మీద కప్పిన పట్టాల్లో దూరింది మరొకటి.

"ఆర్ యూ ఆల్ రైట్ బేబీ? దెబ్బ తగల్లేదు కదా!!" అని అరుద్దామన్న కోరికను పళ్ళ బిగువున అదుముకొని శిలా విగ్రహంలా కూర్చున్న చోటే కదలకుండా వుండి పోయాడతను.

చేతిలో వున్న కర్రల్ని గాలిలో గింగిరాలు తిప్పుతూ గడ్డిమేటు ప్రక్కనుంచి రోడ్డువైపు బయలు దేరారు లాజరస్ అనుచరులు.

ఆదుర్దా నిండిన కనులతో వారి వంకే చూస్తున్న వృద్ధుడు తేలికగా నిట్టూర్చి , ఇంటి ముందున్న నీళ్ళ తొట్టి మీద కూర్చుబోయాడు.

ఉన్నట్లుండి వెనుతిరిగారు లాజరస్ అనుచరులు. రెండు అంగల్లో అతన్ని సమీపించి షర్టు పట్టుకొని తొట్టిమీద నుంచి క్రిందికి లాగారు.

"ఆల్‌రైట్ ఓల్డ్ మాన్..... ఇక నీ నాటకాలు కట్టి పెట్టి వాళ్ళు ఎక్కడ దాక్కున్నారో చెప్పటం చాలా మంచిది. ఆలస్యం చేసినా, అబద్దాలు చెప్పినా నీ నడుములు విరిగి పోతాయి......" ముఖంలో ముఖం పెడుతూ కరుకుగా అడిగాడు ఒకతను.

"తెలియదు.... నాకేమీ తెలియదు.... వదలండి...... నన్ను వదలండి......." అంటూ అతని చేతుల్ని వదిలించు కోవటానికి ప్రయత్నించాడు వృద్ధుడు.

ఫెడీమని గుద్దాడు మరో అనుచరుడు.

వృద్ధుడి పై పెదవి రెండుగా చీలింది. ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి వచ్చి అతని దుస్తుల మీదికి కారసాగింది.

"అబద్ధాలు చెప్పినందువల్ల ప్రయోజనం లేదు ఓల్డ్ మాన్...... అందరి కళ్ళు కప్పినా, నువ్వు మా కళ్ళను కప్పలేవు....... మమ్మల్ని ఏమార్చి పారిపోతున్న హంతకులు ఎక్కడికి రాకపోతే, మారి నేల మీద ఈ రక్తపు మరకలు ఎక్కడి నుంచి వచ్చాయి?" చేతిలోని టార్చిలైటును గడ్డిమేటు ప్రక్కనే నేల మీదికి ఫోకస్ చేసి చూపుతూ కరుకుగా అడిగాడు ఇంకో అనుచరుడు.

ఆయిల్ డ్రమ్ము చాటునుంచి మోకాళ్ళ మీద లేచి అటుకేసి తొంగి చూశాడు ఆ మాటల్ని వింటున్న షాడో. అక్కడ కనిపించిన దృశ్యాన్ని గమనించగానే తలను నేలకేసి బాదుకోవాలన్నంత బాధ అతన్ని ఆవరించుకుంది.

గాయపడిన ఏజెంట్‌ని భుజం మీద వేసుకొని, అక్కడే నిలబడి కబుర్లు చెప్పాడు తను...... ఆమె గాయంలో నుంచి కారిన రక్తం నేలమీద పడి తమ గుట్టును రట్టు చేసింది.

"చెప్పు ఓల్డ్ మాన్! తొందరగా చెప్పు!!" అంటూ వున్నట్లుండి వృద్ధుడిని కమ్ముకున్నారు లాజరస్ అనుచరులు.

నోరు తెరిచి బాధగా అరిచే అవకాశం కూడా అతనికి లభించలేదు. పిడికిళ్ళతో ముఖం మీద పొడిచాడు ఒకతను. చొక్కా పట్టుకొని గిర్రున తిప్పాడు మరొకతను. చేతిలోని కర్రతో భుజాలు విరిగేటట్లు కొట్టి క్రింద పడేశాడు ఇంకొకతను. బూటుకాలితో లాగిపెట్టి గుండెల మీద తన్నాడు నాలుగో వ్యక్తి.

ఆ పైన చూడలేకపోయాడు షాడో. ఆయిల్ డ్రమ్ మీది నుంచి బయటికి జంప్ చేసి బాణంలా వారి మధ్యలోకి పరిగెత్తాడు.

క్రిందపడిన వృద్ధుడిని మరోసారి తన్నటానికి కాలును వెనక్కి తీసుకుంటున్నాడు లాజరస్ అనుచరుడు.

నేలను బలంగా తన్ని గాలిలోకి ఎగిరాడు షాడో. కంటికి కనిపించని వేగంతో కదిలి ఆ వ్యక్తి మెడ మీద తగిలింది అతని కుడిపాదం.

ఫట్ మని శబ్దం చేస్తూ విరిగి పోయింది మెడ ఎముక. వెర్రిగా అరిచి నిలుచున్న వాడు నిలుచున్నట్లుగానే విరుచుకు పడిపోయాడతను.

అదిరిపడి వెనక్కి తిరిగిన మిగిలిన వారి మీదికి రాక్షసుడిలా కలబడ్డాడు షాడో.

“వయస్సు వుడిగిన వృద్ధుడిని కాదు నేను....... మీకు చేతనయితే నన్ను చంపండి...... చేతకాకపోతే వీరోచితంగా పోరాడి వీరస్వర్గానికి పొండి. మిమ్మల్ని ప్రాణాలతో వదిలి పెట్టడం మాత్రం జరగని పని........” అంటూ పిడికిలితో ఒక వ్యక్తి గుండెల మీద పొడిచి, మరో వ్యక్తి మోకాలి మీద విసురుగా తన్నాడు.

గుండెల్ని అదుముకుంటూ నేల మీద కూర్చుండి పోయాడు మొదటి వ్యక్తి. మోకాలి జాయింట్ ముక్కలు ముక్కలైపోగా గొంతు చించుకొని అరుస్తూ నేలను కౌగలించుకున్నాడు రెండో వ్యక్తి.

అప్పటికి గాని తమ ఆశ్చర్యాన్నించి తేరుకోలేక పోయారు మిగిలిన వాళ్ళు. తేరుకోగానే చేతుల్లోంచి కర్రల్ని వదిలి, దుస్తుల్లో దాచి వుంచిన ఆయుధాల్ని బయటికి లాగారు .

వాటిని ప్రయోగించే అవకాశం వారికి లభించలేదు..... గడ్డిమేటు మీది నుంచి జర్రున జారి సూటిగా వాళ్ళ మధ్య దూకారు ముఖేష్ , వాసులు.

దూకీ దూకటంతోనే యిద్దర్నీ తన చేతుల్లో యిరికించుకొని, ఎలుక పిల్లల్ని నొక్కినట్లు నొక్కి అవతలికి విసిరేశాడు వాసు. మరో వ్యక్తి చేయి పట్టుకొని బర్రున అవతలికి లాగాడు.

షాడో కేసి రివాల్వర్‌ని గురి పెట్టబోతున్న తన సహచరుడి దారికి అడ్డం పడ్డాడు ఆ వ్యక్తి. షాడో కోసం వుద్దేశింపబడిన బుల్లెట్ అతని వెన్నులో దిగబడి ప్రాణాల్ని బలి తీసుకుంది.

రెండోసారి రివాల్వర్‌ని ప్రేల్చక ముందే ఆ వ్యక్తి మెడ పట్టుకొని క్రిందికి నెట్టాడు ముఖేష్. మోకాలిని స్టిఫ్‌గా వంచి అతని గొంతు మీద అదిమాడు.

గిలగిలా కొట్టుకొని గుడ్లు తేలవేశాడా వ్యక్తి..... క్షణంలో ప్రాణాల్ని వదిలి నిశ్చలంగా వుండిపోయాడు.

ఎంత హఠాత్తుగా మొదలయిందో అంతే వేగంతో అంతం అయిపోయింది ఆ పోరాటం. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో విసిరేసిన దిష్టి బొమ్మల్లా తలా ఒకప్రక్కన పడిపోయారు మిగిలిన వ్యక్తులు.

నరనరాలకు వ్యాపించిన ఆవేశాన్ని అణుచుకోవాటనికి ప్రయత్నిస్తూ ప్రక్కకు తిరిగిన షాడో, క్రింద పడిన వృద్ధుడిని చూసి చిత్తరువులా నిలబడి పోయాడు.

ముఖేష్ వాసులతో పాటు గడ్డిమేటు మీది నుంచి దూకేసింది వృద్ధుడి కూతురు. వెక్కి వెక్కి ఏడుస్తూ వృద్ధుడి తలను వడిలో చేర్చుకొని అతన్ని లేపటానికి ప్రయత్నిస్తోంది.

అడుగులో అడుగు వేస్తూ అక్కడికి పోయి, అతని నాడిని పట్టుకున్నాడు ముఖేష్. రెండు క్షణాల తరువాత బరువుగా తల విదిలించి మెల్లిగా యివతలికి వచ్చేశాడు.

పదునైన కత్తితో ఎవరో తన గుండెల్ని చీలుస్తున్నట్లు భరించరాని బాధ షాడోని ఆవరించుకుంది.

ప్రాణాలు కాపాడుకోవటానికి వృద్ధుడిని బెదిరించి అక్కడ రక్షణ పొందారు తాము. అన్నమాట నిలబెట్టుకున్నాడతను....... అందుకోసం ప్రాణాలు పోగొట్టుకున్నాడు......

"నో....... అలా జరగటానికి వీలు లేదు....... అతను మరణించటానికి వీలు లేదు..... బ్రతకాలి ..... అతను బ్రతికి తీరాలి......." ఏం మాట్లాడుతున్నాడో తనుకు తెలియని పరిస్థితిలో పిచ్చిగా అంటూ వృద్ధుడి దగ్గిరికి దూకాడు షాడో.

"రాజూ....రాజూ......" అంటూ అందోళనగా అతని చేయి పట్టుకొని ఆపటానికి ప్రయత్నించాడు ముఖేష్.

అతని చేతుల్ని విదిలించి కొట్టాడు షాడో. తండ్రి తలను వడిలో పెట్టుకొని బావురుమంటున్న యువతిని కూడా అవతలికి నెట్టేసి, వృద్ధుడి గుండెలమీద చెవి ఆనించి విన్నాడు.

లాజరస్ అనుచరులు గుండెల మీద కొట్టిన దెబ్బకు హఠాత్తుగా ఆగిపోయింది అతని గుండె..... అతి వేగంగా చల్లబడిపోతోంది అతని శరీరం........

కుడి మోకాలిని నేలకేసి అదిమి, ఎడమ చేతిని కత్తిలా గాలిలోకి ఎత్తాడు షాడో. గుండెల నిండా వూపిరి పీల్చుకుని నోరు తెరిచాడు.

అతని నాభి కమలం దగ్గర్నించి బయలు దేరి, కడుపు నరాల్ని బిగతీస్తూ, శరీరంలోని జీవాణువులు శక్తినంతా తనలో కలుపుకుంటూ, కంఠనాళాలను కంపింప చేస్తూ వెలువడింది మహోగ్రమయిన కుంగ్ ఫూ సింహనాదం.

ఫిరంగి మ్రోత వినవచ్చినట్లు దద్దరిల్లిపోయాయి ఆ చుట్టుపట్ల వున్న కట్టడాలు. అదిరిపోయి వెనక్కి దూకారు ముఖేష్, వాసులు. కట్టు తాళ్ళు తెంపుకున్నాయి కొన్ని పశువులు. ఫ్రీగా వున్న జీవాలన్నీ బెదిరి దూరంగా పారిపోయాయి.

కత్తితో కోసినట్లు ఎర్రగా రక్తం షాడో పెదవుల చివర్ల నుంచి గడ్డం మీదికి జారింది. శరీరంలో వున్న శక్తి అంతా హరించుకుపోయినట్లు ఎలా వున్నవాడు అలాగే వెనక్కి వాలిపోయాడతను.

"వాట్ హేపెన్డ్ రాజూ? వాట్ హేపెన్డ్!!" విపరీతమైన భయంతో కంపించిపోతూ షాడో దగ్గిరికి దూకాడు ముఖేష్.

అదే సమయంలో అక్కడ కనిపించిన దృశ్యం అతన్ని నిశ్చేష్టుడిని చేసేసింది. శరీరంలోని జీవశక్తినంతా వినియోగించి షాడో చేసిన సింహనాదం దెబ్బకు కరెంట్ షాక్ కొట్టినట్లు కంపించింది నిర్జీవం అవుతున్న వృద్ధుడి శరీరం. ఆగిపోయిన అతని గుండె ఆ అదటుకు ఒక్కసారిగా నిద్రలేచింది. గుండె పనిచేయటం ప్రారంభించిన మరుక్షణం, బాధగా నిట్టూరుస్తూ లేచి కూర్చున్నాడు వృద్ధుడు.

"నో నేను కల కంటున్నాను.... ఆగిపోయిన గుండెను మందూ మాకులతో పని చేయించటం సాధ్యపడుతుందని విన్నాను గాని, అరిచి కేకలు పెట్టి నిద్ర లేపటం ఎక్కడా చూడలేదు......" తల విదిలిస్తూ కామెంట్ చేశాడు వాసు.

"నీ నమ్మకాలతో ఇక్కడ ఎవరికీ పని లేదు..... రాజు అరిచిన అరుపు ఇంకెవరికయినా వినబడి వుంటే మన కథ మళ్ళీ మొదటికి వస్తుంది......" అంటూ క్రింద పడిపోయిన షాడోకి చేయి అందించి నెమ్మదిగా లేపి నిలపెట్టాడు ముఖేష్.

కన్నీటిని తుడుచుకొని వృద్ధుడి కౌగిల్లో వదిగిపోతున్న యువతిని చూసి తేలికగా నిట్టూర్చాడు షాడో.

తన కర్తవ్యం ముగిసింది. తను చేసిన పొరపాటుకు ఒక అమాయకుడు పెనాల్టీ పే చేయకుండా అడ్డు పడగలిగాడు. మరో ప్రమాదం ఆ తండ్రీ కూతుళ్ళను చుట్టు ముట్టకముందే అక్కడి నుండి తప్పుకోవటం చాలా మంచిది.

ఆ మాట అనుకుంటుండగా సడన్‌గా గుర్తుకు వచ్చిందతనికి స్టోరేజి షెల్టర్ లోనే వుండిపోయిన స్పెషల్ బ్రాంచి ఏజెంట్.

"మైగాడ్! అసలు విషయాన్ని మరిచిపోయి అనవసరమైన కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాం...... కమాన్ ముఖేష్! కమ్ విత్ మీ!!" అని ముఖేష్‌ని పిలుస్తూ స్టోరేజ్ షెల్టర్ లోకి పరుగు తీశాడు.

అతను పడుకోబెట్టిన ప్రదేశంలోనే వుందామె. ఒక్క అంగుళం కూడా అవతలికి జరగలేదు.

"హల్లో బేబీ...... హౌ ఆర్ యూ??" అని అడుగుతూ ఆమె మీద కప్పిన గోనె సంచుల్ని తొలగించి కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడ్డాడు షాడో.

బాధలకు బరువులకు అతీతమైన లోకంలోకి వెళ్ళి పోయి వుందామె. లాజరస్ అనుచరుడు ప్రయోగించిన బుల్లెట్ గోడ మీది నుంచి రిఫ్లక్ట్ అయి ఆమె గుండెల్లో దూరింది. నోరు తెరిచి అరిచే వ్యవధి కూడా ఇవ్వకుండా ప్రాణాలను బలి పుచ్చుకుంది.

ఏం చేయాలో, ఆ డెవలప్‌మెంట్‌ని ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియక అలాగే విగ్రహంలా నిలబడి పోయిన షాడోని, ప్రక్కకు నెట్టి ముందుకు వంగాడు ముఖేష్.

అరమూసిన కనులతో, బాధను సూచిస్తున్న ఫీలింగ్స్‌తో పడి వుంది స్పెషల్ బ్రాంచి ఏజెంట్. ఆమె కుడి చేయి మాత్రం తొడమీద వున్న ఒక తెల్లటి బాండేజిని నొక్కి పట్టుకొని వుంది.

“పాపం! ఆఖరి క్షణంలో విపరీతమైన బాధకు గురి అయి వుంటుంది. అందుకే ఆ గాయాన్ని అలా నొక్కి పట్టుకుంది......” అన్నాడు అప్పుడే లోపలికి వచ్చి ఆ దృశ్యాన్ని చూసిన వాసు.

అతని మాటలతో ఏకీభవిస్తున్నట్లు తల వూపబోయి ఆఖరి క్షణంలో తల అడ్డం తిప్పాడు ముఖేష్.

తొడమీది గాయంకంటే వెయ్యి రెట్లు ప్రమాదకరమైన దెబ్బలు తన ఒంటి మీద వుండగా, ఆ గాయాన్నే ఆమె ఎందుకు నొక్కి పట్టింది ?

పాంటు జేబులో వున్న పెన్ నైఫ్‌ని తీసి తొడకు కట్టి వున్న బాండేజిని నేర్పుగా తొలగించాడు ముఖేష్. బాండేజి క్రింద ఎర్రగా అరంగుళం పొడవున్న కత్తి గాటును చూడగానే అప్రయత్నంగా వెలువడింది అతని పెదవుల వెంట చిన్న విజిల్.

“మొత్తానికి స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ననిపించుకుంది గురూ...... ఇటువంటి ఎమర్జెన్సీ ఎదురు పడుతుందని ముందు గానే వూహించినట్లు మనకు కావాల్సిన ఇన్ఫర్మేషన్ ఎవరూ చూడని విధంగా తొడలో దాచింది.” అంటూ పెన్ నైఫ్ మొనతో చిన్న కాగితపు వుండను బయటికి లాగాడు కత్తి గాటులో నుంచి.

ఎటువంటి వాతావరణ పరిస్థితులనయినా తట్టుకోగల పలుచని సిలోఫిన్ పేపర్ మీద అతి చిన్న అక్షరాలతో వ్రాయబడి వుంది ఒక మెస్సేజి.

ప్రపంచాన్నంతా జయించి ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించాలని అమానుషమయిన అటమిక్ పరిశోధనలు చేస్తున్న ప్రొఫెసర్ విల్స్‌బరీ పేరు అందరికీ తెలుసు. అతి రాక్షస పథకాలను గురించి తెలుసుకున్న బర్మా ప్రభుత్వం అతన్ని దేశం నుంచి బహిష్కరించింది. అయినా సరే తన పట్టుదల వదలకుండా జావా, బోర్నియో, సుమత్రా దీవుల్లోని క్రిమినల్స్ గాంగ్‌లతో చేయి కలిపాడు విల్స్‌బరీ. సారికన్ ఐలాండ్‌లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆటమిక్ డిటనేటర్‌ని తీసుకు వస్తున్న మన డిస్ట్రాయర్ నౌకను బలవంతంగా సారికన్ ఐలండ్ వైపు మరలింప బడటం కొందరు బర్మా స్మగ్లర్లు చూశారు. అయితే ప్రొఫెసర్ విల్స్‌బరీకి భయపడి ఆ విషయాన్ని తమలోనే దాచుకున్నారు వాళ్ళు విల్స్ బరీ."

వాసు వెలిగించిన అగ్గిపుల్లల వెలుగులో ఆ మెస్సేజిని పూర్తిగా చదివి ప్రశ్నార్ధకంగా షాడో వైపు చూశాడు ముఖేష్.

విపరీతమైన ఆలోచనలతో కందిరీగల తుట్టెలా తయారైంది షాడో మనస్సు. స్పెషల్ బ్రాంచి ఏజెంట్ తెల్సుకున్న ప్రతి విషయం అతని ధైర్యాన్ని శరవేగంగా దిగజార్చేస్తున్నాయి.

తన దారికి అడ్డు వచ్చిన వారిని నిర్ధాక్షిణ్యంగా నాశనం చేసే నరరూప రాక్షసుడు ఆ ప్రొఫెసర్ విల్స్‌బరీ! తన పథకాలకు ఎవరూ అంతరాయం కలిగించకుండా అమోఘమయిన ప్రదేశంలో స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాడతను.

అగ్ని పర్వతాలతో, అత్యంత భయంకరమయిన అరణ్యాలతో, అంతవరకూ మానవులు ఎవరూ చూడని క్రూరమృగాలతో, అడుగు పెట్టడానికి వీలుకానంత దుర్భేధ్యంగా వుంటుంది సారికన్ ఐలాండ్.

అటువంటి ప్రదేశంలోకి వెళ్ళడం ఎలా? అతను అపహరించిన అటమిక్ డిటనేటర్‌ని తిప్పి తీసుకురావటం ఎలా ?

చేతిలోని కాయితాన్ని చించి ముక్కలు చేస్తూ, మెల్లిగా షెల్టర్ లోంచి బయటికి వచ్చేశాడు ముఖేష్. షాడో మనస్సులోని ఆలోచనలు అతనికి అర్థం అయినాయి. అందుకని అతన్ని డిస్టర్బ్ చేయకుండా షెల్టర్ ప్రక్కనే వున్న గడ్డి మేటు దగ్గిర నిలబడ్డాడు.

ఈ లోపల వూరికే నిలబడలేదు కాప్టన్ వాసు. వృద్ధుడి ఇంటి చుట్టూ తిరిగి ఒక ఎడ్ల బండిని సంపాదించుకు వచ్చాడు. షాడో అరిచిన అరుపుకు బెదిరి దూరంగా పారిపోయిన ఎడ్లను తోలుకు వచ్చి బండికి కట్టాడు. అతి తెలివి ప్రదర్శించి ప్రాణాలు కోల్పోయిన లాజరస్ అనుచరుల్ని, షెల్టర్ లో వున్న స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ని బండిలోకి ఎక్కించి ప్రశ్నార్థకంగా ముఖేష్ వైపు చూశాడు.

“ఊరికే నిలబడి మెదడు చింపుకున్నందువల్ల ప్రయోజనం ఏముంది గురూ? ముందు యిక్కడి నుంచి అర్జంటుగా బయటపడకపోతే ఏదో ఒక సమస్య మనల్ని వెతుక్కుంటూ వచ్చేస్తుంది.” మృదు స్వరంతో ముఖేష్ హెచ్చరించే సరికి షెల్టర్‌లో నుంచి బయటికి వచ్చి, బండి ఎక్కాడు షాడో.

పాంటు జేబులో వున్న వాలెట్‌ని తీసి, చిన్న నోట్ల కట్టను వృద్ధుడి గుమ్మం ముందు వుంచాడు ముఖేష్.

"థేంక్యూ వెరీమచ్ గ్రాండ్ ఫాదర్..... నీకు కలిగించిన కష్టానికి విలువ కట్టడం కాదు యిది..... మా మూలకంగా నీకు ఏదైనా నష్టం సంభవించి వుంటే కాంపన్‌సేట్ చేయటానికి!" అంటూ లోపల వున్న వృద్ధుడు బయటికి వచ్చేలోగా పరిగెత్తుకు వచ్చి బండి ఎక్కాడు.

వెంటనే ఎడ్లను అదిలించాడు వాసు. పరుగులాంటి నడకతో వాటిని రోడ్డు ఎక్కించి, అక్కడికి నాలుగు మైళ్ళ దూరంలో వున్న చిన్న కొండ వాగు ముందు ఆపాడు.

సిగరెట్ వెలిగించుకుంటూ బండి దిగి, వాగు వడ్డున వున్న ఒక చెట్టు క్రింద నిలబడ్డాడు షాడో. బండిలో వున్న శరీరాలన్నిటినీ వాగులోకి దొర్లిస్తున్నారు వాసు, ముఖేష్. స్పెషల్ బ్రాంచి ఏజెంట్ శరీరాన్ని మాత్రం వాగు వడ్డునే వున్న యిసుకలో పడుకోబెట్టి చుట్టు పట్ల వున్న కొండ రాళ్ళను సమాధిలాగా మీద పేర్చాడు.

సిగరెట్ పొగను గుండెల నిండా పీల్చుకుంటూ వారి చేతల్ని చూస్తున్నాడన్న మాటే గాని, ఒకే ఒక ప్రశ్న షాడో మనస్సును కుమ్మరి పురుగులా తొలిచేస్తున్నది.

ప్రపంచాన్నంతా వశపరుచుకోవటానికి దారుణమైన పరిశోధనలు చేస్తున్నాడు విల్స్‌బరీ. అంతవరకూ బాగానే వుంది. అందుకు అన్ని దేశాలను ఒకే దెబ్బకు నాశనం చేయగల ఆయుధాలు వుండాలి.

మామూలు ఆటంబాంబు కంటె కొన్ని రెట్లు మాత్రమే ఎక్కువ శక్తి కలిగిన ఆటమిక్ డిటనేటర్ అతనికి ఏ విధంగా పనికి వస్తుంది? ఒకే ఒకసారి

ప్రయోగించటానికి తప్ప మరెందుకు పనికి రాని ఆ సైంటిఫిక్ ఎక్విప్‌మెంట్‌తో అతనికి పనేముంది ??

తూర్పు దిక్కు తెల్లబడ వచ్చినా తన ప్రశ్నకు సమాధానం లభించక పోవటంతో అతి ప్రయత్నం మీద దాన్ని మనసులో నుంచి అవతలికి నెట్టేశాడు షాడో.

కొండవాగు దగ్గిర తమ పని ముగించుకొని చేతులు దులుపుకుంటూ బండి వెనుక అడుగులు వేయబోయిన షాడో కర్ణేంద్రియాలకు సోకింది అస్పష్టమైన అడుగుల శబ్దం.

బెల్టు వెనుక వున్న రివాల్వర్ మీద చేయి వేస్తూ గిరుక్కున వెను తిరిగి, అప్రయత్నంగా నవ్వేసాడతను.

రోడ్డు ప్రక్కనే వున్న పొదల్లో నుంచి పడుతూ లేస్తూ పరిగెత్తుకు వస్తున్నాడు శ్రీకర్.

"నడిచి నడిచి కాళ్ళు అరిగి పోయిన అర్భక జీవిని బాబూ..... నన్ను కూడా బండి ఎక్కించుకుంటే చచ్చి మీ కడుపున పుడతాను. అంత వరకూ మీరు ఆగలేకపోతే, మీ ఫోటోలు నా గదిలో పెట్టుకొని క్రమం తప్పకుండా పూజలు చేస్తాను." అంటూ, ఎవరి సమాధానం కోసమో ఎదురు చూడకుండా బండి మీదికి ఎగబ్రాకాడు.

కోపంగా ముఖం పెట్టి అతని నెత్తిమీద రెండు మొట్టి కాయలు వేశాడు ముఖేష్.

“ఏమయిపోయావో అర్థంకాక యిందాకటి నుంచీ తలలు పగల గొట్టుకుంటున్నాం. కష్టమయిన పనులన్నీ మాకు వదిలేసి నువ్వు రోడ్లు పట్టుకు తిరుగుతున్నావా?” అన్నాడు సీరియస్‌గా.

“చిన్న పిల్లవాడిననే ఆలోచన లేకుండా, చీకటిలో తిరగటం అంటే నాకు చచ్చేటంత భయమని తెలిసి కూడా వంటరిగా వదిలేసి, మీ దారి మీరు చూసుకుంటారా? జరిగినవన్నీ ఇంటికి పోయిన తర్వాత బాస్‌కి చెప్పకపోతే అప్పుడు అడగండి..... మీ అంతు చూడకపోతే మారు పేరు పెట్టండి........” మరింత సీరియస్‌గా సమాధానం యిచ్చాడు శ్రీకర్.

వారి పోట్లాటలో తల దూర్చకుండా ముందుగానే జాగ్రత్త పడ్డాడు వాసు. ముందుకు కదలమని మొరాయిస్తున్న ఎడ్లను అతి ప్రయత్నం మీద పరుగులు తీయిస్తూ, ఎనిమిది గంటల సమయానికి ట్రిపోలీ తీసుకు పోయాడు వారందర్నీ.

సిటీలోకి ఎంటర్ కాగానే మెయిన్ రోడ్డును ఆనుకొని వున్న ఒక సందు ముందు బండిని ఆపించాడు షాడో. కాలినడకన సందు చివరికి పోయి ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్స్ ముందు ఆగాడు.

“రండి సార్ రండి..... మీరు ఏది కావాలంటే అది దొరుకుతుంది ఇక్కడ........ లోపలికి వచ్చి ఏం కావాలో వెంటనే అడిగేయండి...... ” రాగయుక్తంగా ఆహ్వానించాడు అతన్ని స్టోర్స్‌లో పని చేస్తున్న మధ్య వయస్కుడు ఒకతను.

"మూడు రంగుల మట్టి పాత్ర కావాలి నాకు...... దాని నిండా కల్తీలేని కాపుసారా వుండాలి......." అతనికి మాత్రమే వినబడేటట్లు లోగొంతుకతో అన్నాడు షాడో.

ఉలికి పాటును నేర్పుగా కప్పి పెట్టుకొని గబగబా స్టోర్స్ వెనుక భాగంలోకి పరుగు తీశాడు ఆ వ్యక్తి. ఒక నిముషం తరువాత పెద్ద స్వీట్స్ పాకెట్‌ని పట్టుకొచ్చి షాడో మీదికి విసిరేశాడు.

మారు మాట్లాడకుండా దాన్ని అందుకొని, వాలెట్‌లో నుంచి ఒక కరెన్సీ నోటును తీసి అతనికి యిచ్చాడు షాడో.

"ఎక్కడా దొరకని అపురూపమైన స్వీట్స్ అవి....... ఏమరిపాటుగా వున్నారంటే ఎవరో ఒకరు ఎగరేసుకు పోతారు....... జాగ్రత్తగా తీసుకు పొండి". ఆ నోటును గల్లా పెట్టెలో పడేసుకుంటూ హెచ్చరించాడు మధ్య వయస్కుడు.

స్వీట్స్ ఖరీదు పోను, మిగిలిన చిల్లర ఇస్తాడేమోనని ఎదురు చూశాడు షాడో. ఆ విషయమే మర్చిపోయినట్లు తల ప్రక్కకు తిప్పుకుంటున్న అతడి తెలివికి నవ్వుకుంట వెను తిరిగి సందు మొగదలకు వచ్చేశాడు.

ఎడ్లబండి దగ్గిరే బుద్ధిగా నిలబడి, అటుగా వచ్చిన ఒక ట్రాఫిక్ పోలీసుతో తీవ్రంగా వాద ప్రతివాదాలు చేస్తున్నారు అతని స్నేహితులు. అతన్ని చూడగానే ఒక నోటును తీసి పోలీసు చేతిలో పెట్టాడు.

"ఈ పని ఇందాకే చేసి వుంటే ఇంత గొడవ జరిగేది కాదు గదా! మీ పల్లెటూరి వాళ్ళకు బుద్ధ తిన్నగా పని చేయదు." అంటూ తాపీగా అవతలికి వెళ్ళిపోయాడు ఆ కానిస్టేబిల్.

స్వీట్ పాకెట్ మూడతీసి లోపల వున్న చిన్న చీటీని బయటికి లాగాడు షాడో.

"మధ్యాహ్నం పన్నెండు గంటలకు మార్బుల్ స్ట్రీట్‌లో వున్న మార్షల్ రెస్టారెంట్‌కి వస్తాను....... అన్యథా భావించకుండా నా కోసం వెయిట్ చేయండి......." నీలం రంగు పెన్సిల్‌తో హడావుడిగా వ్రాయబడి వుందొక మెస్సేజి ఆ కాయితం మీద.

ఆ చీటి వ్రాసింది ఎవరో తెలుసుకోవాలన్న కోరికతో తపించిపోతున్న శ్రీకర్‌ని చూసి తనలో తాను నవ్వుకుంటూ సిటీ మధ్య భాగంలోకి దారి తీశాడు షాడో.

బర్మాదేశంలో వున్న పట్టణంలోను అతి రహస్యంగా తమ స్మగ్లింగ్ కార్యకలాపాలను కొనసాగిస్తూ వుంటారు గంగారాం అనుచరులు అనేక మంది.

ట్రిపోలి సిటీ చుట్టుపట్ల జరిగే వ్యాపారాలన్నీ డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో వున్న మధ్య వయస్కుడి సూపర్‌విజన్ లోనే జరుగుతాయి.

సిటీ మధ్య భాగంలో కనిపించిన ఒక రెస్టారెంట్‌లో బ్రేక్‌ఫాస్ట్ ముగించుకొని తీరికగా అడుగులు వేస్తూ, పన్నెండు గంటల వేళకు మార్షల్ రెస్టారెంట్ ని చేరుకున్నాడు షాడో.

పది నిముషాల తరువాత పరగు పరుగున అక్కడికి వచ్చి అతనికి శాల్యూట్ చేశాడు గంగారాం అసిస్టెంట్.

"నా పేరు తల్వార్...... నా తమ్ముడి పేరు బందూక్. వాడిని పోలీసులు పట్టుకొని పన్నెండు సంవత్సరాలు శిక్ష వేయించారు. వాడే గనుక వున్నట్లయితే

నేను ఇందాకే మీతో వచ్చి వుండేవాడిని...... ఇప్పుడు చెప్పండి..... ఏం కావాలి మీకు? నా వల్ల వెంటనే జరగవలసిన పని ఏమిటి?" ఫుల్ స్టాఫ్ కామాలు లేకుండా ఏకబిగిన ఏకరువు పెట్టి రెండు గ్లాసుల మంచినీళ్ళు త్రాగాడు.

"నాకు అర్జంటుగా ఒక హెలీకాప్టర్ కావాలి...... నేను నా స్నేహితులు వెంటనే సారికన్ ఐలాండ్ వెళ్ళాలి." సిగరెట్ పొగల్ని రింగులు రింగులుగా గాలిలోకి వదులుతూ కామ్‌గా ఎనౌన్స్ చేశాడు షాడో.

చేతిలో వున్న మంచినీళ్ళ గ్లాసును క్రింద పడేసినంత పని చేశారు తల్వార్. పొలమారినట్లు అరిచేత్తో నెత్తి మీద చరుచుకున్నాడు రెండుసార్లు.

"నేను పొరపాటుగా వింటున్నాను...... ముసలి తనం వచ్చేస్తూ వుండటం వల్ల నా చెవులు సరిగా పని చేయటం లేదు" అన్నాడు షాడో ముఖంలోకి చూస్తూ.

"నథింగ్ డూయింగ్ బ్రదర్..... నువ్వు సరిగ్గానే విన్నావు మేము సారికన్ ఐలాండ్‌కి వెళ్ళి తీరాల్సిందే." కామ్‌గా మరోసారి తన నిర్ణయాన్ని వెల్లడించాడు షాడో.

రెండు నిముషాల పాటు సీరియస్‌గా ఆలోచించి లేచి నిలబడ్డాడు తల్వార్. "చూస్తూ చూస్తూ ఆత్మహత్య చేసుకుంటామని మీరు అంటుంటే నేను కాదని ఎలా అనగలను? నాకు తెలిసిన లఫూట్ ఒకడు వున్నాడు. వాడి దగ్గిరికి పోదాం పదండి" అంటూ పరుగులాంటి నడకతో రోడ్డు మీదికి పోయి, ఒక టాక్సీ పిలిచాడు.

మంచినీళ్ళు తప్ప మరేదీ తీసుకోనందుకు గుర్రుగా చూస్తున్న వెయిటర్ చేతిలో ఒక కరెన్సీ నోటును పెట్టి తల్వార్‌ని అనుసరించాడు షాడో.

# 12

"అయ్యబాబోయ్! మీకు హెలీకాప్టర్ కావాలా? బర్మాదేశంలో హెలీకాప్టర్‌ని సంపాదించాలంటే ఎంత కష్టమో ఎప్పుడన్నా ఆలోచించారా?" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు ఆ వ్యక్తి.

కనుబొమ్మలు ముడివేసి తీవ్రంగా అతని ముఖంలోకి చూశాడు తల్వార్.

"నీ చచ్చు సలహాలు యిక్కడ ఎవరికి అవసరం లేదు. నోరు మూసుకొని పని జరిగే మార్గం చూడు..... నోరు తెరిచి ఇంకొక్క మాట అన్నావంటే ముక్కు ముగం ఏకం అయిపోతాయి " అన్నాడు పిడికిలి పైకి ఎత్తుతూ.

గబగబా వెనక్కి జరిగి, తల బరుక్కుంటూ రెండు నిముషాల పాటు తీవ్రంగా ఆలోచించాడతను. వున్నట్లుండి విప్పారింది అతని ముఖం.

"మీ పని పూర్తి కావటానికి చాలా ఖర్చు అవుతుంది. అందుకు సిద్ధపడితే నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు చిటికెలు వేస్తూ.

వాలెట్‌ని తీయబోతున్న షాడోని వెనక్కి నెట్టి తన పాంటు జేబులో నుంచి పెద్ద నోట్ల కట్టను బయటికి తీశాడు తల్వార్.

పెట్రోమాక్స్ లైటులా వికసించిన ముఖంతో ఆ డబ్బును అందుకున్నాడు ఆ వ్యక్తి.

"సాయంత్రం చీకటి పడే సమయంలో ప్రెసిడెన్షియల్ గ్రౌండ్స్ దగ్గిరికి రండి. అన్ని ఏర్పాట్లు చేసి వుంచుతాను" అని చెప్పి శరవేగంతో వెళ్ళిపోయాడు అక్కడి నుంచి.

సాయంత్రం దాకా ట్రిపోలీ వీధుల్ని సర్వే చేశాడు షాడో. ఒక షాపులో తన బర్మా రివాల్వర్‌ని, డాగర్‌ని వదిలేసి కాస్త ముక్కు ముఖం తిన్నగా వున్న ఆయుధాల్ని పర్చేజ్ చేశాడు. వాటి పనితనాన్ని జాగ్రత్తగా పరీక్షించుకొని ప్రెసిడెన్షియల్ గ్రౌండ్స్ దగ్గిరికి వెళ్ళే సరికి చీకట్లు సిటీని చుట్టుముట్టాయి.

ప్రెసిడెన్షియల్ గ్రౌండ్ ముందు ఒక చెట్టు క్రింద నిలబడి వున్నాడు ఆ వ్యక్తి.

"అందరూ వచ్చేశారా? అదిగో..... ఆ హెలికాప్టర్ మీకు సరిపోతుందా??" అంటూ గ్రౌండ్ మధ్యలో నిలబడి వున్న పెద్ద హెలికాప్టర్‌ని చూపించాడు.

అటు చూసిన షాడో కనులకు కొట్టవచ్చినట్లు కనిపించింది ఆ హెలీకాప్టర్ అడుగు భాగంలో ముద్రింపబడి వున్న బర్మా మిలటరీ గుర్తు.

ఆధునికమైన రైఫిల్స్ పట్టుకొని వంద గజాల దూరంలో వున్న ఒక షెడ్ దగ్గిర నిలబడి వున్నారు. నలుగురు మిలటరీ గార్డులు.... వాళ్ళు చూస్తుండగా హెలీకాప్టర్ జోలికి పోయిన వాళ్ళు ప్రాణాలతో వెనక్కిరారు.

"అరే లఫూట్! నీ తెలివి తేటల్ని నా దగ్గిరే ప్రదర్శిస్తున్నావా? ఆ బండి నీ బాబుగాడిదా? సైనికుల చేతుల్లో చంపించటానికా మమ్మల్ని యిక్కడికి తీసుకువచ్చింది?" కోపంతో ముఖం ఎర్రగా కందిపోతుండగా పిడికిళ్ళు బిగించి అతని మీదికి పోయాడు తల్వార్.

ఖంగారుగా వెనక్కి దూకి వాసు వెనుక దాక్కున్నాడు ఆ వ్యక్తి.

"చెప్పే మాటలు పూర్తిగా వినకుండా వూరికే హైరాన పడిపోతే ఎలా తల్వార్? కాస్త శాంతంగా వింటావా??" అంటూ పాంటు జేబులో నుంచి చిన్న కటింగ్ ప్లేయర్‌ని తీసి చెట్టు ప్రక్కనే వున్న టెలిగ్రాఫ్ పోల్ మీదికి ఎక్కాడు. పోల్

మీది వైర్లను రెండు నిముషాల పాటు జాగ్రత్తగా పరిశీలించి చూసి, వాటిలో రెండింటిని కట్ చేసి జర్రున క్రిందికి జారాడు.

"బయటి ప్రపంచంతో ఆ సైనికుల కున్న సంబంధాలు కత్తిరించాను. మీరు యిచ్చిన డబ్బు యిక్కడితో సరిపోయింది మిగిలిన ఎమౌంట్ ఇచ్చేస్తే మిగిలిన పని కూడా పూర్తి చేస్తాను." అంటూ కటింగ్ ప్లేయర్‌ని అవతలికి విసిరేసి చేయి జాచాడు.

"అన్యాయం..... ఇది అక్రమం..... ఎంత కావాలో ముందుగా చెప్పకుండా వాయిదాల పద్ధతిలో యిలా అడగటం బందిపోటు దొంగతనం అనిపించుకుంటుంది." పళ్ళు కొరుకుతూ మరోసారి ప్లేరప్ అయ్యాడు తల్వార్.

నిర్లిప్తంగా భుజాలు ఎగుర వేసి, తల విదిలించాడు ఆ వ్యక్తి.

"హెలీకాప్టర్ కావాలంటే డబ్బు యివ్వండి. అక్కర లేదనుకుంటే గోల చేయకుండా వెళ్ళిపోండి. గట్టిగా అరిస్తే సైనికులకు వినబడుతుంది. వాళ్ళు ఇక్కడికి వస్తే మీ బండారం బయట పడుతుంది." తను కత్తిరించిన టెలీగ్రాఫ్ తీగెల వంక చూపిస్తూ చల్లగా వివరించాడు.

పళ్ళు బిగించి నేలను టపటపా రెండుసార్లు తన్ని తన కోపాన్ని తనలోనే అదుముకున్నాడు తల్వార్. క్రూరంగా చూస్తూ పాంటు జేబులో నుంచి మరో నోట్ల కట్టను తీసి అతనికి అందించాడు.

"అరిచి కేకలు పెడ్తాడన్న మాటేగాని బంగారం లాంటి మనిషి మా తల్వార్........ అతనితో స్నేహం చేయటం నిజంగా మీ అదృష్టం" అంటూ

వాసుకు తన అభిప్రాయాన్ని వెల్లడించి, క్రింద వున్న రెండు గులకరాళ్ళను అందుకొని సైనికులు నిలబడి వున్న షెడ్ సమీపంలోకి పోయాడు.

"ఎవరది? ఎవరు నువ్వు?" రైఫిల్‌ని రెడీగా పట్టుకుంటూ వెంటనే అతని వైపు తిరిగాడు ఒక సైనికుడు.

గురి చూసి విసిరాడు ఆ వ్యక్తి.

గింగిరాలు తిరుగుతూ పోయి ఆ సైనికుడి ముఖం మీద తగిలింది మొదటి గులకరాయి.

బాధగా అరిచాడతను. రైఫిల్ ని వదిలేసి విరుచుకు పడిపోయాడు.

" ఆగు.... ఆగరా రాస్కెల్...... ఆగు" అంటూ ఒకేసారి ముందుకు దూకారు మిగిలిన ముగ్గురూ.

"ఆగాల్సిన అవసరం నాకు లేదు – మీ లాంటి వాళ్ళు వందమంది వచ్చారంటే మీ ముఖాలు పగలగొట్టి సున్నపు బొట్లు పెడతాను." బిగ్గిరిగా అంటూ రెండో గులకరాయిని కూడా విసిరేశాడా వ్యక్తి.

అంతటితో హద్దు మీరిపోయింది సైనికుల అగ్రహం. పళ్లు కొరుకుతూ పరుగు అందుకున్నారు అతన్ని పట్టుకోవటానికి.

"ముఖాలు పగల గొడతావా? సున్నపు బొట్లు పెడతావా? నీ కాళ్ళు చేతులు విరిచేసి షెడ్ మీద ఎండ వేయకపోతే అప్పుడు అడుగు" అంటూ మైదానాన్ని దాటి రోడ్డును క్రాస్ చేశాడు.

"ఓరి దొంగనాయాలా! ఈ కాస్త పనికోసం నన్ను నిలబెట్టి దోచుకుంటావా?" ఆశ్చర్యంగా అంటూ షాడో వెనుకగా మైదానంలోకి దారి తీశాడు తల్వార్.

పది క్షణాల్లో హెలీకాప్టర్‌ని చేరుకొని, దాని లాండింగ్ ఆపరేటిస్‌లకు బిగించి వున్న ఇనుప గొలుసుల్ని తొలిగించేశాడు షాడో. ఒక్క దుముకులో లోపలికి పోయి ఇంజన్‌ని స్టార్ట్ చేశాడు ముఖేష్. షాడోతో పాటు మిగిలిన ఇద్దరూ ఎక్కగానే కంట్రోలింగ్ రాడ్‌ని పట్టుకుని గాలిలోకి లేపాడు.

"జాగ్రత్తగా పోయి రండి రాజూ సాబ్...... కొంచెం వెనుకా ముందు చూసుకుంటూ ప్రయాణం చేయండి......" అని అరిచి చేతులు వూపుతూ మైదానం బయటికి పరుగు తీశాడు తల్వార్.

అతని స్నేహితుడి వెంట పడిన సైనికులకు ఆఖరి క్షణంలో గాని అర్థం కాలేదు అసలు విషయం. అర్థం అయిన మరుక్షణం వెనక్కి పరిగెత్తుకొచ్చి షెడ్‌లో వున్న టెలీఫోన్‌ని చేతుల్లోకి తీసుకున్నారు. అది పని చేయదని వాళ్ళు గ్రహించే సరికి ట్రిపోలీ సిటీని దాటి, బర్మా సముద్రం మీద పాతిక మైళ్ళ దూరం వెళ్ళిపోయింది హెలీకాప్టర్.

## 13

"వచ్చేశాం గురూ వచ్చేశాం...... సారికన్ ఐలండ్ దగ్గిరికి మనం వచ్చేశాం!!" హెలీకాప్టర్‌లో వున్న నావిగేషన్ ఛార్టు ముందు నుంచి ఛెంగున లేస్తూ బిగ్గిరిగా అరిచాడు శ్రీకర్.

అతని అరుపును వినిపించుకోలేదు ఎవరూ.

కంట్రోలింగ్ రాడ్‌ని మానిప్యులేట్ చేయటంలో బిజీగా వున్నాడు ముఖేష్. క్షణ క్షణానికి ఖాళీ అయిపోతున్న పెట్రోల్ టాంకుల వంక ఆందోళనగా చూస్తూ, క్రింద కనిపిస్తున్న అరణ్యాలను అతి జాగ్రత్తగా గమనిస్తూ రకరకాల ఆలోచనలతో సతమతం అయిపోతున్నాడు షాడో. హాయిగా పడుకుని అదమరిచి నిద్రపోతున్నాడు వాసు. మీద పడి పిడికిళ్ళతో కుమ్మినా కనులు తెరిచేటట్లు కనిపించటం లేదు.

ఎంతో కష్టపడి, ఎన్నెన్నో లెక్కలు వేసి తను కనిపెట్టిన విషయాన్ని వాళ్ళు మెచ్చుకోవటం మాట అటుంచి, అసలు వినిపించుకోక పోయేసరికి విపరీతమైన కోపం శ్రీకర్‌ని ఆవరించుకుంది.

"ఈ సారి ఎప్పుడైనా నావిగేషన్ వివరాలు అడిగితే – అప్పుడు చెపుతాను. కృతజ్ఞత అనే పదానికి అర్థం తెలియని వాళ్ళతో కలిసి ప్రయాణం చేయటం వట్టి అవివేకం......" అంటూ ఒక కిటికీ దగ్గిరికి పోయి బయటికి తొంగి చూశాడు.

అప్పుడే ఉదయిస్తున్న సూర్యుని వెలుగులో తళ తళ మెరుస్తూ అతనికి కనిపించింది సారికన్ ఐలాండ్ ఉత్తర దిశలో వున్న పెద్ద అగ్ని పర్వతం.

"ఫెంటాస్టిక్! ఇటీజ్ రియల్లీ వండ్రఫుల్!!" అనుకుంటూ తనను తను మరిచిపోయి అటువైపే చూస్తూ వుండి పోయాడతను.

ఉన్నట్లుండి జిగేల్ మన్నాయి అతని కనులు........ బ్రహ్మాండమైన మెరుపు ఏదో మెరిసినట్లు కనులు మిరుమిట్లు గొలిపే కాంతి ఆ అగ్ని పర్వతం మీదుగా కనిపించింది.

“మైగాడ్! అటు చూడు గురూ...... ఆ పర్వతం వైపు చూడండి!!” ఆందోళనగా అరిచాడతను.

ఈ సారి వెంటనే వినిపించుకున్నారు అతని స్నేహితులు .

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో కంట్రోలింగ్ రాడ్‌ని షార్పుగా ముందుకు లాగాడు ముఖేష్.

సుడిగాలిలో చిక్కుపడిన పక్షిలా వైల్డ్‌గా వూగింది హెలీకాప్టర్ . తల్లక్రిందులు అయినంత పని చేసి, శరవేగంతో క్రిందికి దిగసాగింది.

అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

అగ్నిపర్వతం మీద శ్రీకర్‌కి కనిపించిన వెలుగు – తోక చుక్క మాదిరి స్పీడ్ గా వచ్చి హెలీకాప్టర్ వెనుక భాగాన్ని తాకింది.

ఫట్ మని వినవచ్చిందొక శబ్దం. పదునైన రాక్షస ఖడ్గంతో నరికినట్లు తెగి అవతలి దొర్లింది హెలికాప్టర్ తోక.

ఎంత ప్రయత్నించినా కంట్రోల్ చేయటం ముఖేష్‌కి అసాధ్యం అయిపోయింది. గింగిరాలు తిరుగుతూ కన్ను మూసి తెరిచే లోగా క్రింద వున్న అరణ్యంలో పడి పోయింది హెలీకాప్టర్.

* * * * *

పది టన్నుల బరువుండే బండరాయి ఏదో తన మీద పడినట్లు బాధపడుతూ కనులు తెరిచి చుట్టూ చూశాడు షాడో.

వంద గజాల దూరంలో కనిపించింది హెలీకాప్టర్ నుండి విడిపోయిన ఒక పెద్ద రేకు ముక్క....... దానికి మరి కొంచెం దూరంలోనే పడి వున్నాయి కొన్ని ఇంజన్ పార్టులు.

జరిగిందేమిటో ఒక్కసారిగా గుర్తుకు వచ్చేసరికి విపరీతమైన ఆందోళన అతన్ని ఆవరించుకుంది.

“ముఖేష్! శ్రీకర్!! వాసూ!!!” అని బిగ్గరిగా పిలుస్తూ పడిన చోటి నించి గబగబా లేచాడు.

హెలీకాప్టర్ నేలకు గుద్దుకోబోతున్న ఆఖరి క్షణంలో క్రిందికి దూకేశారు వారందరూ. వత్తుగా పెరిగి వున్న చెట్ల కొమ్మల మీద పడడటం వల్ల ప్రమాదం నించి తప్పించుకోగలిగాడతను...... మరి మిగిలినవాళ్ళు ఏమయినట్లు?

కదలటానికి మొరాయిస్తున్న అవయవాలను అతి ప్రయత్నం మీద కంట్రోల్ చేసుకొని, చిత్తవత్తుగా పెరిగిన పొదల మధ్యలో నుంచి ముందుకు బయలుదేరాడు , ప్రతి పది అడుగులకు ఒకసారి ఆగి బిగ్గిరిగా పిలవసాగాడు తన స్నేహితుల్ని.

అరగంట తరువాత వున్నట్లుండి అతని చెవికి చేరింది బలహీనమైన కంఠ స్వరం.

“దూరంగా నిలుచుని అలా గావు కేకలు పెట్టకపోతే దగ్గిరికి వచ్చి చేయి అందివ్వకూడదూ? తొందరగా వచ్చి మమ్మల్ని బయటికి లాగు గురూ.....” అంటూ శరీరంలో మిగిలి వున్న శక్తినంతా కూడగట్టుకుని పిలిచాడు శ్రీకర్.

పరుగులాంటి నడకతో అటువైపు వెళ్ళాడు షాడో. ఆరు అడుగుల ఎత్తు పెరిగి వున్న ముళ్ళ పొదల్ని అతి కష్టం మీద దాటి అవతలి వైపుకు తొంగి చూసేసరికి – కనిపించాడు శ్రీకర్.

జనపనార మోకుల వంటి అడవి తీగల్లో చిక్కుపడి తల్లక్రిందులుగా వ్రేలాడుతున్నాడతను....... అతనికి పది అడుగుల దూరంలో స్పృహ లేకుండా నేల మీద పడి వున్నాడు వాసు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా ముందుకు దూకి, బూటు ప్రక్కనే బిగించి వున్న డాగర్ సహాయంతో శ్రీకర్ బంధనాలను సడలించాడు షాడో.

"వాసుకు తెలివి వచ్చే ఏర్పాట్లు చూడు శ్రీ..... నేను ముఖేష్‌ని వెతుకుతాను." అంటూ అతన్ని జాగ్రత్తగా నేలకు దింపి, అవతలి ప్రక్కన వున్న పొదల్లోకి పరుగు తీశాడు.

అరగంట..... గంట.... రెండు గంటల సేపు ఆలసట, ఆయాసాన్ని లెక్క చేయకుండా వెతికినా అతనికి కనిపించలేదు ముఖేష్..... కనీసం అతని జాడలు కూడా అగుపించలేదు.

వికలమైపోయిన మనస్సుతో వెనుతిరిగి ముళ్ళ పొదల దగ్గిరికి వచ్చేశాడు. మర్రి వూడల్లా వ్రేలాడుతున్న అడవి తీగెల మధ్యలో నుంచి ముందుకు చూసి శిలా విగ్రహంలా స్తంభించిపోయాడు.

స్పృహతప్పి పడిపోయిన వాసుగాని, అతనికి తెలివి తెప్పించటానికి ప్రయత్నిస్తూ వుండాల్సిన శ్రీకర్ గాని అక్కడ కనిపించలేదు. ఎర్రటి రక్తపు

మడుగులు రెండు వెక్కిరిస్తున్నట్లు అగుపిస్తున్నాయి. చినిగి పేలికలైన శ్రీకర్ షర్టు వుండచుట్టి విసిరేసి వుంది ఒక పొద ముందర.

చల్లటి మంచు హస్తం ఏదో తన గుండెల మీద పడి నొక్కుతున్నట్లు ఫీల్ అవుతూ ముందుకు దూకి ఆ ప్రదేశాన్నంతా జాగ్రత్తగా పరిశీలించాడు షాడో.

రెండు నిముషాల తరువాత అతనికి కనిపించాయి అడుగు జాడలు. పాతికమంది మనుష్యులు గుంపుగా అక్కడికి వచ్చారు. నిస్సహాయంగా వున్న అతని స్నేహితులను ఎటాక్ చేసి వెంట బెట్టుకు పోయారు.

క్షణ క్షణానికి దిగజారిపోతున్న శక్తియుక్తులను అతి ప్రయత్నం మీద కూడదీసుకుంటూ, ఆ అడుగు జాడల వెంట పరుగు ప్రారంభించాడు షాడో. ముళ్ళ పొదలు తగిలి శరీరం రక్తిసిక్తమౌతున్నా, రాళ్ళు రప్పలు తగిలి మోకాళ్ళు నెత్తురు ముద్దలౌతున్నా లెక్క చేయకుండా ప్రయాణం చేశాడు రెండు గంటల సేపు.

ఉన్నట్లుండి అతని దారికి అడ్డంగా ప్రత్యక్షం అయింది ఒక కొండ వాగు. దాని మందుకు పోయి అకస్మాత్తుగా అదృశ్యం అయిపోయాయి అతను అనుసరిస్తున్న అడుగు జాడలు.

ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అణుచుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ, కొండవాగులో దిగి దాహం తీర్చుకున్నాడు షాడో. తిరిగి వడ్డు మీదికి వస్తుండగా కనిపించింది ఒక పెద్ద అడవి కోడి.

జానెడు ఎత్తు కూడా లేని పిల్లల్ని పదింటిని వెంటబెట్టుకొని వాగు వద్దునే వున్న ఒక పొదలో మేత కోసం వెతుకుతోంది. ఉన్నట్లుండి కీచుగా అరిచి పరుగు ప్రారంభించింది అది. రెక్కలు తప తప కొడుతూ దాన్ని అనుసరించాయి పిల్లలు.

ఆ దృశ్యాన్ని చూసిన మరుక్షణం తల్లక్రిందులుగా పల్టీ కొట్టి వాగులోకి దూకేశాడు షాడో. చల్లటి నీరు తగిలి వంటిమీద గాయాలు విపరీతమైన మంట పెడుతున్నా లెక్క చేయకుండా బలంగా బారలు వేస్తూ పది క్షణాల్లో అవతలి వద్దును సమీపించాడు.

అడవి కోడి ఎందుకు బెదిరిందో, పిల్లల్ని కూడా పిలుచుకోకుండా పిచ్చిగా ఎందుకు పారిపోయిందో తెలుసుకోవాలన్న కోరిక అతనికి కలుగలేదు. అరణ్యంలో సంచరించే ప్రతి జీవి తన చుట్టు పట్ల వున్న పరిసరాల్ని ఒక కంట కనిపెడుతూనే వుంటుంది. ప్రమాదచ్ఛాయలు ఏ మాత్రం కనిపించినా శరవేగంతో ఆ పరిసరాల్ని వదిలి మరో ప్రదేశంలోకి పారిపోతుంది.

ధైర్యం, సాహసం మొదలైన పదాలకు అరణ్యంలో విలువ లేదు. ఇరవై నాలుగు గంటలూ అప్రమత్తతగా వుండి ఆత్మ రక్షణ చేసుకోగల జీవులే పది కాలాలపాటు క్షేమంగా జీవించ గలుగుతాయి.

నీళ్ళు కారుతున్న వంటితో వద్దు మీదికి ఎక్కి వెనుతిరిగి చూసిన షాడో కనులకు ఠీవిగా అడుగులు వేస్త నీటి వద్దకు వచ్చిన ఒక సరాంగ్ కనిపించింది.

నిక్ ఆఫ్ ది మూమెంట్‌లో తనను హెచ్చరించిన అడవి కోడికి కృతజ్ఞతలు తెలియ చేసుకుంటూ వేగంగా ఒక పొదచాటుకు జంప్ చేశాడు.

బర్మా అరణ్యాల్లో కనిపించే అతి భయంకరమైన క్రూర మృగం ఆ సరాంగ్. పెద్ద పులి మాదిరిగా పదునైన కోరలతో చరకత్తుల వంటి పంజాలతో , ఒకే దెబ్బకు ఖడ్గమృగాన్ని కూడా ఖతం చేయగల బలాన్ని కలిగి వుంటుంది అది.

మనిషి మాంసమంటే మహా యిష్టం దానికి. కంటపడిన మనిషిని ఆరగించకుండా అవతలికి పోవటం దానికి అలవాటు లేదు.

అప్రయత్నంగా చేతిని వెనక్కి పోనిచ్చి బెల్టు వెనుక ఉన్న రివాల్వర్‌ని బయటికి తీయబోయాడు షాడో. వెక్కిరిస్తున్నట్లు చేతికి తగిలింది ఖాళీగా వున్న పాంటు బెల్టు.

జరిగిందేమిటో గ్రహించేసరికి కొండవాగులో స్నానం చేసినట్లు చెమటలతో నిండిపోయింది అతని శరీరం.

అడవి కోడి హెచ్చరికను చూసి అమాంతం వాగులోకి పల్టీ కొట్టడంలో తనకు తెలియకుండానే జారిపోయింది రివాల్వర్ !

నీటి అంచున నిలబడి చుట్టూ పరికించింది సరాంగ్. తల ఎత్తి పెద్ద శబ్దం వచ్చేలా గాలిని పీల్చుతూ అక్కడ అలుముకొని వున్న వాసనలను గుర్తుపట్టే ప్రయత్నం చేయసాగింది.

అక్కడే వుంటే దాని దృష్టిలో పడటం గారెంటీ అని గ్రహించి చల్లగా వెనక్కి జరిగాడు షాడో. అడుగులో అడుగు వేసుకుంటూ పది గజాల దూరం నిశ్శబ్దంగా నడిచి ఒక్కసారిగా పరుగు అందుకున్నాడు.

ఎంతో దూరం పోకముందే ఎదురు చూడని విధంగా అతన్ని చుట్టు ముట్టింది మరో ప్రమాదం.

నల్లటి శరీరాలతో, వికృత ముఖాలతో, పొడుగాటి బరిశెల్ని పట్టుకొని అతని ముందు ప్రత్యక్షం అయినారు పాతికమంది ఆటవికులు.

పెనం మీద బాధను తప్పించుకోబోయి నిప్పుల్లో పడినట్లు తయారయిన తన దురదృష్టాన్ని నిందించుకుంటూ చేతుల్ని గాలిలోకి ఎత్తి, అందంగా నవ్వటానికి ప్రయత్నించాడు షాడో.

"హల్లో జంటిల్మన్! నేను మీకు స్నేహితుడినే....... శత్రువుని కాదు......" అన్నాడు బర్మా భాషలో.

ఆ మాటలు వారికి అర్థంకాలేదు. జంగురు పిల్లలు అరిచినట్లు వికృత శబ్దాలు చేస్తూ బరిశెల్ని గాలిలోకి ఎత్తారు. చూపుల్ని అతని మీదే కేంద్రీకరించి వుంచి చుట్టూ వలయా కారంలో కమ్ముకున్నారు.

మంచి మాటలతో తనకు విమోచనం లభించదని షాడోకి అర్థం అయింది. పైకి ఎత్తిన చేతుల్ని మెరుపులా క్రిందికి దించి బూటు ప్రక్కన వున్న డాగర్‌ని బయటికి లాగాడు.

అదే అతను చేసిన తప్పు. డాగర్ కోసం ముందుకు వంగిన అతని మెడ మీద దిగబడింది ఒక ఆటవికుడు విసిరిన చురకత్తి వంటి చిన్న వెదురు ముల్లు.

డాగర్‌ని కుడిచేతిలో బిగించి పట్టుకొని ఎడమ చేతి వైపు వున్న ఆటవికుడి మీదికి లంఘించబోయాడు షాడో. నేలకు అతుక్కుపోయినట్లు అర అంగుళం కూడా కదలలేదు అతని పాదాలు.

శక్తివంతమైన మత్తు ఇంజక్షన్ ఏదో యిచ్చినట్లు క్రిందికి వాలిపోయాయి చేతులు. వారం రోజుల నుంచి నిద్రలేనట్లు బరువుగా వాలిపోయాయి కనురెప్పలు. నిలుచున్న వాడు నిలుచున్నట్లే మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడి పోయాడు.

## 14

విపరీతమైన దాహంతో నాలుక పిడచ గట్టుకుపోతుండగా, "నీళ్ళు.... ధర్మాత్ములెవరైనా కాసిని మంచినీళ్ళు నా గొంతులో పోసి పుణ్యం కట్టుకోండి" అంటూ కనులు తెరిచాడు శ్రీకర్.

కొండరాళ్ళతో మలిచిన శిలా విగ్రహాల మాదిరి కూర్చుని వున్నారు అతన్ని బంధించిన ఆటవికులు. ఒక చెట్టు క్రింద పెద్ద చితుకుని మంట వేసి చలి కాచుకుంటున్నారు.

"నోరు ఎండిపోయి నేను చచ్చిపోతుంటే మీకు చలి మంటలు కావాల్సి వచ్చాయా? మంచి నీళ్ళు యిస్తారా..... లేచి వచ్చి మిమ్మల్ని తుక్కు క్రింద కొట్టమంటారా !" నొసలు ముడివేసి తీవ్రంగా వారి వైపు చూస్తూ అన్నాడు శ్రీకర్.

చలి మంట మీది నుంచి చూపుల్ని ప్రక్కలకు తిప్పలేదు వాళ్లు. కనీసం అతని మాటలు వినబడినట్లు కూడా నటించలేదు.

కాళ్ళకు చేతులకు కట్టేసి వున్న చర్మపు తాళ్ళను తెంచుకోవటానికి విఫల యత్నం చేశాడు శ్రీకర్. అది చూసి చిన్నగా నవ్వాడు అతని ప్రక్కనే కూర్చుని వున్న వాసు.

"అనవసరమైన హంగామా చేస్తే దాహం మరింత ఎక్కువ అవుతుంది. తొందరపడి లేని పోని తలకాయ నెప్పుల్ని తెచ్చుకోకు......" అని చిన్న సలహా కూడా యిచ్చాడు.

ఎర్రగా కందిపోయిన ముఖంతో అతని వంక గుర్రుగా చూసి తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు శ్రీకర్. తాపీగా సర్దుకు కూర్చుని తమ పరిస్థితిని అంచనా వేసుకున్నాడు.

ముఖేష్‌ని వెతకటానికి షాడో అవతలికి వెళ్ళిన పది నిముషాల్లో ప్రత్యక్షం అయ్యారు ఆ రాక్షసులు. పారిపోయే అవకాశం కూడా యివ్వకుండా తనను వాసును బంధించి బయలు దేరారు. పగలంతా ఎక్కడా ఆగకుండా నడవటం వల్ల విపరీతమైన బడలిక తమను క్రుంగతీస్తోంది...... నిద్ర అనేది ఎలా వుంటుందో తెలియనట్లు చితుకుల మంట ముందే కూర్చున్నారు ఆటవికులు ...... తప్పించుకునే అవకాశం పొరపాటున కూడా యివ్వటం లేదు.

ఉన్నట్లుండి వాళ్ళు మంట ముందు నుంచి లేవటంతో అంతం అయిపోయాయి శ్రీకర్ ఆలోచనలు. మంటను ఆర్పేసి దట్టంగా వున్న ముళ్ళపొదల మధ్యగా మళ్ళీ ప్రయాణం ప్రారంభించారు ఆటవికులు.

రెండు గంటల తర్వాత తూర్పు దిక్కు తెల్లబడింది. వెలుగు వచ్చిన నాలుగు గంటలకు పెద్ద పర్వత శ్రేణి ముందు వారికి కనిపించింది ఒక ఆటవిక గూడెం.

గూడెం పొలిమేరల్లో ఆడుకుంటున్న పిల్లలు, పనులు చేసుకుంటున్న పెద్దలు అందరూ గావు కేకలు పెడుతూ ఎదురు వచ్చారు. ఊరేగింపుగా తీసుకుపోయి గూడెం మధ్యలో వున్న పెద్ద గుడిశె ముందు నిలబెట్టారు.

పొడుగాటి బరిశెల్ని పట్టుకొని గుడిశె ద్వారం ముందు కాపలా వున్నారు యిద్దరు స్త్రీలు.

"నాయకుడిని నిద్రలేపండి....... అరణ్యంలోకి పోయి ఇద్దరు బానిసల్ని తెచ్చామని చెప్పండి....." వారి వంక ఠీవిగా చూస్తూ అన్నాడు శ్రీకర్‌ని బంధించిన లావుపాటి అటవికుడు ఒకతను.

"కాపలా కాయటమే నా కర్తవ్యం. కావాలంటే నిద్ర నువ్వే లేపుకో....." నిర్లిప్తంగా సమాధానం యిచ్చింది ఒక స్త్రీ.

విపరీతమైన అగ్రహంతో నల్లగా కమిలిపోయింది ఆటవికుడి ముఖం.

"నా మాటలకే ఎదురు చెప్తావా? ఇద్దరు బానిసల్ని బంధించి తెచ్చిన నన్ను ఇంతమంది చూస్తూ వుండగా దిక్కరించి మాట్లాడతావా?" అంటూ బరిశెను అడ్డంగా తిప్పి తల మీద బాదాడు.

గూడెం దద్దరిల్లిపోయేటట్లు అరిచిందా స్త్రీ. తలను చేతులతో కప్పుకుంటూ క్రిందపడి పొర్లసాగింది. ఆమెను కాలితో అవతలికి నెట్టి రెండో స్త్రీ వైపు తిరిగాడు ఆటవికుడు.

"పిచ్చి వేషాలు వేస్తే నా మొగుడికి చెప్పి నీ ఎముకలు విరగేయిస్తాను. మొగుడు లేడు కాబట్టి నీ లాంటి దద్దమ్మ చేతిలో దెబ్బలు తింది అది. నా జోలికి

వచ్చావంటే మాత్రం నీ వీపు పగిలిపోతుంది." బరిశె మొనను అతని ముఖానికి ఆనిస్తూ నిక్కచ్చిగా సమాధానం యిచ్చేసిందా స్త్రీ.

బర్మా భాషకు చాలా దగ్గిర పోలికలున్న వారి భాష కొంచెం కొంచెంగా తెలుస్తోంది శ్రీకర్‌కి. అక్కడ జరుగుతున్న భాగవతాన్ని చూస్తున్న కొద్దీ ఒక విషయం అతనికి కొట్ట వచ్చినట్లు అర్థం అయింది.

గుడిశెలో పడుకున్న నాయకుడు ఒక కుంభకర్ణుడి లాంటివాడు. అతనంతట అతను నిద్రలేచేదాకా ఆగకుండా అర్థంతరంగా వెళ్ళి పిలిస్తే, పిలిచిన వాడి ముగం ముక్కలు ముక్కలై పోతుంది.

అది యిష్టం లేక అతన్ని నిద్ర లేపటానికి కాపలా స్త్రీలను బెదిరిస్తున్నాడు తనను బంధించిన అటవికుడు..... వాళ్ళు మాట వినకపోయేసరికి నిప్పు తొక్కిన కోతిలా గంతులు వేస్తున్నాడు.

పళ్ళు కొరుకుతూ అటు యిటూ చూసి చటుక్కున శ్రీకర్‌ని గుడిశె ముందుకు నెట్టాడు అటవికుడు.

"ప్రాణాల మీద ఆశ వుంటే నాయకుడిని నిద్రలేపు" అంటూ హెచ్చరించాడు.

రెండు అడుగులు వేసినట్లే వేసి మొండిగా అడ్డం తిరిగాడు శ్రీకర్.

"నువ్వు అరిచి పీక్కున్నా నీ నాయకుడిని నేను లేపను. కావాలంటే నువ్వే లేపుకో......" అంటూ వాసు దగ్గిరికి వచ్చేశాడు

ఫక్కున నవ్వారు అక్కడ గుమికూడిన వారందరూ.

"పాపం .....మనవాడి మాటల్ని ఆడవాళ్ళే కాదు. అతని చేతికి చిక్కిన బానిసలు కూడా లెక్క చేయటం లేదు. " అంటూ సానుభూతి చూపించారు.

ఆ మాటల్ని వినేసరికి ఆటవికుడి ఆగ్రహానికి హద్దు లేకుండా పోయింది. పళ్ళు పటపట కొరుకుతూ మొలలో వ్రేలాడుతున్న ఖడ్గాన్ని బయటికి లాగి శ్రీకర్ తల మీద బలంగా కొట్టాడు.

తగిలివుంటే పుచ్చకాయలా రెండు చెక్కలు అయి వుండేది శ్రీకర్ తల. ఆఖరి క్షణంలో ఎగిరి వెనక్కి దూకాడతను. చర్మపు తాళ్ళతో బంధించి వున్న చేతుల్ని పైకి ఎత్తి కత్తికి అడ్డం పెట్టాడు.

తలను నరకాల్సిన కత్తి అతని బంధనాలను ఛేదించేసింది. అది చూసేసరికి మరింత వుద్వేగ్నుడై ఇంకోసారి కత్తిని ఎత్తాడు ఆటవికుడు.

ఒక్క గంతులో అతని ముందు వాలి, కుడిచేతిని పట్టుకున్నాడు శ్రీకర్. మోకాళ్ళను ముందుకు వంచి, అతన్ని తన భుజం మీదుగా ఎత్తి అవతలకు విసిరేశాడు.

ఏనాడూ కనీవినీ ఎరుగని ఆ జూడో టెక్నిక్‌ని గమనించి ఆశ్చర్యంతో నోళ్లు తెరిచారు అక్కడ వున్న వాళ్ళు.

"పిట్ట కొంచెమే అయినా కూత ఘనంగానే వుంది. వ్రేలెడు కూడా లేని ఆ కుర్రాడికే అంత బలం వుంటే సరాంగ్ మృగంలా తెగబలిసిన ఆ రెండో బాసినకు యింకెంత బలం వుంటుందో !!" అనుకున్నారు తమలో తాము.

ఆ మాటలు శ్రీకర్‌కి అర్థం అయ్యాయి. వాసుకు మాత్రం బుర్రకు ఎక్కలేదు. అటవికుడు తల్లక్రిందులుగా నేల మీద పడిన మరుక్షణం తన

బంధనాల్ని కూడా లెక్క చేయకుండా ఎగిరి అతని గుండెల మీదికి దూకాడు. రెండు మోచేతులనూ కలిపి ముఖం మీద గుద్ది, మోకాళ్ళతో గుండెల్ని బలంగా నేలకు అదిమాడు.

గూడెం దద్దరిల్లిపోయేలా అరిచి రెండు దోసిళ్ళ రక్తాన్ని కక్కుకున్నాడు ఆటవికుడు. "రండిరోయ్ రండి..... వచ్చి నన్ను రక్షించండి రోయ్" అని తన వారిని పిలుస్తూ గిలగిలా కొట్టుకున్నాడు.

అప్పుడు కదిలారు మిగిలిన అటవికులు. వాసు చేతుల్ని పట్టుకొని రఫ్‌గా వెనక్కి లాగేశారు.

"నిన్ను చంపుతాను...... నీ మాంసాన్ని ఎండలో ఎండబెట్టి నిప్పుల్లో కాల్చకుండా కరకరా నమిలేస్తాను......" అని రంకెలు పెడుతూ ముందుకు దూకబోయి, హఠాత్తుగా ఆగిపోయాడు అటవికుడు.

అతని ముఖంలోని భావాల్ని గమనించి ఆశ్చర్యపడుతూ తల ప్రక్కకు తిప్పిన శ్రీకర్‌కి ఆవలిస్తూ గుమ్మంలోకి ప్రత్యక్షం అయిన నాయకుడు కనిపించాడు.

ఏడు అడుగుల ఎత్తున, ఎర్రటి కనులతో, ఎముకలతో చేయబడిన దండలను ధరించి, మూర్తీభవించిన కుంభకర్ణుడి మాదిరిగానే అగుపిస్తున్నాడతను.

"బ్రహ్మాండమైన నా నిద్రను చెడగొట్టింది ఎవరు? నా గుడిశె ముందుకు వచ్చి రణగొణ ధ్వనులు చేసింది ఎవరు?" బండి చక్రాల వంటి కళ్ళను గుండ్రంగా తిప్పుతూ ఎనుబోతులా రంకె వేశాడు.

కల్లు తాగిన కోతిలా గంతులు వేస్తూ వాసు మీదికి దుముకబోతున్న ఆటవికుడు పిల్లిలా ముడుచుకుపోయాడు. చేతులు కట్టుకొని వినయంగా వంగి వంగి అడుగులు వేస్తూ అతన్ని సమీపించి, చూపుడు వేలితో వాసు శ్రీకర్ల వైపు చూపించాడు.

"బానిసలుగా బ్రతకాల్సిన వాళ్ళకు నన్ను నిద్ర లేపేటంతటి పొగరు వుందా? తీసుకుపోయి నీ యింట్లో బంధించు. నేను నిద్ర లేచిన తర్వాత తీరికగా వాళ్ళ అంతు చూస్తాను........" ఉరుములాంటి కంఠంతో ఆజ్ఞ యిచ్చి గుడిశెలోకి వెళ్ళిపోయాడు నాయకుడు. వెళ్ళిన రెండు క్షణాలకే గాఢమైన నిద్రలో మునిగిపోయినట్లు భయంకరమైన గురక బయటికి వినిపించసాగింది.

తనకు చావు తప్పి కన్ను లొట్టపోయిన సంగతి అక్కడి వారందరికీ తెలుసని గ్రహించి కూడా, నాయకుడు తనను విపరీతంగా మెచ్చుకున్నట్లు పోజు పెట్టి బందీల దగ్గిరికి వచ్చాడు అటవికుడు. తన సహచరులకు సైగ చేసి గూడెం చివరి భాగంలో వున్న తన గుడిశె దగ్గిరికి బయలుదేరాడు.

వెదురు గదలతో, రెల్లు కట్టలతో అందంగా కట్టబడి వుంది అతని గుడిశె. సన్నగా వికృతంగా వున్న యిద్దరు చిన్న పిల్లలకు పాలు యిస్తున్న అటవికుడి భార్య అతన్ని చూడగానే హడావుడిగా లేచి నిలబడింది.

లాగిపెట్టి ఆమె తొడల మీద తన్నాడు ఆటవికుడు. ఆమె చేతుల్లోని పిల్లల్ని విసురుగా లాగి క్రింద పారేశాడు.

"అరణ్యంలో తిరిగి తిరిగి అలసిపోయిన మొగుడు ఇంటికి వస్తే ఆహారం సిద్ధం చేసి వుంచాలని తెలియదా? నిద్ర ముఖంతో గుమ్మం ముందు కూర్చుంటావా ? చందీ ఏదీ ?" అని అరిచాడు క్రూరంగా చూస్తూ.

క్రింద పడి గుక్కులు పడుతున్న పిల్లల్ని కౌగిట్లోకి పొదువుకుని, కళ్ళు తుడుచుకుంటూ గుడిశె ప్రక్క భాగంలోకి చేయి చూపించింది అతని భార్య.

గుడిశె ప్రక్కన వున్న మట్టిదిమ్మ మీద కూర్చుని అడవి పూలను మాల గుచ్చుతోంది అందమైన అడవి పిల్ల ఒకతె. తన పేరు వినపడగానే అదిరిపోయి పూలను అవతలికి విసిరేసింది. వణుకుతూ వచ్చి ఆటవికుడి ముందు నిలబడింది.

రాక్షసుడి మాదిరి ఆమె జుట్టు పట్టుకున్నాడు ఆటవికుడు.

"నువ్వు పుట్టి ఇరవై వర్షాకాలాలు వెళ్ళిపోయాయి. ఇంతవరకూ మొగుడిని వెతుక్కోవటం చేతకాలేదు. మర్యాదగా నాయకుడి బావమరిదిని కట్టుకోలేకపోతే నీ ఎముకలు విరిచేస్తాను." అన్నాడు కరుకుగా.

కన్నీరు బుగ్గల మీదికి జారుతుండగా, అతని చేతుల్లో నుంచి బయట పడటానికి విశ్వ ప్రయత్నం చేసిందా పిల్ల.

గొడ్డును బాదినట్లు బాదాడు ఆటవికుడు. మృదువైన ఆమె చెంపలు వాచిపోయేలా కొట్టి, మెల్లిగా గుడిశెలోకి పోయాడు.

"వీడు మనిషి కాదు...... మన మీద కచ్చనంతా ఇంట్లో ప్రదర్శిస్తున్నాడు...... వీడి కాళ్ళు విరిగేయకపోతే నాకు ఆత్మశాంతి లేదు." అంటున్న శ్రీకర్ కాలుమీద కాలు వేసి గట్టిగా అదిమాడు వాసు.

వారిద్దరినీ గుడిశె ముందున్న చెట్టుకు కట్టేసి తమ దారిన తాము వెళ్ళిపోయారు ఆటవికుడి అనుచరులు.

విపరీతమైన దాహంతో పాటు, దారుణమైన ఆకలితో కూడా బాధపడుతూ రెండు గంటలసేపు మౌనంగా కూర్చుండి పోయాడు శ్రీకర్.

కన్నీటి చారికలతో అసహ్యంగా తయారయిన ముఖాన్ని తుడుచుకుంటూ గుడిశె ప్రక్కనే కూర్చుని వుంది ఆటవికుడి కూతురు చందీ. శ్రీకర్ పడుతున్న బాధల్ని గమనించిందామె. గబగబాపోయి ఒక మట్టి ముంత నిండా మంచినీళ్ళు తెచ్చి అతని చేత తాగించింది.

“నువ్వు యిక్కడ వుండాల్సిన దానివి కాదు. హాయిగా మొగుడిని వెతుక్కుని వెళ్ళిపోక ఎందుకిలా తన్నులు తింటూ బ్రతుకుతావ్?” దాహం తీరగానే దేశోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టి అడిగాడు శ్రీకర్.

“నాయకుడి బావమరిది చేసుకుంటే ఇంత కంటె ఎక్కువ తన్నులే తినాల్సి వస్తుంది. మా నాన్న రాక్షసుడైతే వాడు పచ్చి కిరాతకుడు.......” తల వంచుకుని మెల్లిగా చెప్పిందామె.

“వాడు కాకపోతే వాడి బాబు ఇంకొకడిని చూసి చేసుకో...... మీ గూడెంలో నాయకుడి బావమరిది తప్ప మగ వాళ్ళు లేరా?” వాసుకు కూడా మంచి నీళ్ళు తెచ్చి పెట్టమని ముంత వైపు చూస్తూ బ్రహ్మాండమైన సలహా యిచ్చాడు శ్రీకర్.

మారు మాట్లాడకుండా అవతలికి వెళ్ళి మరో ముంత నీళ్ళు తెచ్చింది ఆ పిల్ల.

"నేను ప్రేమించిన కుర్రాడికి నాయకుడి బావమరిదిని గెలిచే బలం లేదు. కాదు కూడదని నేను పెళ్ళి చేసుకుంటే చేసుకున్న మరుక్షణం ఆ కిరాతకుడు నా మొగుడిని చంపేస్తాడు......" నీళ్ళ ముంతను వాసు నోటికి అందిస్తూ చెప్పింది.

విపరీతంగా బాధ పెడుతున్న దాహం ఉపశమించే సరికి వాసు మెదడు కూడా మహా చురుకుగా పని చేయటం మొదలు పెట్టింది.

"యూ డోన్ట్ వర్రీ బేబీ..... నువ్వు ప్రేమిస్తున్న కుర్రాడిని అర్జంటుగా పిలుచుకురా...... అన్ని విషయాలు అతనితో మాట్లాడతాను" అని అభయం యిచ్చేశాడు....... శ్రీకర్ మాదిరిగా.

అతని మాటలు అర్థంకాక శ్రీకర్ వైపు తిరిగింది చందీ.

"మా వాడికి నీ భాష సరిగ్గా రాకపోవటం వల్ల అలా పాటలు పాడుతున్నాడు. నువ్వు కంగారు పడకుండా నీకు కాబోయే మొగుడిని ఇక్కడికి తీసుకురా...... అతనితో మాట్లాడాలి." అంటూ వాసు మాటల్ని ట్రాన్స్‌లేట్ చేశాడతను.

ఒక్కసారిగా వికసించింది చందీ ముఖం.

"చీకటి పడిన తర్వాత యిక్కడికి వస్తాడు.... మరి అంతవరకూ మీరు నిద్రపోకుండా వుంటారా?" అని అడిగింది ఆశగా.

నిద్రకీ ఆ గూడెపు ప్రజలకూ అవినాభావ సంబంధం చాలా వుందని గ్రహించి తల వూపాడు శ్రీకర్. ఎట్టి పరిస్థితిల్లోను నిద్ర పోవటం జరగదని హామీ యిచ్చి తేలికగా నిట్టూర్చాడు.

అడవి కోడి మాదిరి ఎగురుకుంటూ గూడెంలోకి వెళ్ళి పోయింది చందీ. ఆమె దృష్టి పథం నుంచి దూరం అయిన మరుక్షణం నుంచీ ఎప్పుడు చీకటి పడుతుందా అని ఎదురు చూడసాగారు బందీలు. ఇద్దరి మనస్సుల్లోను ఒకటే ఆలోచన మెదులుతోంది.

## 15

వంద తేళ్ళు ఒకేసారి కుట్టినంత బాధను కలిగిస్తున్న మెడను సవరించుకుంటూ చుట్టూ చూశాడు షాడో.

కొండ వాగు వద్దున వున్న పొదల్లో లేడతను. ఎగుడు దిగుడుగా వున్న పెద్ద కొండ గుహలో వున్నాడు.

గుహ ముందు కూర్చుని పెద్ద పెద్ద దుంగలతో నెగడు వేస్తున్నారు అతన్ని బంధించిన ఆటవికులు. ఇద్దరు మనుష్యులు పట్టినా పైకి లేవనంత లావుగా వున్న ఒక అడవి జంకను ఆ నెగడు మీద కాలుస్తున్నారు.

మట్టి కొట్టుకున్న ముఖాలతో, చింపిరి తలలతో పెదవులు చప్పరించుకుంటూ ఆ దృశ్యాన్ని చూస్తున్నారు అనేకమంది ఆడవాళ్ళు.

వాళ్ళ అవతారాలు విచిత్రంగా కనిపించి, పడి వున్న ప్రదేశంలో నుంచి లేవబోయాడు షాడో.

“వద్దు..... లేవద్దు.... లేచి నిలబడ్డావంటే, నెగడు మీది అడవి జింకను తీసేసి దాని స్థానంలో నిన్ను కాల్చుకు తింటారు.” అంటూ వెంటనే అతన్ని హెచ్చరించింది ఒక కంఠం.

ఉలిక్కిపడి వెనక్కి చూసిన షాడోకి, తన మాదిరి గానే పడి వున్న మరో జాతికి చెందిన ఆటవికుడు ఒకతను కనిపించాడు .

“మనుష్యుల్ని చంపుకు తినే నంగా జాతివాళ్ళు వీళ్ళు నిన్ను, నన్ను బంధించి తీసుకు వచ్చింది అందుకోసమే.......” చిరునవ్వుతో అన్నాడతను. షాడో ముఖంలో కదలాడుతున్న సందేహాలను గమనించి.

లేచి కూర్చునే ఆలోచన శరవేగంతో మాయమై పోయింది షాడో హృదయంలో నుంచి. జరిగిందేమిటో గ్రహించే సరికి చలిగాలి వీచినట్లు జలదరించటం ప్రారంభించింది అతని శరీరం.

మత్తును కలిగించే వెదురు ముళ్ళను ప్రయోగించి ఆహారాన్ని సంపాదించుకుంటారు సారికన్ ఐలాండ్‌లో కనిపించే నంగా జాతి నరమాంస భక్షకులు. సరాంగ్ మృగాన్ని చూసిన ఖంగారులో ఆ విషయాన్ని విస్మరించి వారి చేతికి చిక్కాడు తను. వెదురు ముళ్ళ వలన తనను పారలైజ్ చేసిన పాయిజన్ విరిగి పోయిందని గ్రహించిన మరుక్షణం నెగడు మీదికి ఎక్కించి చక్కగా కాల్చుకు తింటారు.... ఆ దుర్గతి పట్టక ముందే అక్కడి నుంచి తప్పించుకోవాలి..... అందుకు మార్గం??

షాడో మనస్సులోని ఆలోచనను అతి తేలికగా కనిపెట్టేసి, విచిత్రంగా నవ్వాడు గుహలో వున్న ఆటవికుడు.

“అనవసరమైన ఆశలు పెంచుకోవద్దు...... నంగా జాతి వాళ్ళ చేతికి చిక్కి ప్రాణాలతో బయట పడగలిగిన వాళ్ళు యింత వరకూ ఎవరూ లేరు. వాళ్ళ వద్ద వున్న వెదురు ముళ్ళకు అందకుండా పారిపోవటం అసంభవం. వాటికి

అందకపోయినా, పరుగు పందెంలో ఈ రాక్షసుల్ని జయించటం అస్సలు జరగని పని. నంగా జాతి పరిగెత్తినట్లు సరాంగ్ మృగం కూడా పరిగెత్తలేదు......" లోగొంతుకతో సలహా యిచ్చి కనులు మూసుకున్నాడు.

ఆ సలహా షాడోకి నచ్చలేదు. ఒకసారి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత రెండో ఆలోచన చేయటం అతనికి ఏనాడూ అలవాటు లేదు.

ఎర్రగా కాలింది నెదడు మీద జింక. దాని చుట్టూ గుమిగూడి వున్న ఆటవికులతో ఒక విధమైన ఆత్రుత ప్రస్ఫుటం కాసాగింది. అంతవరకూ దూర దూరంగా నిలబడి వున్న ఆడవాళ్ళు లొట్టలు వేస్తూ ముందుకు రాసాగారు. వారి కంటే ముందుగానే నెగడును చుట్టుముట్టారు పిల్లలు. ముక్కులు ఎగబీలుస్తూ, నోళ్ళు తెరుచుకొని జింక వంకే చూడటం మొదలు పెట్టారు.

మత్తును కలిగించే ఆయుధాలను ఎన్నింటిని కలిగి వున్నా, అడవి జంతువుల కంటే వేగంగా పరిగెత్తగలరని ఎంత పేరు వున్నా, నాగరికత అనే మాటకు అర్థం తెలియని ఆటవికులు వాళ్ళు. నెగడు మీది జింకను పంచుకోవటంలో ఏదో ఒక తగదా రాకపోదు......

తన కదలికలు వాళ్ళ కంట పడితే కొంపలు అంటుకుంటాయని తెలిసి కూడా, లెక్క చేయకుండా ప్రక్కకు దొర్లి తన వెనుక వున్న ఆటవికుడిని సమీపించాడు షాడో.

"గెట్ రెడీ బ్రదర్ పారిపోవాలనే కోరిక నీకు వుంటే..... నాతో పాటు పరిగెత్తటానికి సిద్ధంగా వుండు. ఏ క్షణంలోనైనా మనకు మంచి అవకాశం లభించవచ్చు......." అంటూ అతన్ని హెచ్చరించి గుహ ముందుకు చూశాడు.

నెగడు మీది జింకను యివతలికి లాగారు ఆటవికులు. రాతితో తయారు చేయబడిన కత్తుల వంటి ఆయుధాలతో దాన్ని ముక్కలు ముక్కలుగా విభజించటం ప్రారంభం అయింది.

ఆ పైన ఆత్రుతను అణుచుకోలేక పోయాడు ఒక కుర్రవాడు. కంటికి కనిపించనంత వేగంగా ముందుకు కదిలి, ముక్కలుగా చేయబడిన జింక తొడను గట్టిగా పట్టుకున్నాడు.

విపరీతమైన కోపంతో వెర్రిగా అరిచి లాగిపెట్టి కొట్టాడు ఒక ఆటవికుడు. ఆ దెబ్బకు తల్లక్రిందులుగా గాలిలోకి లేచి ఆడవాళ్ళ మధ్యలో పడ్డాడు కుర్రవాడు. చూపులన్నిటినీ జింక మీదే కేంద్రీకరించి వున్న ఆడవాళ్ళు, ఎదురు చూడని ఆ సంఘటనకు బెదిరి గావుకేకలు పెట్టారు. ఒకరి నొకరు నెట్టుకుంటూ ప్రక్కలకు పరిగెత్తారు.

"కమాన్ బ్రదర్..... కమాన్ ......." అని తన తోటి బందీని హెచ్చరిస్తూ మెరుపులా లేచి నిలబడ్డాడు షాడో. గుహలో కనిపించిన లావు పాటి కొండ రాళ్ళను రెండింటిని అందుకుంటూ గుహ ముందు భాగంలోకి పరుగు తీశాడు.

అతని మాట అర్థం కాకపోయినా, వుద్దేశ్యం ఏమిటో ఆ అటవికుడికి అర్థం అయింది. కదలికల్లో ఎటువంటి తడబాటు లేకుండా షాడోతో పాటు లేచాడతను. తను కూడా రెండు కొండరాళ్ళను అందుకొని అతన్ని అనుసరించాడు.

నెగడు ముందున్న యిద్దరు లావుపాటి ఆటవికుల తలలకేసి గురిపెట్టి తన చేతుల్లోని రాళ్ళను విసిరేశాడు షాడో. గుండెలు జలదరించేలా కేకలు పెడుతూ వారి మధ్యలోకి దూరాడు.

కొండ రాళ్ళ దెబ్బకు ఉక్కిరి బిక్కిరైపోయి సరిగ్గా నెగడు మధ్యలోకి దొర్లారు ఆ ఆటవికులు యిద్దరూ. మంటల దెబ్బకు తారెత్తి పోయి గుండెలు పగిలిపోయేలా అరుస్తూ గిలగిలా కొట్టుకున్నాడు.

అదిరిపడి అటే చూస్తున్న మరో యిద్దర్ని రాళ్ళు విసిరి నెగడులోకి నెట్టాడు షాడో సహచరుడు. షాడో కంటే వికృతంగా అరుస్తూ ఆ గుంపులో జొరబడ్డాడు.

జరుగుతున్నదేమిటో తెలుసుకోవాలనే ఆలోచన అక్కడి వారెవరికీ లేకపోయింది. కీచు కీచుగా అరుస్త చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకుల్లా తలా ఒక దిక్కుకు చెల్లా చెదరు అయ్యారు.

అడ్డు వచ్చిన యిద్దరు ఆటవికుల్ని ముక్కలు పగలి పోయేలా ముఖాలమీద గుద్ది, సూటిగా ముందుగా పరుగు తీశాడు షాడో. కొండ గుహకు ఫర్లాంగు దూరంలో వున్న పొదల్ని సమీపించి, వెనుకా ముందు చూడకుండా వాటిలో దూరాడు.

“అయ్యాయ్యో! అటు పోవద్దు..... ప్రక్కకు పోయి బుటాంగ్ నదిని చేరుకుందాం..... నంగా జాతి వాళ్ళు బుటాంగ్ నది దగ్గిరికి సామాన్యంగా రారు......” అంటూ ఆందోళనగా అతని చేయి పట్టుకుని, ప్రక్కకు లాగాడు అతని సహచరుడు.

చటుక్కున ఆగిపోయాడు షాడో.

జరిగిందేమిటో గ్రహించి ఆగ్రహంతో ఆకాశం అదిరి పోయేలా కేకలు పెడుతూ వస్తున్నారు నంగా జాతి వాళ్ళు. వాళ్ళ చేతికి మరోసారి దొరక్కుండా వుండాలంటే, వాళ్ళ వేగాన్ని తగ్గించే ఆ ముళ్ళ పొదల్లోనే పరుగులు తీయటమంత మంచి పని మరొకటి లేదు. ఆ విషయం తెలియక దారి మార్చమంటున్నాడా తన సహచరుడు??

అతని కనుల్లో ప్రతిఫలించిన ప్రశ్నార్థకాన్ని గమనించి తల అడ్డం తిప్పాడు ఆ ఆటవికుడు.

“ముందుకు పోతే నంగా జాతి కంటే భయంకరమైన మెరుపు మనుష్యుల గూడెం ఎదురవుతుంది. కనిపించిన వాళ్ళని కనిపించినట్లు మెరుపులతో కాల్చి చంపేస్తారు వాళ్ళు. వాళ్ళ చేతికి చిక్కటం కంటే నంగా గాళ్ళకే దొరకటం మంచిది.....” అన్నాడు అతని చేతిని వదలకుండా గట్టిగా పట్టుకొని ప్రక్కకు లాగుతూ.

ముఖం మీద ఎవరో లాగిపెట్టి కొట్టినట్లు వులిక్కిపడి అతని ముఖంలోకి చూశాడు షాడో.

మెరుపులతో యుద్ధం చేసే మనుష్యులా ?

“అవును..... ఇక్కడికి కొద్ది దూరంలోనే నిప్పులు కక్కే పర్వతం ఒకటి వుంది. దాని మొదట్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ వుంటారు వాళ్ళు...... వాళ్ళ మాటలు, చేతలు, అన్నీ చాలా విచిత్రంగా వుంటాయి....... అతని ముఖంలోని భావాల్ని గమనించి మరోసారి తనకు తెలిసిన విషయాల్ని వెల్లడించాడు ఆటవికుడు.

అణగారిపోతున్న ఆశలు ఒక్కసారిగా తల ఎత్తినట్లయి, అతని భుజం మీద బలంగా చరిచాడు షాడో.

"థేంక్యూ వెరీమచ్ బ్రదర్...... ఆ మెరుపు మనుష్యుల కోసమే నేను ఈ అరణ్యంలోకి వచ్చాను..... ఎలాగైనా సరే వాళ్ళని నేను చూసి తీరాలి.....నీ యిష్టం వచ్చిన వైపు పారిపోయి ప్రాణాలు దక్కించుకో...... " అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా ముందుకే పరుగు తీశాడు.

అతను పోతున్న దిశకు చూసి, తల బరుక్కున్నాడు ఆ ఆటవికుడు. కేకలు పెడుతూ పొదల దగ్గిర్లోకి వచ్చేసిన నంగా జాతి వాళ్ళను గమనించే సరికి సడన్‌గా అంతం అయి పోయాయి అతని ఆలోచనలు.

"నంగా జాతిని యింత సులువుగా బోల్తా కొట్టించ గలిగిన వాళ్ళని నేను యింతవరకూ చూడలేదు..... నీ వంటి తెలివిగల మనిషి మా అరణ్యాలలో ఎవరూ లేరు. నీతో యింకా కొన్ని రోజులు తిరిగితే నాకు కూడా నీ తెంపరితనం, తెలివి తేటలు వంట బడతాయి. నిన్ను వదిలిపెట్టాను. నీడలా నీ వెంటే వుంటాను. " అనుకుంటూ షాడో పోయిన దిక్కుకే పరుగులు తీసి పది నిమిషాల్లో అతన్ని కలుసుకున్నాడు.

అందినట్లే అంది దూరమైపోతున్న వారిద్దర్నీ చూసి మరింత ఆగ్రహంతో కంపించిపోతూ వెన్నుంటూరు నంగా జాతి వాళ్ళు. వెదురు ముళ్ళను సిద్ధంగా పట్టుకుని వెంట బడ్డారు.

## 16

"చందీతో నీ పెళ్ళి జరిపించే బాధ్యత మాది....... అందుకు ప్రతిఫలంగా మేము యిక్కడి నుంచి పారిపోయే మార్గం చూపిస్తావా??" భయంభయంగా చూస్తూ తమ దగ్గిరికి వచ్చిన చందీ ప్రియుడితో అన్నాడు శ్రీకర్.

తల బరుక్కుంటూ చుట్టూ చూసి గాఢంగా నిట్టూర్చాడు ఆ కుర్రాడు. బలమైన కాపలా వుంటుంది గూడెం చుట్టూ. నాయకుడి ఆజ్ఞ లేందే గూడెపు వాళ్ళు కూడా బయటికి పోవటానికి వీలు లేదు. బానిసలుగా వుండవలసిన బందీలు బయట పడటం అంటే మాటలు కాదు...... వాళ్ళని తప్పించినందుకు సజీవంగా మంటల్లో పడేసి చంపేస్తాడు నాయకుడు.

"బాగా ఆలోచించుకో బ్రదర్...... ఇందులో బలవంతం ఏమీ లేదు.... చందీ నీకు కావాలంటే మా కోరిక తీరాలి...... రెండో కంటి వాడికి తెలియకుండా నీ పని పూర్తి చేసి మా దారిన మేము జారుకుంటాము...." అతని మనస్సులోని భావాల్ని గమనించి మరింత ఆశ పెట్టాడు శ్రీకర్.

అప్పటికీ తెగలేదు ఆ కుర్రవాడి ఆలోచన. అలాగేనని తల వూపటానికి ధైర్యం చాలలేదు.

అదే సమయంలో భయంతో వణికిపోతూ అక్కడికి పరిగెత్తుకు వచ్చింది చందీ.

"నాయకుడి బావమరిది యిటే వస్తున్నాడు..... నిన్ను యిక్కడ చూశాడంటే కాళ్ళు చేతులు విరిచిపారేస్తాడు.... పారిపో.... పారిపోయి ప్రాణాలు

కాపాడుకో....'' అంటూ ఆ కుర్రవాడి చేయి పట్టుకొని తమ గుడిశె వెనుక వున్న పొదల్లోకి నెట్టటానికి ప్రయత్నించింది.

అనుకోకుండా లభించిన ఆ అవకాశాన్ని చేజార్చుకోకుండా తన సర్వశక్తుల్నీ కేంద్రీకరించుకొని ఆ కుర్రాడి భయం మీద ఎటాక్ చేశాడు శ్రీకర్.

''ప్రేమించిన ప్రియురాల్ని తనివితీరా చూసుకోవటానికి కూడా వీలులేని జన్మ వ్యర్థం బ్రదర్.... ఒకళ్ళకు భయపడుతూ బ్రతికే కంటే మంటల్లో దూకి చావటం చాలా మంచిది. బ్రహ్మాండమైన అవకాశం యిది...... ఈ రోజుతో నాయకుడి బావమరిది పీడ వదిలిపోతుంది...... నువ్వు ఒక్కసారి తల వూపితే చాలు వాడి కీళ్ళు తొలిగించేస్తాం.......'' అన్నాడు మాటలు తూచి తూచి వాడుతూ.

సెటిల్ అయిపోయింది కుర్రవాడి ఆలోచన.

''చందీతో నా పెళ్ళి జరగాలి..... అందుకు ఏమైనా చేస్తాను...... నాయకుడి బావమరిదిని నా దారి నుంచి తొలగించిన మరుక్షణం మీకు పారిపోయే మార్గాన్ని చూపిస్తాను ........'' అన్నాడు.

ఎగిరి గంతులు వేసి తన వీపును తనే చరుచుకొని అభినందించుకోవాలన్న కోరిక శ్రీకర్ మనస్సులో అడుగు పెట్టింది. ఆ పని చేయటానికి కాళ్ళు చేతులకు కట్టి వున్న తాళ్ళు అడ్డు వచ్చాయి.

''ఆల్ రైట్..... నువ్వు పోయి ఆ బావమరిది గాడిని పొదల్లోకి పిలువ్ చందీ..... కాస్సేపు ప్రేమిస్తున్నట్లు నటించు....'' అంటూ అర్జంటుగా చందీని హెచ్చరించి, తమ బంధనాలను వదిలించమని కుర్రాడికి సైగ చేశాడు.

తూనీగలా ఎగురుకుంటూ అవతలికి పోయింది చందీ. అప్పుడే అక్కడికి వస్తున్న ఒక బ్రహ్మాండమైన పర్సనాలిటీని ఓర చూపులతో పొదల వైపు మరలించింది.

ఆ దృశ్యాన్ని చూసి విపరీతమైన బాధతో కుమిలిపోతూ, శ్రీకర్ వాసుల బంధనాలను సడలించాడు కుర్రవాడు.

“నువ్వు యిక్కడే వుండు........” ఎవరైనా యిటుగా వస్తే కాలక్షేపానికి పొదల్లోకి పోయామని చెప్పు...... ” అంటూ అతనికి చెప్పి, తిమ్మిరెక్కిన చేతుల్ని సవరించుకుంటూ పొదల్లోకి దారి తీశాడు శ్రీకర్.

“ఇప్పుడు మనం ఏం చేయాలి?” ఆ సంభాషణ ఎంత మాత్రమూ అర్థంకాని వాసు అయోమయంగా అడిగాడు అతని వెనుక అడుగులు వేస్తూ.

“తినటం, నిద్రపోవటం, సి.ఐ.బి. బిల్డింగుల చుట్టూ కాపలా తిరగటం తప్ప నీకేమీ అర్థంకాదు వాసూ.... కాస్త నలుగురిలోను తిరిగి నాగరికత అలవరుచుకోకపోతే జీవితంలో ఎలా పైకి వస్తావ్? మాటలు అర్థం కాకపోయినా చేతలు తెలియటంలా?” ఒక పొద ముందు ఆగి ముందుకు చూపిస్తూ అతనికి జ్ఞానబోధ చేశాడు శ్రీకర్.

ముందుకు చూసిన వాసు ముఖం ఎర్రగా కందిపోయింది. విపరీతమైన కోపంతో, పటపటలాడుతూ పైకి ఉబికాయి అతని భుజపు కండరాలు.

దట్టంగా ఉన్న ఒక పొద దగ్గిర చందీ భుజాలు పట్టుకొని బలవంతం చేస్తున్నాడు నాయకుడి బావమరిది. దొరక్క దొరక్క దొరికిన ఆ ఛాన్సును వదిలిపెట్టటం ఇష్టం లేనట్లుంది అతని వాలకం.

నిశ్శబ్దంగా ఎదిరిస్తోంది చందీ, కన్నీరు నిండిన కళ్ళతో శ్రీకర్ వాసుల కోసం ఎదురు చూస్తోంది.

"రేయ్ దొంగనాయాల..... నిన్ను నిలువునా మడత పెట్టి వుండ చుట్టక పోతే అప్పుడు అడుగు......." అని రంకె వేయ బోయిన వాసు నోటిని చటుక్కున మూసి తల విదిలించాడు శ్రీకర్.

"నిశబ్దంగా జరిగిపోవాలి వాసూ..... విరాట పర్వంలో కీచకుడికి పట్టిన గతే వాడికి కూడా పట్టాలి...... పొరపాటున కూడా వాడి నోటి నుంచి అరుపు వెలువడకూడదు....." అని హెచ్చరిస్తూ ముందుకు నెట్టాడు.

మరికొన్ని మాటలు చెప్పించుకోవాల్సిన అవసరం లేకుండా బుల్‌డోజర్‌లా పరుగులు తీసి నాయకుడి బావమరిది మీద పడ్డాడు వాసు. అతని మెడను పట్టుకొని బర్రున యివతలికి యీడ్చి, మెడ మీద లాగి పెట్టి గుద్దాడు.

ఆశ్చర్యంతో మ్రాన్పడిపోతూ చందీని వదిలేసి అతని వైపు తిరిగాడు నాయకుడి బావమరిది. వాసును గుర్తించేసరికి విపరీతమైన ఆగ్రహం అతన్ని ఆవరించుకుంది.

"నోటిని మూసేయ్ వాసూ..... వాడు గూడెం దద్దరిల్లి పోయేటట్లు అరవబోతున్నాడు. " వెంటనే ప్రాంప్ట్ చేశాడు శ్రీకర్.

మర్రిచెట్టు మొదలు వంటి చేతిని అతని మెడ చుట్టూ చుట్టి మెలిక వేశాడు వాసు. రెండో చేత్తో గుండెల మీద గుద్ది అమాంతం గాలిలోకి లేపాడు.

బయటికి రావాల్సిన అరుపు మధ్యలోనే ఆగిపోగా, దెబ్బ తిన్న అడవి పందిలా బుసలు కొట్టాడు నాయకుడి బావమరిది. ఉన్నట్లుండి వాసు చేతుల్ని వదిలించి కొట్టి, ఎగిరి తన్నాడు గుండెల మీద.

పది టన్నుల బండరాయి వచ్చి మీద పడినట్లు బాధ పడుతూ వెనక్కి తూలి ఒక పొదలో పడిపోయాడు వాసు.

అదే వూపులో ఎగిరి, తను కూడా ఆ పొదలో పడ్డాడు నాయకుడి బావమరిది.

ఆ పైన చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు శ్రీకర్. పొదలో నుంచి వినవస్తున్న పిడిగుద్దుల శబ్దాలను వింటూ, బాధపూరితమైన నిట్టూర్పుల్ని ఆలకిస్తూ రెండు నిముషాలు ఓపికపట్టాడు.

రెండు నిముషాల తరువాత పొదలో నుంచి బయటికి వచ్చాడు వాసు. ముఖం మీది నుంచి కారుతున్న నెత్తురు ధారల్ని ఎడమచేత్తో తుడుచుకుంటూ, నిర్జీవంగా పడి పోయిన నాయకుడి బావమరిదిని లాక్కువచ్చి శ్రీకర్ ముందు వదిలాడు.

"వీడి పని అయిపోయింది శ్రీకర్....... శరీరంలో వున్న ఎముకలన్నీ విరిగిపోయాయి. ఇంకో నాలుగైదు గంటల దాకా మెలకువ రాదు." అంటూ శ్రీకర్ భుజం తట్టాడు.

అప్పుడు కళ్లు తెరిచి సంతృప్తిగా తల వూపాడు శ్రీకర్.

అదే సమయంలో పరిగెత్తుకు వచ్చింది చందీ.

“నాయకుడు నిద్ర లేచాడు....... మీ కోసం మనుష్యులు వస్తున్నారు. ” “ అంటూ హెచ్చరించింది.

అటునుంచి అటే పారిపోవాలన్న కోరికను బలవంతంగా అదుముకొని గుడిశె దగ్గిరికి వచ్చేశారు స్నేహితులు యిద్దరూ. చెట్టుక్రింద కూర్చుని చందీ సహాయంతో కాళ్ళు చేతులకు చర్మపు తాళ్ళను బిగించుకోవటం, నాయకుడి మనుష్యులు అక్కడికి రావటం ఒకేసారి జరిగింది.

జాలి, దయ అనే మాటలకు అర్థం తెలియనట్లు, వాళ్ళిద్దర్నీ విసురుగా లేపి నిలబెట్టారు నాయకుడి దూతలు. చర్మపు తాళ్ళని కత్తులతో తెంపి రఫ్‌గా నెట్టుకుంటూ గూడెం మధ్యలోకి లాక్కుపోయారు.

ఎర్రబడిన కనులతో క్రూరంగా చూస్తూ ఒక బండరాయి మీద కూర్చుని వున్నాడు నిద్ర లేచిన నాయకుడు. కాలీ కాలని మాంసపు ముక్కల్ని అదే పనిగా నోటిలో కుక్కుకుని నమల కుండా మ్రింగేస్తున్నాడు.

“ఇప్పుడు చెప్పండి..... ఏమిటి మీ కథ?” బందీలనిద్దర్నీ చూడగానే అడిగేశాడు.

“చెప్పటానికి ఏమీ మిగలలేదు...... మీ వంటి మహా వీరుల మధ్య బానిసలుగా బ్రతకటం నిజంగా మా అదృష్టం. ఏలిన వారు కాస్త దయతో చూస్తే మీ సేవలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తాం.” వినయాతి వినయంగా సమాధానం యిచ్చాడు శ్రీకర్.

మాంసం ముక్కల్ని తినటం ఒక క్షణం ఆపి మెచ్చుకోలుగా తల వూపాడు నాయకుడు.

"నువ్వు ఏ జాతి వాడివో నాకు తెలియదు గాని, నీలాగా మాట్లాడే మనిషిని నేను యింతవరకూ చూడలేదు. నిన్ను నా గుమ్మం ముందు కాపలాకి వుంచుకుంటాను. నీ జతగాడిని ఏం చేయాలో రేపు నిద్ర లేచిన తర్వాత ఆలోచిస్తాను." అంటూ మరోసారి మాంసం ముక్కల్ని అందుకో బోతుండగా , అక్కడ గుమికూడి వున్న వారిలో చెలరేగిందొక కలకలం.

"అన్యాయం...... మోసం...... ఆ బందీలను చిత్రవధ చేయాలి...... వాళ్ళు యిద్దరూ కలిసి నన్ను వెన్నుపోటు పొడిచారు.... నా చేతులు విరిచేశారు." అని అరుస్తూ పరుగు పరుగున అక్కడకి వచ్చి నాయకుడి ముందు పడిపోయాడు అతని బావమరిది.

నాలుగైదు గంటలదాకా స్పృహ రాదని అనుకున్న మనిషి, హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షం అయ్యేసరికి బ్రాన్పడి పోయారు వాసు, శ్రీకర్.

"ఇదంతా ఆ చందీ మూలకంగానే వచ్చింది.... హడావుడిగా మనం వచ్చేస్తున్నామని తెలిసి కూడా, వీడిని ఒక కంట కనిపెట్టుకొని వుండనక్కర్లా? కళ్ళు తెరిచీ తెరవగానే కట్టె పేడుతో నెత్తిమీద ఒకటి తగిలించినట్లయితే, యిక్కడికి వచ్చేవాడు కాదు గదా!! ఇప్పుడు మనం ఏం చేయాలి?" ఆందోళనగా అంటూ చుట్టూ చూశాడు శ్రీకర్.

నాయకుడి ముఖంలో రకరకాల భావాలు కదలాడుతున్నాయి.

అక్కడ వున్న ఆటవికుల ముఖాలలో క్రోధ ఛాయలు పొడ చూపుతున్నాయి. ఏ మాత్రం ఆలస్యం చేసినా, తమ ప్రాణాలు దక్కవని అర్థం అయి గిరుక్కున ప్రక్కకు తిరిగాడు వాసు.

“పట్టుకోండి....వాళ్ళని పట్టుకొని నిలువునా నరకండి ......” గూడెం దద్దరిల్లి పోయేలా ఖంగున ఆర్డర్ యిచ్చాడు నాయకుడు.

గొల్లున అరుస్తూ ముందుకు దూకబోయిన ఇద్దరు ఆటవికుల మెడలు పట్టుకొని గాలిలోకి విసిరేశాడు వాసు. దారికి అడ్డం వచ్చిన మరో యిద్దర్నీ పిడికిళ్ళతో ప్రక్కకు నెట్టి పిక్కబలం చూపించాడు శ్రీకర్.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయింది ఆ సంఘటన ఆటవికులు తమ ఆశ్చర్యం నుంచి తేరుకునే సరికి, గూడెం మధ్య భాగంలో నుంచి దక్షిణ దిశలో వున్న గుట్టల వైపు పరిగెత్తారు వాళ్ళిద్దరూ.

“పట్టుకోండి........ పట్టుకోండి.......” అని గావుకేకలు పెడుతూ, వాళ్ళని అనుసరించారు గూడెపు జనం.

ఎదురుగా కనిపిస్తున్న గుట్టల వెనుక నాయకుడి మనుష్యులు వుంటారని శ్రీకర్‌కి తెలుసు. గూడెంలో నుంచి వినవస్తున్న అరుపుల్ని వాళ్ళు ఆలకిస్తే తమకు రోజులు చెల్లిపోయినట్లే అని కూడా తెలుసు.

కాని ఆ పరిస్థితుల్లో అంతకన్నా చేయగలిగింది ఏముంది ?

ఉన్నట్లుండి అతని చెవికి చేరిందొక పిలుపు......

తను పొరపాటు పడుతున్నాడేమో అని అనుమానం వచ్చి పరుగు ఆపకుండానే అటువైపు చూశాడతను.

రెండు నిలువుల ఎత్తున వున్న పెద్ద బండరాయి వెనుక నించి, అతన్ని పిలుస్తోంది చందీ.....

“పారిపోయే మార్గం అటు కాదు.....యిటువైపు వుంది...... నా జత గాడు అక్కడ మీ కోసం ఎదురు చూస్తున్నాడు.” శ్రీకర్ తన వైపు చూడగానే ఎడమ చేతి దిశకు చేయి చూపిస్తూ గబగబా...... చెప్పి బండరాళ్ళను చాటు చేసుకొని పారిపోయిందామె.

ఒక్క క్షణం పాటు పరుగును ఆపి, ఆమె చూపించిన దిశకు చూశాడు శ్రీకర్. బ్రహ్మాండమైన పల్లపు ప్రదేశం కనిపిస్తోంది అక్కడ...... ఆ ప్రదేశాన్ని చేరుకునే లోపల వెనుక వస్తున్న వాళ్ళు తమను కలుసుకోవటం గారెంటీ.......

శ్రీకర్ మనస్సులోని ఆలోచనలను గమనించాడు వాసు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా గుండెల నిండా వూపిరి పీల్చుకొని, దగ్గిర్లో వున్న పెద్ద బండరాయిని అమాంతం గాలిలోకి ఎత్తి వెనక్కి విసిరేశాడు.

పది మంది మనుష్యులు ఎత్తినా కదలనటు వంటి బరువైన రాయి అది. గింగిరాలు తిరుగుతూ పోయి పరుగులు తీస్తూ వస్తున్న ఆటవికుల ముందు పడింది.

అదిరిపడి వెనక్కి దూకారు వాళ్ళందరూ..... కీచుగా అరుస్తూ, తలా ఒక దిక్కుకు పరుగులు తీశారు .

వెంట వెంటనే విసిరేశాడు వాసు మరో రెండు బండలని. చేతులు దులుపుకుంటూ శ్రీకర్ వెనుక అడుగులు వేశాడు.

రెండు నిముషాల తర్వాత చూపించిన పల్లపు ప్రదేశంలో అడుగు పెట్టారు వారిద్దరూ..... ఆ ప్రదేశం మధ్యలో కనిపిస్తోంది బ్రహ్మాండమైన బిల ద్వారం

ఒకటి. దాని ముందు నిలబడి వున్న చందీ జతగాడు వారిద్దర్నీ చూడగానే తేలికగా నిట్టూర్చి లోపలికి చేయి చూపించాడు.

"ఎప్పుడో పురాతన కాలంలో అరణ్య దేవతలు ఏర్పాటు చేసుకున్న సొరంగం యిది. ఇక్కడికి కొద్ది దూరంలోనే వున్న నిప్పుల పర్వతం మధ్యలోకి తీసుకుపోతుందని మా తాత చెబుతూ వుండేవాడు. ఆ మాట్లలో నిజం ఎంతుందో నాకు తెలియదు గాని, యిప్పుడు మీరు చిక్కుకున్న ప్రమాదంలో నుంచి బయట పడటానికి యింత కంటే మంచి మార్గం మరొకటి లేదు." అంటూ వారి సమాధానం కోసం ఎదురు చూడకుండా, దూరంగా పరుగు తీసి, జుట్టు పీక్కుంటూ కేకలు ప్రారంభించాడు.

"రండి.... రండి.....బందీలు పారిపోతున్నారు..... పారిపోతున్నారు." అంటూ దూరంలో వున్న గూడెపు జనాన్ని అటు కేసి పిలిచాడు.

క్రింద కనిపించిన పలుకు రాయి నొకదాన్ని అందుకొని అతని బుర్ర పగిలి పోయేటట్లు కొడదామన్న ఆలోచనను విరమించుకొని సొరంగంలోకి దూరాడు శ్రీకర్. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటిలో, తడుముకుంటూ ముందుకు అడుగులు వేశాడు.

కుర్రవాడి అరుపులను ఆలకించి వేటకుక్కల్లా సొరంగ ద్వారం ముందు గుమికూడారు గూడెపు జనం. లోపలికి అడుగు పెట్టే ధైర్యం మాత్రం వారెవరికీ లేకపోయింది. అరగంట పాటు అక్కడే తచ్చట్లాడి, లోపలికి పోయిన వాళ్ళు ఒక వేళ బయటికి వస్తే పట్టుకోవటానికి పది మందిని అక్కడ కాపలా పెట్టి ఒకరొకరుగా వెను తిరిగారు వారందరూ.

# 17

"వచ్చేస్తున్నారు....... నంగా గాళ్ళు దగ్గిరికి వచ్చేస్తున్నారు." ఆయాసంతో ఉక్కిరి, బిక్కిరి అవుతూ షాడోని హెచ్చరించాడు అతని వెనుకే పరుగులు తీస్తున్న ఆటవికుడు.

పరుగు ఆపకుండా భుజం మీది నుంచి వెనక్కి చూశాడు షాడో. వంద గజాల దూరంలో వున్నారు నంగా జాతి వాళ్ళు. మరో ఇరవై గజాల దూరం రాగానే వెదురు ముళ్ళని వదలటానికి సిద్ధంగా వున్నారు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో చూపులు తిప్పుకుని పరిగెత్తటం మీదే దృష్టిని కేంద్రీకరించాడతను.

ఆటవికుడు అన్న మాటల్లో అసత్యం ఏమీ లేదు........ పరుగు పందెంలో నంగా జాతిని బీట్ చేయటం అసంభవం. కత్తుల్లా శరీరాన్ని చీలుస్తున్న ముళ్ళ పొదలు వాళ్ళ వేగాన్ని అడ్డుకోలేక పోతున్నాయి..... అలుపు ఆయాసం అనే మాటలకు అర్థం తెలియనట్లు అలా వస్తూనే వున్నారు వాళ్ళు. మరో రెండు మూడు నిముషాల్లో అంతం అయిపోతుంది వారికి షాడోకి వున్న మధ్య దూరం.

గుహలో నుంచి పారిపోయిరావటం బుద్ధి తక్కువ పని అయిందేమో అనుకుంటూ శరీరంలో వున్న శక్తినంతా పాదాల్లోకి తెచ్చుకుని పరుగులు తీశాడు షాడో. సరిగ్గా నిముషం తరువాత అతనికి ఎదురయింది. పెద్ద చెట్లతోపు. దాన్ని సమీపిస్తూనే అప్రయత్నంగా అదిరిపడ్డాడతను.

"ఆలోచిస్తావేమిటి నేస్తం? ఆలస్యం చేస్తే ప్రాణాలు కోల్పోతాం!" అంటూ అతన్ని తొందర చేసి చెట్ల తోపులోకి దూరిపోయాడు అతని సహచరుడు.

అతని చేతిని పట్టుకొని రఫ్‌గా వెనక్కి లాగాడు షాడో. అమూల్యమైన సమయం వృధా అయిపోతుందని తెలిసి కూడా లెక్క చేయకుండా ప్రక్కకు తిరిగి ముళ్ళ పొదల చాటుకే పరుగు తీశాడు.

"నీకు పిచ్చి పట్టింది. వెదురు ముళ్ళలోని విషం నీకు మతిని పోగొట్టింది." ఆందోళనతో కంపించిపోతూ అతని చేతిని వదిలించుకుని వెనక్కి రాబోయాడు ఆటవికుడు.

ఫెడీమని అతని మెడ మీద కొట్టాడు షాడో.

"పిచ్చి వేషాలు వేస్తే ప్రాణాలు తీస్తాను. మర్యాదగా నేను చెప్పినట్లు చేయకపోతే నేనే స్వయంగా తీసుకు పోయి నంగాగాళ్ళకు అప్పచెపుతాను" అంటూ క్రింద పడేసి యీడ్చుకుంటూ ఒక పొద చాటుకు తీసుకు పోయి, తను కూడా మోకరించి కూర్చున్నాడు.

నిముషం కూడా గడవక ముందే పగబట్టిన పాముల్లా చెట్ల తోపు ముందుకు వచ్చేశారు నంగాజాతి వాళ్ళు. ఒక్క క్షణం పరుగును ఆపి అటూ ఇటూ చూశారు వారిలో కొందరు. ఉన్నట్లుండి...... బిగ్గిరిగా అరిచి, షాడో దాగుకున్న పొదవైపు చేయి చూపించాడు ఒకతను.

విపరీతమైన దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయాయి షాడో పెదవులు. తన అంచనా పొరపాటు అయితే ప్రాణాలు పోవటం తప్పని సరి..... పొరపాటు కాకపోతే –

ఆ మాటలు అనుకుంటుండగానే చెట్లతోపులో నుంచి యివతలకి వచ్చారు అనేక మంది నాగరికులు. అనుకోకుండా ఎదురైన ఆటవికుల్ని చూడగానే, తమ వద్ద వున్న ఆయుధాల్ని ఎత్తి వారికేసి గురిపెట్టారు.

కీసర బాసరగా అరుస్తూ తలా ఒక ప్రక్కకు బెదిరి పోయారు నంగా జాతి నరమాంస భక్షకులు. బరిశెల్ని ఎత్తి ముందుకు విసిరారు కొందరు. వెదురు ముళ్ళను వదిలే గొట్టాల్ని ముందుకు జాచారు మరికొందరు.

మనసులోని ఆందోళన మటుమాయం అయిపోగా, చిరునవ్వు నవ్వుతూ పొదచాటునుంచి లేచాడు షాడో.

పట్టిన పట్టు వదిలిపెట్టే మనిషి కాదు ఝరియా నుంచి వచ్చిన లాజరస్. అతనితో పాటు సమానమైన తెలివి తేటలను ప్రదర్శించి, తాత్కాలికమైన సంధిని కుదుర్చుకున్నారు పాకిస్థాన్ సీక్రెట్ సొసైటీ వాళ్ళు. నేర్పుగా షాడో జాడల్ని తెలుసుకొని గుంపుగా సారికన్ ఐలాండ్ లో అడుగు పెట్టారు.

“చంపండి..... వాళ్ళని చంపండి......” అని తన అనుచరులను హెచ్చరిస్తూ రివాల్వర్‌తో ఇద్దరు నంగాలను పడగొట్టేశాడు లాజరస్.

తన దగ్గిర వున్న సబ్ మెషీన్‌గన్‌తో మరో నలుగుర్ని మట్టి తినిపించింది మేడమ్.

తమ వెదురు ముళ్ళకంటే ప్రమాదకరమైన ఆయుధాల్ని చూడగానే నంగా రాక్షసుల ధైర్యం దిగజారిపోయింది. పడి పోయిన తమ వారిని అక్కడే వదిలేసి పిక్కబలం చూపిస్తున్నారు వాళ్ళు.

“వదిలి పెట్టద్దు. వాళ్ళని వదిలి పెడితే మరి కొంత మందిని వెంట బెట్టుకొని వస్తారు...... అందరినీ హతమార్చి తీరాల్సిందే.......” అని తన అనుచరులను హెచ్చరిస్తూ ముళ్ళ పొదల్లోకి పరుగు తీశాడు లాజరస్. అతన్ని క్లోజ్‌గా ఫాలో అయింది మేడమ్.

వాళ్ళందరూ కను చూపు మేర దాటి పోయే దాకా ఆగి, మెల్లిగా చెట్ల తోపులోకి అడుగు పెట్టాడు షాడో.

“నిప్పులు కక్కే పర్వతం ఈ చెట్ల అవతలి ప్రక్కనే వుంది...... మెరుపుల్ని పట్టుకుని తిరిగే తండా మనల్ని చూసిందంటే ప్రాణాలు పోతాయి” భయం భయంగా అతన్ని హెచ్చరించాడు అతని వెనుకే బయలు దేరిన ఆటవికుడు.

ఆ మాటలకు సమాధానం చెప్పకుండా ముందుకే అడుగులు వేశాడు షాడో.

అరగంట తర్వాత అతని ముందు ప్రత్యక్షం అయింది బ్రహ్మాండమైన అగ్ని పర్వతం ఒకటి. ఆకాశాన్ని అంటుకుంటున్నట్లున్న దాని శిఖరాన్ని చూస్తూ మరో పది నిముషాల తరువాత పెద్ద కొండలోయను సమీపించాడు.

లోయ ముఖద్వారంలో అడుగు పెట్టడానికి వీలు కానంత దట్టంగా పెరిగి వున్నాయి రకరకాల పొదలు. ఆ పొదల మధ్యలో కనపడీ కనపడనట్లు నిలిచి వుంది ఒక కాంక్రీట్ కట్టడం..... బరువైన రైఫిల్స్ పట్టుకొని కట్టడం ముందు కాపలా కాస్తున్న నలుగురు దృఢకాయులను గమనించగానే శరవేగంతో వెనక్కి జరిగి, ఒక రాతి బండ ప్రక్కన తల దాచుకున్నాడు.

"వాళ్ళను గురించే నేను చెప్పింది. వాళ్ళ కళ్ళ పడ్డామంటే మనల్ని చిత్రహింసలు పెట్టి చంపేస్తారు" ఆందోళన నిండిన కంఠంతో అతని చెవి దగ్గిర నోరు పెట్టి గుసగుస లాడాడు ఆటవికుడు.

ఈ సారి అతని హెచ్చరికను పెడ చెవిన పెట్టదలుచుకోలేదు షాడో.

చీకటి పడేవరకూ దూరంగా కాలక్షేపం చేసి నెమ్మదిగా కాంక్రీట్ కట్టడాన్ని చేరుకోవటం మంచిదనే ఉద్దేశ్యంతో, చల్లగా వెనక్కి జరిగి చెట్లతోపు వైపు అడుగులు వేశాడు.

పావుగంట తరువాత ఎందుకో జలదరించింది అతని శరీరం. జరుగ కూడనిదేదో జరుగబోతున్నట్లు అనిపించి, ఖంగారుగా చుట్టూ చూశాడు.

అదే అదనుగా ఒక పొద చాటు నుంచి లేచి అతని మీదికి లంఘించింది ఆహారం కోసం మాటు వేసి వున్న సరాంగ్ మృగం.

ఎదురు చూడని ఆ పరిణామానికి విస్తుపోయి అరక్షణం ఆలస్యంగా రియాక్ట్ అయినాడు షాడో. ఆ అరక్షణం లోను అతన్ని సమీపించి పంజా దెబ్బతో నేలమీదికి పడగొట్టిందా క్రూర మృగం. భయంకరంగా నోటిని తెరిచి అతని మెడ మీదికి వంగింది.

## 18

తన పని అయిపోయిందనే భావించాడు షాడో. ఆఖరి ప్రయత్నంగా ఎడమచేతిని సరాంగ్ మెడ చుట్ట ప్రక్కకు నెట్టాలని చూశాడు.

కుడి కాలిని ఎత్తి అతని చేతిమీద బలంగా కొట్టింది ఆ మృగం. ఎడమ పంజాను ప్రక్కకు జరిపి అతని గుండెల మీద బలంగా అదిమింది.

బరువైన కొండరాయి గుండెలమీద పడినట్లు స్తంభించి పోయింది షాడో వూపిరి. వాడి కాలి గోళ్ళు తగిలి రక్తసిక్తమై క్రిందికి వాలి పోయింది అతని చేయి.

డిస్పరేట్‌గా ప్రక్కకు దొర్లాడు షాడో. రెండు కాళ్ళను ఎత్తి దాని నడుము చుట్టూ మెలి వేశాడు.

మనిషి కంటే మిక్కుటమైన తెలివిని ప్రదర్శించే ఆ క్రూరమృగం క్షణంలో పదో వంతు కాలం ఖంగారు పడింది. వెనుక నుంచి ఎవరో ఎటాక్ చేస్తున్నారనుకొని తలను వెనక్కి తిప్పింది.

శరీరంలోని శక్తినంతా కుడి చేతిలోకి తెచ్చుకుంటూ పిడికిలి బిగించాడు షాడో. సరాంగ్ నడుము చుట్టూ చుట్టిన పాదాల్ని వదులు చేసి బలమంతా ప్రయోగించి గుద్దాడు దాని మెడ క్రింద.

గుండె నుంచి రక్తాన్ని మెదడుకు చేరవేసే రక్తనాళాలు వుండే ప్రదేశంలో పడింది అతను కొట్టిన దెబ్బ.

భీకరంగా అరిచింది సరాంగ్. నిట్ట నిలువుగా గాలిలోకి లేచి వెల్లకిలా పడింది నేలమీద. దానితో పాటే లేచి నిలబడ్డాడు షాడో. కుడి కాలుని అడ్డంగా తిప్పి ఫెడీమని తన్నాడు రొమ్ముమీద.

మరింత పెద్దగా గర్జించింది సరాంగ్. రెండుసార్లు నేలమీద దొర్లి లేచి నిలబడటానికి ప్రయత్నించింది. దానికి ఆ అవకాశం యివ్వకుండా చేతికి అందిన

పెద్ద కొండరాయిని తీసుకొని దాని తల మీద కలబడ్డాడు షాడో. అది అరిచే అరుపులకు బెదరకుండా యిష్టం వచ్చినట్లు బాది వదిలి పెట్టాడు.

రెండుసార్లు ప్రయత్నించింది అది లేచి నిలుచోవటానికి. తోకను నేలకేసి బాదుతూ, పంజాలతో గాలిని గుద్దుతూ గోల గోల చేసి, ఆఖరికి తల వాల్చేసింది.

ముఖం మీదికి జారుతున్న స్వేద బిందువుల్ని తుడుచుకుంటూ వెనక్కి జరిగాడు షాడో. పది అడుగుల దూరంలో వున్న ఒక బండమీద కూర్చుని గాయపడిన ఎడమ చేతి వైపు చూసుకున్నాడు.

అదే సమయంలో సన్నగా, కత్తిలా వున్న ఒక కొండరాయిని పట్టుకొని సరాంగ్ దగ్గిరికి పరుగు తీశాడు. అంత వరకూ శిలా విగ్రహంలా నిలబడి ఆ పోరాటాన్ని చూస్తున్న ఆటవికుడు.

అతని ఉద్దేశ్యం ఏమిటో అర్థం అయ్యేసరికి ఎందుకు పోయింది షాడో కంఠం.

"మైగాడ్! ఆగు....... కొంచెం ఆగు!! అది పూర్తిగా ప్రాణాలు వదలలేదు!!" అని హెచ్చరిస్తూ అతన్ని ఆపటానికి ప్రయత్నించాడు.

అతని హెచ్చరికల్ని వినిపించుకునే పరిస్థితిలో లేడు ఆటవికుడు. సరాంగ్ మృగాన్ని చంపినవాడికి, ఆ మృగం యొక్క తలను తన యింటి ముందు అలంకరించుకున్న వాడికి విపరీతమైన గౌరవం లభిస్తుంది. అనుకోకుండా దొరికిన ఆ అవకాశాన్ని ఎందుకు వదులుకుంటాడు అతను ?

కత్తిలాంటి కొండరాయిని పై కెత్తి సరాంగ్ ముందు మోకరించి కూర్చున్నాడతను. షాడో కొట్టిన దెబ్బలకు నజ్జు నజ్జయిన తలను గట్టిగా పట్టుకొని మెడ మీద వేయబోయాడు మరోదెబ్బ.

కొస ప్రాణాలను అతి ప్రయత్నం మీద దాచుకొని చనిపోయినట్లు నటిస్తోంది ఆ క్రూర మృగం. తల మీద చేయి పడిన మరుక్షణం గుండెలు జలదరించేటట్లు గర్జిస్తూ గాలిలోకి లేచింది.

అదిరిపడి వెర్రిగా అరిచాడు ఆటవికుడు. చేతిలోని రాతిని వదిలి వెనక్కి దూకటానికి ప్రయత్నించాడు.

ఇంత లావున నోరు తెరిచి అమాంతం అతని మెడను పట్టుకుంది సరాంగ్. పదునైన కోరలతో పూచిక పుల్లను విరిచినట్లు విరిచి అవతల పడేసింది.

విపరీతమైన బాధతో విలవిలలాడి పోతూ ఎగిరి దాని నడుం మీద దూకాడు షాడో. రెండు చేతులను కలిపి బలమంతా ఉపయోగించి గుద్దాడు వెన్నుమీద.

ఆటవికుడిని ఎటాక్ చేయటంతో అయిపోయింది సరాంగ్ పని. షాడో కొట్టిన దెబ్బకు బాధగా మూలుగుతూ నేల మీదికి వాలిపోయింది. తోకను నేలకేసి తాటిస్తూ రెండుసార్లు గిలగిలా కొట్టుకొని ప్రాణాల్ని వదిలేసింది. దాని మీది నుంచి లేచి ఆటవికుడి శరీరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు షాడో. అప్పటికే అంతా అయిపోయింది. మెడ విరిగిన మరుక్షణం అనంత వాయువుల్లో కలిసి పోయాయి అతని ప్రాణాలు.

బరువెక్కిన గుండెలతో బాధగా నిట్టూర్చి లేచి నిలబడ్డాడు షాడో. విగత జీవుడైన ఆటవికుడి శరీరాన్ని చూడలేక తల ప్రక్కకు తిప్పుకుంటుండగా కనిపించారు అతన్ని చుట్టు ముడుతున్న పాతికమంది దృఢకాయులు.

"పారిపోవటానికి ప్రయత్నించకు మిస్టర్ షాడో. నా అనుచరులను తప్పించుకొని ఒక్క అడుగు కూడా అవతలికి వేయలేవు." నిగ నిగలాడుతున్న రివాల్వర్‌ని అతని కేసి గురి పెడుతూ హెచ్చరించాడు పొట్టిగా, లావుగా వున్న ఒక వ్యక్తి.

ప్రొఫెసర్ విల్సబరీ!

ఆటవిక మిత్రుడి మరణంతో వికలమై పోయిన షాడో మనస్సు ఆలోచించే శక్తిని కోల్పోయింది. పారిపోవటానికి వీలు లేకుండా చుట్టు కమ్ముకున్న దృఢకాయుల్నీ, వారి నాయకుడైన విల్సబరీని చూసేసరికి, అప్రయత్నంగా చేతుల్ని గాలిలోకి ఎత్తి బరువుగా నవ్వాడు.

"నీ స్నేహితుడు ముఖేష్ ప్రస్తుతం మా స్థావరంలోనే వున్నాడు మిస్టర్ షాడో. నీ కోసం నా అనుచరులు అరణ్యమంతా గాలించి వట్టి చేతులతో తిరిగి వచ్చారు. బై ది బై..... నీతో పాటు యింకో యిద్దరు ఏజెంట్లు వున్నారని తెలిసింది...... వాళ్ళు ఏరి?" పొడుగ్గా క్రిందికి వాలుతున్న మీసాలను ఎడమ చేత్తో దువ్వుకుంటూ ప్రశ్నించాడు విల్సబరీ.

వాసు, శ్రీకర్‌లు అంత వరకూ అక్కడే వుండి, అప్పుడే ఎక్కడికో వెళ్ళినట్లు చుట్టూ చూశాడు షాడో.

అది గమనించి నొసలు ముడి వేశాడు విల్సబరీ.

"నీ గురించి నేను విన్న విషయాల్లో అసత్యం ఏదీ లేదని నాకు యిప్పుడు బాగా అర్థం అవుతోంది. నీతో రాని ఏజెంట్ల కోసం, ఇంత చక్కటి ఆత్రుతను ప్రదర్శిస్తున్న నీ శక్తిని తక్కువగా అంచనా వేస్తే తీరని ప్రమాదాలు ఎదురవుతాయి." అంటూ వేగంగా ముందుకు వచ్చి చటుక్కున అతని మెడమీద కొట్టాడు రివాల్వర్ మడతతో.

కనుల ముందు టెక్నికలర్ నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా విరుచుకు పడిపోయాడు షాడో. శరీరం నేలను తాకక ముందే స్పృహ తప్పిపోయింది.

## 19

"రాజూ...... రాజూ......" అంటూ ఎవరో తన భుజాల్ని పట్టుకొని గట్టిగా కుదపటంతో స్పృహ తెలిసి కనులు తెరిచాడు షాడో.

వెంటనే అతనికి కనిపించాడు ముఖేష్. నవ్వుతున్న కనులతో అతని ముఖంలోకి ఆప్యాయంగా చూశాడు.

"ఎక్కడ వున్నాం మనం? విల్స్‌బరీ ఏమైనాడు??" అని అడుగుతూ లేచి కూర్చున్నాడు షాడో.

విల్స్‌బరీ పేరు వినగానే మ్లానమైపోయింది ముఖేష్ వదనం.

"ఇంత వరకూ ఏ పని మొదలు పెట్టినా ఓటమిని చవి చూడటం మనకు అలవాటు లేదు రాజూ..... మొట్టమొదటి సారిగా ఆ అనుభవాన్ని ఎదుర్కొన బోతున్నాము. తెలివి తేటల్లో విల్స్‌బరీ మనల్ని పూర్తిగా డామినేట్ చేశాడు." అంటూ అతని చేయి పట్టుకొని ఒక గోడ దగ్గిరికి తీసుకు పోయాడు.

రివాల్వర్ బుల్లెట్లకు కూడా లొంగనంత దృఢమైన అద్దం ఒకటి బిగించి వుంది ఆ గోడలో. అందులో నుంచి చూస్తే విశాలమైన మైదానం ఒకటి కనిపిస్తోంది. మైదానం మధ్యలో రెండు వందల అడుగుల ఎత్తున కట్టబడి వుంది ఒక ఐరన్ ప్లాట్‌ఫాం. రాడార్ యాంటెన్నా వంటి తళతళ మెరిసే ఒకటి ఆ ప్లాట్‌ఫాం పై భాగంలో బిగించి వుంది.

పలుగులు పెట్టి పొడుస్తున్నట్లు బాధ పెడుతున్న మెడను సవరించుకుంటూ అటువైపు చూసిన షాడో అప్రయత్నంగా వులిక్కిపడి, కనులు నులుముకున్నాడు.

"నువ్వు పొరపాటు పడటం లేదు రాజూ..... రాడార్ యాంటెన్నా మాదిరి కనిపిస్తున్న ఆ సాధనం క్రింద బిగించి వుంది మనకు కావల్సిన ఆటమిక్ డిటనేటర్.... పరిస్థితులు మన చేతుల్ని దాటి పోయాయి......" అంటూ గాఢంగా నిట్టూర్చి విండో దగ్గిర్నించి వెనక్కి తిరిగాడు ముఖేష్.

అతని మాటలు షాడోకి అర్థం కాలేదు. భూమిలో బిలద్వారాలను సృష్టించటానికి పనికి వచ్చే ఆటమిక్ డిటనేటర్ ఆకాశంలో ఏం చేస్తోంది ?

పాంటు జేబులో వున్న సిగరెట్ పాకెట్ ని తీసి షాడో మీదికి విసురుతూ గంభీరంగా నవ్వాడు ముఖేష్.

"ప్రపంచంలో వున్న సైంటిస్టులందరూ ఆటమ్స్ మీదా, అణుబాంబుల మీదా, పరిశోధనలు చేస్తుంటే, వారి కంటె రెండు అడుగులు ముందుకు పోయి, సూర్యరశ్మిని ఆటమిక్ డిటనేటర్ ద్వారా రిఫ్లక్ట్ చేసి వెయ్యి ఆటంబాంబుల కంటె ఎక్కువైన ఆయుధంగా రూపొందించాడు విల్సబరీ. ఆటమిక్ డిటనేటర్ ద్వారా రిఫ్లక్ట్ కాబడిన సూర్యరశ్మి మహోగ్రమైన దావానలాన్ని సృష్టిస్తుంది. ప్రసరించిన

ప్రదేశాన్ని క్షణంలో భస్మీపటలం చేసేస్తుంది. మనం ఆయిల్ అన్వేషణ కోసం తయారు చేయించిన డిటనేటర్ విల్స్‌బరీకి అన్ని విధాల అనుకూలంగా వుపయోగపడుతున్నది. మన ఆయుధంతోనే ముందు మన దేశాన్ని, ఆ తర్వాత ఇతర దేశాల్ని వశపరుచు కోవటానికి పన్నాగాలు పన్నుతున్నాడు......'' అంటూ తనకు తెలిసిన విషయాలను ఏకరువు పెట్టాడు.

తన చెవుల్ని తనే నమ్మలేక శిలా విగ్రహంలా వుండి పోయాడు షాడో. తమ హెలీకాప్టర్ కూలి పోవటానికి ముందు ఒక పర్వతం మీద కనిపించిన వెలుగు అతని కనుల ముందు మెదిలి శరీరం గగుర్పొడిచింది.

అదే సమయంలో నిశబ్దంగా తెరుచుకున్నాయి ఆ గది తలుపులు. పొడవైన మీసాలను దువ్వుకుంటూ లోపలికి వచ్చి వారిద్దరి వంకా పరిశీలనగా చూశాడు విల్స్‌బరీ.

''మీ హెలికాప్టర్‌ని పడగొట్టటానికి వెయ్యిలో పదో వంతు పవర్‌ని కూడా వినియోగించలేదు మిస్టర్ షాడో. నేను తయారు చేసిన ఆయుధాన్ని ఫుల్ పవర్‌తో ప్రయోగిస్తే గడ్డిపోచ మాదిరి భస్మమై వుండేది మీ వాహనం.....'' షాడో మనసులోని ఆలోచనల్ని గమనించినట్లు గదిలోకి రాగానే అన్నాడతను.

విల్‌పవర్‌నంతా కూడ గట్టుకొని తన మనస్సులోని ఆలోచనల్ని దాచేసుకున్నాడు షాడో. విల్స్‌బరీని జయించి అక్కడి నుంచి తప్పించుకోవటం అసంభవమేమో అనిపించ సాగిందతనికి.

''నీతో పాటు వచ్చిన ఏజెంట్ల కోసం నా అనుచరులు అరణ్యాన్నంతా గాలించి వచ్చారు మిస్టర్ షాడో...... ఆటవిక జాతులు తప్ప మరెవరూ నా వాళ్ళకి

కనిపించ లేదు. ఏమయివుంటారు నీ స్నేహితులు? అరణ్యంలో ప్రాణాలు వదిలి వుంటారంటావా ?" సూటిగా ముఖంలోకి చూస్తూ అడిగాడు విల్సబరీ.

పొంగుకు వస్తున్న ఆనందాన్ని అతి ప్రయత్నం మీద అణిచేసుకున్నాడు షాడో. అరణ్యంలో సంచరించటం ఎలాగో తన వద్ద నేర్చుకున్నాడు శ్రీకర్. అమితమైన బలం కల వాసు అతని వెంట వున్నాడు....... విల్సబరీ అనుచరులకు కనిపించ లేదంటే వాళ్ళు ముందుగా జాగ్రత్త పడే వుంటారు......

తన మాదిరిగా ఆటవిక జాతుల చేతికి చిక్కి బయటపడలేక అవస్థలు పడుతూ వున్నారేమో అన్న సంశయం వెంటనే కలిగింది షాడోకి. అతి ప్రయత్నం మీద ఆ ఆలోచన బయటికి నెట్టేశాడు. ఆటవికుల చేతిలో ప్రాణాలు పోగొట్టుకునేటంత తెలివి తక్కువ వాళ్ళు కాదు..... ఏదో ఒకటి చేసి తప్పకుండా ఆత్మరక్షణ చేసుకోగలరు.

ఎన్ని రకాల ఆలోచనలు మనస్సులో మెదులుతూ వున్నా, బయటికి మాత్రం నిర్లిప్తంగా కనిపిస్తున్న షాడో ముఖాన్ని పట్టి పట్టి చూస్తూ తల పంకించాడు విల్సబరీ.

"నీ వాలకం నాకు అనుమానాన్ని కలిగిస్తోంది మిస్టర్ షాడో.... ఇది నా స్థావరం. ఇక్కడ నాకు తెలియకుండా ఒక్క పురుగు కూడా కాలు కదిపి అవతలికి వెళ్ళలేదు. అతి తెలివికి పోయి ఏదైనా చేయాలని అనుకుంటే అది వట్టి వెర్రితనమే అవుతుంది......" అంటూ గాజుతో చేయబడిన విండో దగ్గిరికి పోయి, గోడ మీద రెండు సార్లు గట్టిగా చరిచాడు.

వెంటనే వినిపించటం మొదలు పెట్టింది చెవులు చిల్లులు పడే వికృత శబ్దం. రివాల్వర్ వంటి ఆయుధాల్ని ధరించిన అనేక మంది దృఢకాయులు, పరుగు పరుగున వచ్చి, ఐరన్ ప్లాట్ ఫాం చుట్టూ గోడలా నిలబడ్డారు.

నిజమైన రివాల్వర్లు పట్టుకున్న పది మంది దృఢకాయులు గది ముందు నిలబడి తొంగి చూశారు.

"చూశావా మిస్టర్ షాడో.... ఒక్క రాంగ్ మూవ్‌మెంట్ ఎటువంటి రియాక్షన్స్‌ని సృష్టించిదో చూశావా? నా స్థావరంలో నుంచి బయట పడటం గాని, నా పథకాలకు అడ్డు రావటం గాని అసంభవం. అటువంటి ఆలోచనలు ఏవైనా వుంటే వెంటనే వాటిని మనస్సులో నుంచి తుడిచేసుకోవటం చాలా మంచిది......" అంటూ చిన్నగా నవ్వి గది బయటికి వెళ్ళిపోయాడు విల్సబరీ.

చెమటలు పట్టిన అరిచేతుల్ని పాంటు కేసి రుద్దుకోబోయి, వులిక్కిపడి క్రిందికి చూసుకున్నాడు షాడో.

వట్టి డ్రాయర్, బనియన్స్‌తో వున్నాడతను. పాంటు, షర్టు, బూట్లు అన్నీ విల్సబరీ చేతికి చిక్కాయి.

"చేసేది ఏదో త్వరగా చేసేయటం మంచిది రాజూ..... ఆలస్యం అయిన కొద్దీ మన మూమెంట్స్ విల్సబరీకి అర్థం అయిపోతాయి." లోగొంతుకతో హెచ్చరించాడు ముఖేష్, అతని ప్రక్కకు వచ్చి నిలబడుతూ.

అతను ఇచ్చిన సిగరెట్ పాకెట్‌లో నుంచి మరో సిగరెట్‌ని తీసి వెలిగించుకుంటూ రెండు నిముషాల పాటు దీర్ఘంగా ఆలోచించాడు షాడో. ఒక

నిర్ణయానికి వచ్చినట్లు తల విదిలించి, ద్వారం దగ్గిరికి పోయి బిగ్గిరిగా అరిచి కేకలు పెట్టాడు.

వెంటనే తెరుచుకున్నాయి తలుపులు. రివాల్వర్‌ని గురిపెట్టి, లోపలికి తొంగి చూశారు యిద్దరు దృఢకాయులు.

“చలివేసి చస్తున్నాను...... నా బట్టలు, బూట్లు ఎక్కడ వున్నాయో తెచ్చి పెట్టండి. ఇలా అర్థనగ్నంగా నిలబెట్టటం భావ్యంగా లేదని మీ బాస్‌కి చెప్పండి........” వారి వంక గుర్రుగా చూస్తూ అన్నాడు షాడో.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని, తలుపులు మూసేశారు దృఢకాయులు. పది నిముషాల తరువాత మరోసారి తెరుచుకున్నాయి అవి. నీట్‌గా చుట్ట చుట్టిన షాడో దుస్తుల్ని, బూట్లను పట్టుకొని లోపలకి వచ్చాడు సన్నగా పొడుగ్గా వున్న ఒక వ్యక్తి.

“దిసీజ్ ఫెడరిక్...... మన విల్స్‌బరీ అసిస్టెంట్...... ఎలక్ట్రానిక్స్‌లో విపరీతమైన అనుభవం కల ఇంజనీర్......” అంటూ అతన్ని షాడోకి పరిచయం చేశాడు ముఖేష్.

“ఎస్ మైడియర్ షాడో.... ఎలక్ట్రానిక్స్ లో మాత్రమే కాదు. ఎఫెన్సివ్ యాక్షన్స్‌ని ప్రిపేర్ చేయటంలో కూడా నేను ఎక్స్‌పర్ట్‌నే. ఢిల్లీ నుంచి బయలుదేరకుండా నిన్ను ఆపటానికి ప్రయత్నించింది నేనే. నా అంచనాలను తారుమారు చేసిన నీ తెలివికి నేను ఆశ్చర్యపోతున్నాను.......” అంటూ షాడో దుస్తుల్ని క్రింద పెట్టి బూట్లను మాత్రం అలాగే చేతిలో పట్టుకున్నాడు ఫెడరిక్.

చీమలు పాకినట్లు కంపరం ఎత్తసాగింది షాడో శరీరం. తన బూట్లలో వుండే ఆయుధాల సంగతి అతనికి తెలిసి పోయిందా? తన ఆఖరి ఆలోచన కూడా దారుణంగా దెబ్బ తినబోతున్నాదా??

అతను ఆ మాట అనుకుంటుండగానే చిన్నగా నవ్వుతూ, ఒక బూటు సోల్‌ని గట్టిగా నొక్కాడు ఫెడరిక్. సోల్ ప్రక్కకు జరిగింది. దానిక్రింద వున్న డొల్లలో నుంచి రెండు మెటల్ బాల్స్ దొర్లి అతని చేతిలో పడ్డాయి.

“వెల్ మిస్టర్ షాడో...... వీటిని ఏమంటారు? ఎందుకు ఉపయోగపడతాయి యివి?” వాటిని గోలీల లాగా ఆడిస్తూ అడిగాడతను.

ఎండుకుపోయింది షాడో గొంతు. అత్యంత ప్రమాదకరమైన లిటిల్ టామీ వుంది వాటిలో. భయంకరమైన పాయిజన్ గాస్ ని వెలువరిచే ఇనుప గోలీ కూడా వుంది.

సి.ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్ బృందం తయారు చేసిన అపూర్వ ఆయుధాలు అవి. వాటి దెబ్బను రుచి చూసిన వారికి గాని, అవేమిటో అర్థం కావు. ఫెడరిక్ చేతిలో నుంచి జారి అవి క్రింద పడి, పొరపాటున యాక్టివేట్ అయితే –

ఆ పైన ఆలోచించటానికి మనస్కరించక, బలవంతంగా ముఖం మీదికి ఒక నవ్వును రప్పించుకున్నాడు షాడో.

“వాటిని గురించి అనవసరమైన ఊహలు చేసి బుర్ర పాడు చేసుకోవద్దు. అదృష్టాన్ని కలిగించే మెటల్ గోలీలు అవి. జకార్తాలో ఒక ఫకీర్ వాటిని నాకు యిచ్చాడు. ఎప్పుడూ వెంట పెట్టుకుని తిరిగితే ఎటువంటి ప్రమాదాన్నయినా ఎదుర్కోవచ్చని చెప్పాడు.” అన్నాడు తడుముకోకుండా .

అనుమానంగా చూసి తల విదిలించాడు ఫెడరిక్. షాడో మాటల్ని నమ్మబుద్ధి కాలేదతనికి. అలా అని అనుమాన పడటానికి కూడా వీలు కాకుండా వుంది..... ఎన్ని పరీక్షలు చేసినా మామూలు గోలీల మాదిరిగానే కనిపిస్తున్నాయి అవి...... ప్రమాదం కలిగించే ఆయుధాల మాదిరిగా అనిపించటం లేదు......

"మీ ఇండియన్స్‌కి రకరకాల సెంటిమెంట్స్ వుంటాయని నేను విన్న మాటలు నిజమేననిపిస్తోంది మిస్టర్ షాడో...... నీ వంటి సీనియర్ ఏజెంట్ కూడా ఇటువంటి మూఢ నమ్మకాలు కలిగి వుండటం మాత్రం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది......" అంటూ బూట్లను క్రిందికి వదిలి చేతిలోని మెటల్ గోలీలను షాడో మీదికి విసిరేశాడు.

ప్రాణాలన్నిటినీ చేతుల్లోకి తెచ్చుకొని వాటిని పట్టుకొన్నాడు షాడో. పట్టుకుంటూనే ఒక గోలీ మీద కనపడీ కనపడనట్లు బుడిపెను బలంగా అదిమి ఫెడరిక్ మీదికి విసిరేశాడు.

అదిరిపడి వెనక్కి దూకాడు ఫెడరిక్.

"వాటీజ్ దిస్...... వాటీజ్ దిస్??" అంటూ తన దుస్తుల్లో నుంచి ఒక రివాల్వర్‌ని బయటికి లాగాడు.

మెటల్ బాల్‌ని విసరగానే ఊపిరి బిగపట్టి ప్రక్కకు దూకాడు షాడో. ముఖేష్‌కి సైగ చేసి తలుపులు దగ్గిరికి గెంతాడు.

బుడిపెను నొక్కిన మరుక్షణం కంటికి కనిపించని పాయిజన్ గాస్ ఆ మెటల్ బాల్ లోంచి వెలువడి గదినిండా అలుముకో సాగింది. ఆ గాస్‌ని పీల్చిన

మరుక్షణం విరుచుకు పడిపోయాడు ఫెడరిక్. అతని చేతుల్లో నుంచి జారి క్రింద పడుతున్న రివాల్వర్‌ని అందుకొని షాడో వెనుక నిలబడ్డాడు ముఖేష్.

ఊపిరి బిగపట్టి వున్నారు యిద్దరూ...... పొరపాటున గాలి పీలిస్తే ఫెడరిక్‌కి పట్టిన గతే తమకు కూడా పడుతుందని వారికి తెలుసు.

ఒక నిముషం..... రెండు నిముషాలు గడిచిపోయాయి. బయట వున్న దృఢకాయులు తలుపులు తెరిచే ప్రయత్నం చేయటం లేదు. నోరు తెరిచి వారిని పిలిస్తే పాయిజన్ గాస్ ప్రాణాలు తీస్తుంది. కాదని తలుపులు తడితే, విల్సబరీ ఆరేంజి చేసిన ఆలారం అందరినీ హెచ్చరించి తమ పథకాన్ని పాడు చేస్తుంది.

కత్తులు పెట్టి పొడుస్తున్నంత బాధను కలిగించసాగాయి వారి ఊపిరితిత్తులు. ఎర్రబడిన ముఖంతో షాడో ముఖంలోకి చూశాడు ముఖేష్...... అతని శక్తి హరించుకుపోతోంది.....

"డామిట్..... తలుపులు తెరవండి యూ బ్లడీ బాస్టర్స్ ...... లోపలికి వచ్చిన మీ మనిషి ఏమైపోయాడో చూసుకోండి......" నిశ్శబ్దంగా అరిచింది షాడో అంతరంగం.

అతి ప్రయత్నం మీద మరో అర నిముషం ఆగాడు.... ఆ పైన ఆగటం చేతకాక తలుపుల మీద చేయి వేయబోయాడు.

అదే సమయంలో తెరుచుకున్నాయి తలుపులు. ద్వారంలో ప్రత్యక్షం అయిన రివాల్వర్‌ని లెక్క చేయకుండా ఒకే ఒక జంప్‌తో బయట వున్న కారిడార్‌లోకి దొర్లారు స్నేహితులు యిద్దరూ. పడిన చోట వుండకుండా అలా దొర్లుకుంటూ పది అడుగుల దూరం వెళ్ళిపోయారు.

అనుకోని ఆ పరిణామానికి ఒక్క క్షణం నిశ్చేష్టులై నిలబడి పోయారు గది ముందు కాపలా వున్న గార్డులు. ఆశ్చర్యం నుంచి తేరుకొని అరవటానికి నోళ్ళు తెరిచిన మరుక్షణం వాళ్ళ గుండెల్లోకి ప్రవేశించింది గదిలో నుంచి బయటికి వస్తున్న పాయిజన్ గాస్.

అరుపులు తమ నోళ్ళ వెంట బయటికి రాకముందే మొదలు నరికిన చెట్లలా విరుచుకు పడిపోయారు వాళ్ళు.

దూరంగా పడిన వారి రివాల్వర్లను తీసుకొని ఎదుట కనిపిస్తున్న కారిడార్ లోకి పరుగు తీశారు స్నేహితులు యిద్దరూ.

"ఈ కారిడార్ చివర ఒక గదిలో పెద్ద వైర్‌లెస్ ట్రాన్స్ మీటర్ వుంది. దాని సహాయంతో నేను మన వాళ్ళను మెస్సేజి పంపుతాను. విల్స్‌బరీ విషయం నువ్వు చూసుకో రాజూ......" అంటూ షాడో కంటె ముందుగా పోయి కారిడార్ చివర వున్న ఒక గది ముందు నిలబడ్డాడు ముఖేష్.

గోడల్ని తాకకుండా జాగ్రత్తపడుతూ తలుపులు ప్రక్కన రెడీగా నిలబడ్డాడు షాడో.

రెండు క్షణాలు ఆగి, మెల్లిగా తలుపులు తట్టాడు ముఖేష్.

గోడల్ని తాకితే అలారమ్స్ మ్రోగుతాయని అన్నాడు విల్స్‌బరీ. తలుపుల్ని తాకితే అవి మ్రోగుతాయో మ్రోగవో అతనికి తెలియదు. ఒక వేళ మ్రోగే పక్షంలో శరవేగంతో అక్కడి నుంచి పారిపోవటానికి సిద్ధంగా నిలబడే చేశాడు ఆ పని.

అలారమ్స్ మ్రోగలేదు.......

" ఎవరది?" విసుగ్గా వినవచ్చింది లోపలి నుంచి ఒక కంఠం.

“ఓపెన్ ది డోర్ యూ బ్లడీ ఇడియట్..... నేను కాక ఇంకెవరు ఈ వేళలో ఇక్కడికి వస్తారు?” ఫెడరిక్ మాదిరిగా విసుగ్గా సమాధానం యిచ్చాడతను.

మరో రెండు క్షణాల తరువాత తెరుచుకున్నాయి తలుపులు. తెల్లటి టోపీ ధరించిన ఒక తల బయటికి తొంగి చూసింది.

చేతిలోని రివాల్వర్‌ని వెనక్కి తిప్పి సరిగ్గా తల మధ్యలో కొట్టాడు షాడో. గోడలకు తగలకుండా మెడ పట్టుకొని బర్రున బయటికి లాగేశాడు.

ఏం జరుగుతున్నదో అర్థం కాకముందే స్పృహ తప్పి వ్రేలాడ బడిపోయింది టోపీ తాలూకు భారీ ఆకారం.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా గదిలోకి అడుగు పెట్టి చుట్టూ చూశాడు ముఖేష్. ఒక టేబిల్ మీద వున్న ట్రాన్స్‌మీటర్‌ని గమనించగానే తృప్తిగా తల వూపి తలుపులు మూశాడు.

వెంటనే క్రింద పడిన టోపీవాలను కారిడార్ మధ్యలోకి లాగి ముందుకు పరుగు తీశాడు షాడో. పది అడుగుల దూరంలో అతనికి కనిపించాయి క్రిందకి దారితీసే మెట్లు. వాటి మీద అడుగు వేయబోతుండగానే, ముఖం చాటు చేసింది అంత వరకూ వారిని వెన్నంటి వున్న అదృష్ట దేవత.

బరువైన రైఫిల్స్‌ని పట్టుకొని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ పైకి వస్తున్నారు విల్సబరీ అనుచరులు యిద్దరు. మెట్లమీద ప్రత్యక్షం అయిన షాడోని చూడగానే బిగ్గరిగా అరిచి రైఫిల్స్‌ని ఎయిమ్ చేశారు.

తల్లక్రిందులుగా వెనక్కి పల్టీకొట్టి ఒక గోడకు గుద్దుకున్నాడు షాడో. అదే సమయంలో అతని తలమీది నుంచి అవతలికి పోయాయి రైఫిల్ బుల్లెట్లు.

గోడకు గుద్దుకొని బొప్పెకట్టిన తలను సవరించుకుంటూ తన దగ్గిర వున్న రివాల్వర్ ని వారి వైపు తిప్పాడు షాడో.

ధనాధన్ మని కారిడార్ దద్దరిల్లేటట్లు గర్జించింది అది. నిప్పులు వెదజల్లుతూ పోయి దృఢకాయుల గుండెల్లో దిగబడ్డాయి బుల్లెట్లు. తమ ఆయుధాల్ని వదిలి నేల కూలిపోయారు వారిద్దరూ.

రివాల్వర్ మ్రోతలకి తమ గుట్టురట్టు అవుతుందేమో అని భయపడుతున్నాడు షాడో. అలా భయపడవలసిన అవసరం లేదని వెంటనే తెలిసిపోయిందతనికి.

తల్లక్రిందులుగా గోడకు గుద్దుకున్న మరుక్షణమే రట్టు అయిపోయింది వారి గుట్టు. గోడల్లో నిక్షేపించబడ్డ అలారంలు అతని శరీరం తగిలిన మరుక్షణం యాక్టివేట్ అయినాయి. చెవులు చిల్లులు పడే వికృత శబ్దాలతో దద్దరిల్లి పోసాగింది ఆ ప్రదేశం.

జాగ్రత్తలన్నింటినీ గాలికి వదిలేసి ముందుకు పరుగు తీశాడు షాడో. మరో పది అడుగుల దూరం పోగానే షార్ప్‌గా ఒక మలుపు తిరిగింది కారిడార్. మలుపులో అతనికి ఎదురైనారు పరుగు పరుగున వస్తున్న పాతిక మంది దృఢకాయులు.

“ఇది షాడో పనే..... సందేహం లేదు....... మట్టు బెట్టండి..... అతన్ని పట్టుకుని హతమార్చేయండి......” అని అరుస్తూ వారి వెనుక ప్రత్యక్షం అయ్యాడు విల్సబరీ.

ఎడమ చేతిలో వున్న మెటల్ బాల్ బుడిపెను గట్టిగా అదిమి ముందుకు విసిరేశాడు షాడో. చెవులు రెండూ గట్టిగా మూసుకొని కారిడార్ గోడలకు అనుకున్నాడు.

పది కూడా లెక్క పెట్టకుండానే బ్రద్దలైంది మెటల్ బాల్. పాయిజన్ గోళీ మాదిరి నిశ్శబ్దంగా పని చేయదద. గుండెలు జలదరించే శబ్దాన్ని వెలువరుస్తుంది. పది హేండ్ గ్రనేడ్స్ మాదిరి దారుణమైన ప్రేలుడును సృష్టిస్తుంది.

ఆ ప్రేలుడు అదటుకు రెండుగా చీలింది కారిడార్...... ముక్కలు ముక్కలై తలో ఒక మూలకు విసిరి వేయబడ్డారు విల్సబరీ అనుచరులు.

విల్సబరీ కూడా వారితో పాటు ఖతమ్ అయిపోయాడని అనుకున్న షాడోకి నిరాశ ఎదురయింది.

"ప్లాట్‌ఫాంని కవర్ చేయండి..... అందరూ ప్లాట్‌ఫాంని కవర్ చేయండి..... షాడోని ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరికి రానీయకండి ......" అని అరుస్తూ వెను తిరిగి పరుగులు తీస్తున్నాడతను.

ఆ మాటలు షాడోకి అర్థం కాలేదు. అయినా సరే లెక్క చేయకుండా విల్సబరీ వెనుక పరుగు తీశాడు.

పాము మెలికలు తిరిగినట్లు వంకరలు తిరుగుతూ ఏటవాలుగా క్రిందికి దిగింది కారిడార్. ఉన్నట్లుండి ఒక పెద్ద సొరంగం ముందుకు పోయి అంతం అయిపోయింది.

వెనుకా ముందు చూసుకోకుండా ఆ సొరంగంలోకి దిగాడు విల్సబరీ. రెండు క్షణాల తరువాత అతని అడుగుల చప్పుడు కూడా వినిపించుకుండా పోయింది.

ఒక ప్రక్కగా బిగించి వున్న గాజు విండో దగ్గిరికి పోయి బయటికి తొంగి చూశాడు షాడో.

దాదాపు వంద మంది దృఢకాయులు గుంపులుగా ఐరన్ ప్లాట్ ఫాం దగ్గిరికి పోతున్నారు. ఆయుధాల్ని రెడీగా పట్టుకొని దాని చుట్ట గోడలా నిలబడుతున్నారు.

వారిని దాటి ప్లాట్‌ఫాంని సమీపించటం అసంభవం. మైదానంలో అడుగు పెట్టిన మరుక్షణం తమ ఆయుధాలతో ప్రాణాలు తీసేస్తారు వాళ్ళు.

అత్యంత విలువైన ఆటమిక్ రిఫ్లక్టర్‌ని అక్కడే వదిలి, విల్సబరీ ఎక్కడికి పోయాడో షాడోకి అంతుబట్టలేదు.... ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తూ అక్కడే నిలబడటం కంటే అతన్ని అనుసరించి పోవటమే మంచిదని నిశ్చయించుకొని, సొరంగం వైపు పరుగు తీశాడు షాడో.

పది నిముషాలు తరువాత ఉన్నట్లుండి విశాలమైన హాలు వంటి ప్రదేశం అతనికి ఎదురయింది. రకరకాల మిషన్స్‌తో, ఎలక్ట్రానిక్ కంప్యూటర్స్‌తో నిండి వుంది ఆ ప్రదేశం.

ఒక మెషీన్ ముందు నిలబడి ఏవో మీటలు నొక్కుతున్నాడు విల్సబరీ..... పరుగు పరుగున వచ్చిన షాడోని చూడగానే బిగ్గిరిగా నవ్వి ఒక మీట మీద వేలు వేశాడు.

బ్రేకులు వేసినట్లు ఆగిపోయాయి షాడో పాదాలు. చేతిలో వున్న రివాల్వర్‌ని చటుక్కున పైకి ఎత్తి అతని కేసి గురి పెట్టాడు.

మరింత బిగ్గరిగా నవ్వి మీటను నొక్కాడు విల్సబరీ.

ట్రిగ్గర్‌ని నొక్కబోతున్నాడు షాడో..... విల్సబరీ ఖతమ్ అయిపోయినట్లే అనుకుంటున్నాడు. ఆ పని జరగక ముందే రాక్షస హస్తం ఏదో గుంజినట్లు ఎగిరి ఒక గోడకు అతుక్కుపోయింది అతని రివాల్వర్.

"నా శక్తిని తక్కువగా అంచనా వేశావ్ మిస్టర్ షాడో....... అత్యంత శక్తివంతమైన ఆటమిక్ రిఫ్లక్టర్‌ని కనిపెట్టగలిగిన నేను మామూలు రివాల్వర్ల మూలకంగా ప్రాణాలు పోగొట్టు కుంటానని భ్రమ పడుతున్నావు. నేను తయారు చేసిన మాగ్నటిక్ మెషీన్ ముందు నీ రివాల్వర్లు ఎందుకూ పనికిరావు. నా స్థావరంలో అడుగు పెట్టి, నా పథకాల్ని నాశనం చేయ సంకల్పించినందుకు నువ్వు, నీ దేశం తగిన పెనాల్టీని పే చేయక తప్పదు. నీ కళ్ళ ముందే నీ దేశాన్ని సర్వనాశనం చేస్తాను చూడు......" అంటూ మరో మెషిన్ దగ్గిరికిపోయి, దాని మీద వున్న మీటల్ని నొక్కసాగాడు విల్సబరీ.

ఆ మెషీన్ ప్రక్కనే గోడలో బిగించి వుంది ఒక టెలివిజన్ స్క్రీన్. అందులో ప్రత్యక్షం అయింది మైదానంలోని ఆటమిక్ రిఫ్లక్టర్ . అంత వరకూ తూర్పు దిశగా చూస్తూన్న రాడార్ యాంటెన్నా వంటి పరికరం మెల్లిగా ప్రక్కకు తిరిగి భారతదేశం పైపు గురిపెట్టబడసాగింది.

విపరీమైన ఆందోళన మనస్సును మెలి పెడుతుండగా, ముందుకు దూకబోయాడు షాడో.

కరెంట్ షాక్ కొట్టినట్లు జలదరించింది అతని శరీరం. ఎవరో పట్టుకుని వెనక్కి విసిరేసినట్లు గింగిరాలు తిరుగుత పోయి ఒక గోడకు గుద్దుకున్నాడు.

అది చూసి వికృతంగా నవ్వాడు విల్స్‌బరీ.

“నా మాగ్నెటిక్ మెషీన్ గురించి నీకు యిందాకే చెప్పాను మిస్టర్ షాడో. నువ్వు నన్ను ఏమీ చేయలేవు..... నా శక్తి ఏమిటో నీకు పూర్తిగా చవి చూపించిన తర్వాత తీరికగా మాట్లాడుకుందాం...... నన్ను హతమార్చే ఆలోచన మానుకొని జాగ్రత్తగా చూస్తూ వుండు.......” అంటూ టెలివిజన్ స్క్రీన్ మీద కనిపిస్తున్న ఆటమిక్ రిఫ్లక్టర్ కదలికల్ని పరిశీలించుకోవటంలో మునిగిపోయాడు.

కత్తులతో తన హృదయాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నంత బాధ పడుతూ గోడకు ఆనుకొని శిలా విగ్రహంలా నిలబడిపోయాడు షాడో.

తమ ఎస్సైన్‌మెంట్ అట్టర్ ఫెయిల్యూర్ అయింది. తను చేసిన పొరపాటుకు తన దేశం సర్వనాశనం కాబోతోంది.

ఉన్నట్లుండి షాడో దృష్టిని ఆకర్షించింది ఒక దృశ్యం.

విల్స్‌బరీ నిలుచున్న ప్రదేశానికి అవతల యింకా కంటిన్యూ అవుతూనే వుంది సొరంగం. పురాతన కాలంలో అగ్నిపర్వతం నుంచి వెలువడిన లావాద్రవం మూలకంగా తయారయిన మార్గం అది. బహుశా సారికన్ ఐలాండ్ చివరి భాగంలో సముద్రం దగ్గిరకు పోయి ఎండ్ అవవచ్చు......

ఆ సొరంగంలో నుంచి అడుగులో అడుగు వేస్తూ ముందుకు వస్తున్నాయి మట్టి కొట్టుకున్న ఆకారాలు రెండు.

తను కలకంటున్నానేమో అన్న అనుమానం వచ్చి కనులు నులుముకున్నాడు షాడో, చేతిని గిల్లుకున్నాడు.

కల కాదు అది. పచ్చి యదార్థం.

మట్టి కొట్టుకున్న ముఖాలతో, చినిగి పోయిన దుస్తులతో, నీరసంగా అడుగులు వేస్తూ వస్తున్నారు వాసు, శ్రీకర్.

వాళ్ళు ఎలా అక్కడికి రాగలిగారో తెలుసుకోవాలన్న కోరిక షాడోకి కలుగలేదు. వారిని చూడగానే బిగ్గిరిగా అరిచి, రెండుసార్లు గాలిలోకి ఎగిరాడు.

టెలివిజన్ స్క్రీన్ మీదనే దృష్టిని కేంద్రీకరించి వున్న విల్సబరీ నొసలు విరుస్తూ అతని వైపు చూశాడు.

"నా దేశాన్ని నాశనం చేయటం నీ తరం కాదని పందెం కాస్తాను మిస్టర్ విల్సబరీ...... నీ ముందున్న మెషీన్స్‌ని నాశనం చేస్తే, నీ శక్తి సర్వనాశనం అయిపోతుందని ఖచ్చితంగా చెప్పగలను." అన్నాడు షాడో, అతి బిగ్గిరిగా.

మరింత అనుమానం విల్సబరీ ముఖంలో కదలాడింది.

"నీకు పిచ్చి ఎక్కింది మిస్టర్ షాడో...... నీ మెంటల్ బాలెన్స్ కంట్రోల్ తప్పింది....... నీ కళ్ళ ముందే ఆటమిక్ రిఫ్లక్టర్‌ని ప్రయోగిస్తున్నాను చూడు" అంటూ ఒక ఎర్రటి బటన్ మీద వేలు వేయబోయాడు.

"పిచ్చి ఎక్కింది మాకు కాదు మిస్టర్ విల్సబరీ....... నీకు, నీ అంతు చూడటానికి మేము నలుగురం బయలు దేరామని తెలిసి కూడా నువ్వు జాగ్రత్తపడక పోవటం నీ మెంటల్ బాలెన్స్ కంట్రోల్ తప్పినట్లు తెలియచేస్తోంది. నీ స్థావరంలోకి రావటానికి ఎన్ని మార్గాలున్నాయో తెలుసుకోలేని నువ్వు మా

దేశాన్ని నాశనం చేయగలనని అనుకోవటం వె[ర్రితనం కాక యింకేమని పించుకుంటుంది?" అంటూ అతని వెనుక [ప్రత్యక్షమై మెడ పట్టుకొని బ[రున వెనక్కి లాగాడు శ్రీకర్.

కీచుగా అరిచాడు విల్సబరీ. ఎగిరి గంతులు వేసి అతని చేతుల్ని విదిలించి కొట్టాడు.

"మైగాడ్! అతన్ని వదిలి పెట్టకండి! ఆ మెషీన్స్ దగ్గిరికి రానీయకండి" అని వారిని హెచ్చరిస్తూ ముందుకు దూకాడు షాడో.

మాగ్నెటిక్ మెషీన్ పని చేస్తూనే వుంది. ముందుకు అడుగు వేసిన మరుక్షణం లాగిపెట్టి కొట్టింది అది. మరోసారి తల[క్రిందులయినంత పని చేసి సొరంగం గోడ మీద పడ్డాడు షాడో.

పిచ్చి ఎక్కినట్లు అరుస్తూ మెషీన్స్ దగ్గిరికి పోబోయిన విల్సబరీని అమాంతం గాలిలోకి ఎత్తి సొరంగం వెనక్కి విసిరేశాడు వాసు.

గింగిరాలు తిరుగుతూ పోయి సొరంగంలో ముందుకు పొడుచుకు వచ్చిన ఒక బండరాయి మీద పడ్డాడు విల్సబరీ. తలకు బలమైన దెబ్బ తగలటంతో బిగ్గిరిగా అరిచి లేచి నిలబడ్డాడు.

సడన్ గా [ప్రత్యక్షం అయింది అతని చేతిలో ఒక రివాల్వర్ .

"నా పథకాలను నాశనం చేయటానికి వచ్చిన మిమ్మల్ని సర్వనాశనం చేయందే నాకు శాంతి లేదు. చావండి..... అందరూ చావండి....." అంటూ కళ్ళు మూసుకుని [ట్రిగ్గర్ నొక్కాడు.

"గెట్ డౌన్.... గెట్ డౌన్ ఎవ్రీబడి......" అని అరుస్తూ తలను రెండు చేతులతోను కప్పుకొని నేలమీద పడిపోయాడు షాడో. అతను హెచ్చరించాల్సిన అవసరం లేకుండానే అతని కంటే ముందుగా నేలను కౌగలించుకున్నారు వాసు, శ్రీకర్ లు.

ఒకదాని వెనుక ఒకటిగా వచ్చి అక్కడ వున్న మెషీన్స్‌లో దిగబడ్డాయి బుల్లెట్లు. టప్ టప్ మని శబ్దం చేస్తూ గాలిలోకి లేచాయి రంగు రంగుల పొగలు. ఉన్నట్లుండి చెవులు చిల్లులు పడే మ్రోతతో బ్రద్ధలైంది ఒక మెషీన్. సొరంగం గోడలకు తగిలి వికృతంగా ప్రతి ధ్వనించిన ఆ మ్రోతను వింటూ పైకి లేవబోయిన షాడో ఎందుకో అనుమానం వచ్చి, నేలను చెవిని ఆనించాడు.

అతి సున్నితమైన మనస్తత్వాన్ని కలిగి వుంటాయి అగ్ని పర్వతాలు. అవి ఎప్పుడు నిద్రలేస్తాయో, ఏ విధంగా పైకి పొంగుతాయో ఎవరూ చెప్పలేరు.

"కమాన్..... కమాన్.... ఎవ్రీబడీ లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్" అని హెచ్చరిస్తూ పైకి లేచి కారిడార్ లోకి పరుగు తీశాడు షాడో.

రెండోసారి చెప్పించుకోలేదు అతని సహచరులు. తూనీగల్లా ముందుకు దూకి అతన్ని అనుసరించారు.

బుల్లెట్ల దెబ్బలకు నాశనమై పోయిన మాగ్నెటిక్ మెషీన్ వారిని ఏ విధంగాను అడ్డుకోలేక పోయింది.

"పారిపోతారా? ఎక్కడికి పారిపోతారా? మిమ్మల్ని యిక్కడే భూస్థాపితం చేస్తాను......." అంటూ పిచ్చి ఎక్కినట్లు పరిగెత్తుకు వచ్చి, పొగలు వెలువరిస్తున్న ఒక మెషీన్ మీది మీటల్ని నొక్కసాగాడు విల్సబరీ.

తన పథకాలు దెబ్బతిన్నాయన్న ఆవేశంలో షాడో మాటలు అతనికి అర్థం కాలేదు. షాడో కనిపెట్టిన విషయం అతనికి అంతు బట్టలేదు.

అతని చేతులు పడిన మరుక్షణం మరికొన్ని వికృత శబ్దాలు చేసి ఒక్కసారిగా బ్రద్దలైపోయింది ఆ మెషీన్. ఆ అదటుకు పోయి, పది అడుగుల దూరంలో పడ్డాడతను.

అక్కడితో పూర్తిగా నిద్రలేచింది సారికన్ వాల్కెనో. ఫెట ఫెటార్భాటాలు చేస్తూ సొరంగపు నేలను పగల గొట్టుకొని బయటికి దూసుకు వచ్చింది కళ ఫెళ కాగుతున్న లావా ద్రవం.

“ఇంపాజిబుల్..... దిసీజ్ ఇంపాజిబుల్..... ఇది ఏనాడో చల్లారిపోయింది........ చల్లారిపోయింది గనుకనే నా స్థావరం యిందులో ఏర్పాటు చేసుకున్నాను..... నో..... ఇలా జరగటానికి వీలు లేదు..... వీలు లేదు......” అని అరుస్తూ క్రింది నుంచి లేచి కారిడార్ వైపు పరిగెత్తబోయాడు విల్స్‌బరీ.

సముద్రపు కెరటాల్లా వువ్వెత్తున లేచి అతన్ని తనలోకి లాక్కుంది లావా ద్రవం. సెగలు పొగలు వెలువరిస్తూ సొరంగం ద్వారం గుండా బయటికి పరుగులు తీసింది.

“పారిపొండి..... పారిపోయి మీ ప్రాణాలను దక్కించుకోండి..... పారిపొండి “ అని మైదానంలో వున్న విల్స్‌బరీ అనుచరుల్ని హెచ్చరిస్తూ ముఖేష్ వున్న అంతస్థులోకి పరుగు తీశాడు షాడో.

అప్పుడే గదిలో నుంచి బయటికి వస్తున్నాడతను.

"అండమాన్ దీవుల్లో మన నావీ కమాండర్స్‌కి మెస్సేజి అందింది. నావీ హెలీకాప్టర్లు, రెండు యుద్ధనౌకలు యిటుగా బయలు దేరాయి. అవి వచ్చేవరకూ –" అంటూ మాటల్ని మధ్యలోనే ఆపాడతను.

భూకంపం వచ్చినట్లు కదులుతోంది కారిడార్. ఏ క్షణంలో నైనా విరిగి పడిపోయేటట్లున్నాయి గోడలు.

ఏం జరిగిందో ఒకరు చెప్పాల్సిన అవసరం లేకుండానే గ్రహించి, గిర్రున వెనుతిరిగాడతను. వేగంగా పరుగులు తీస్తూ, కారిడార్ రెండో ప్రక్కన వున్న మెట్లమీదుగా పైకి తీసుకు పోయాడు తన వారిని.

అక్కడి నుంచి ఏటవాలుగా వున్న ఒక కొండ చెరియ మీదుగా, అగ్నిపర్వతం అవలివైపుకు వారు చేరుకోవటం, కారిడార్స్ వున్న కాంక్రీట్ భవనం పేక ముక్కలతో చేయబడినట్లు కూలిపోవటం ఒకేసారి జరిగింది.

"సర్వనాశనం జరిగింది...... విల్స్‌బరీ స్థావరంతో పాటు మన ఆటమిక్ డిటనేటర్ కూడా నాశనమై వుంటుంది" ఆకాశంలోకి లేస్తున్న పొగలను చూస్తూ ఆవేదనగా అన్నాడు ముఖేష్.

సరిగ్గా రెండు రోజుల తరువాత శాంతించి సద్దు మణిగింది సారికన్ వాల్కెనో..... అండమాన్ దీవులనుంచి వచ్చిన ఇండియన్ హెలీకాప్టర్లలోని నౌకాదళ ఇంజనీర్లకు సగం కూలిపోయిన అగ్నిపర్వతపు అంచుల మధ్యగా కనిపించింది చెక్కు చెదరని ఆటమిక్ డిటనేటర్.

"నాకు తెలుసు గురూ.... ఎవరు తీసుకున్న గోతిలో వాళ్ళే పడతారని, పరాయి వాళ్ళకు ఎటువంటి ప్రమాదమూ వుండదని మా నాయనమ్మ చెప్పుతూ

వుండేది...... పాపం తన దుర్మార్గానికి తనే బలి అయ్యాడు విల్సబరీ...... మనకు, మన ఆస్తికి ఎటువంటి డామేజి జరగలేదు.... మా నాయనమ్మ మాటలు నిజమని తేలిందా లేదా?" తమ కోసం వచ్చిన హెలీకాప్టర్‌లో కూర్చుంటూ అన్నాడు శ్రీకర్.

హెలీకాప్టర్ గాలిలోకి లేచిన క్షణం నుంచీ సముద్రం మీదికి వెళ్ళేదాకా క్రింద వున్న అరణ్యాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూనే వున్నాడు షాడో.

మరో పది నిమిషాల్లో ఐలాండ్‌ని క్రాస్ చేస్తాననగా, అతనికి అగుపించారు పాతిక మంది వ్యక్తులు.


విశాలంగా వున్న ఒక ఖాళీ స్థలంలో కూర్చుని, అడవి దుంపల్ని కాల్చుకు తింటున్నారు వాళ్ళు.

అగ్ని పర్వతం వద్ద జరిగిన ఇన్సిడెంట్ ఝరియా వారికి, పాకిస్థాన్ వారికి యింకా అర్థం కాలేదు. ఏదో ఒక విధంగా విల్సబరీ స్థావరాన్ని కనిపెట్టి, అటామిక్ డిటనేటర్‌ని సంపాదించుకోవాలనే ప్రయత్నం లోనే వున్నారు వాళ్ళు.

తమకు వెయ్యి అడుగుల ఎత్తులో ఆ డిటనేటర్ భారతదేశం వెళ్ళి పోతున్నదని గాని, తమ చుట్టూ వున్న పొదల్లో ఎదురు ముళ్ళని రెడీగా పట్టుకొని నంగా జాతి నరమాంస భక్షకులు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని గాని వాళ్ళకి యింకా అర్థం కావటం లేదు.

"గుడ్ బై ఎవ్రీబడీ...... బ్రతికి బాగుంటే మరోసారి మరో చోట మరో సమయంలో కలుసుకుందాం. గుడ్ బై....." అనుకుంటూ సీటు వెనక్కి వాలి కనులు మూసుకున్నాడు షాడో.

**- సమాప్తం –**


FIGHTING
FOUR
MADHU BAABU